
ఆత్మబోధ

ATMA BODHA

(శ్రీ శంకర భగవత్పాదుల విరచితం)



ఆంగ్ల వాఖ్యానం:

స్వామి చిన్మయానంద

ఆత్మబోధ

Ātma Bōdha

CHINMAYARANYAM

ఆంగ్లవ్యాఖ్యానం :

స్వామి చిన్మయానంద

తెలుగు అనువాదం :

స్వామి చిదానంద

చిన్మయారణ్యం పబ్లికేషన్స్ ట్రస్టు

భీమవరం

ఆత్మబోధ

శ్లో॥ తపోభిః క్షీణపాపానాం శాంతానాం వీతరాగిణామ్ ।
ముముక్షూణా మపేక్ష్యోఽయ మాత్మబోధో విధీయతే ॥ 1 ॥

తా॥ ఆత్మజ్ఞానమును విమర్శించు ఆత్మబోధయను ఈ గ్రంథమును తపస్సుచేత పాపములు తొలగి నిర్మలురై, హృదయమున ఎట్టి వేదనలు లేక, శాంత మనుభవించు చుండు మోక్షాపేక్షులకొఱకై లిఖించుచున్నాను.

పరిపూర్ణ ఆత్మసాక్షాత్కార మనుభవించుచుండిన జగద్గురుడగు శ్రీ శంకరులు, ఈ గ్రంథమును పఠించగలవారికి కొన్ని యోగ్యతలుండగల ఆవశ్యకతను, పీఠికవలె తెలుపుచున్నాడు. ఈ శ్లోకము 'అనుబంధ చతుష్టయ' మను విషయమును కూడా నిర్దేశించుచున్నది.

సంస్కృతభాషయందుగల శాస్త్రగ్రంథములలో, గ్రంథమున చర్చించబడు విషయమును, ప్రథమశ్లోకమున సూచించుట సంప్రదాయము. గొప్ప గ్రంథము లలో ఇట్టి విషయములు విపులముగా విమర్శించబడుచున్నవి. ఆత్మబోధ యనునది ఉపగ్రంథము గనుక ఇచ్చట నామమాత్రమున చూపింపబడి యున్నది. అట్టి ఉపోద్ఘాత లక్షణములు నాలుగును --- 1) విమర్శింపబడు విషయము 2) తత్ఫలము, 3) సిద్ధాంతము తెలుపువారికిని, సిద్ధాంత ఫలమునకు గల సంబంధము. 4) గ్రంథపఠనమునకు యోగ్యులగువారి లక్షణములు.

'ఆత్మబోధ' యనుటవలననే విషయము స్పష్టమగుచున్నది. ముముక్షువనగా, తీవ్రమోక్షేచ్ఛగలవారు, అనగా కోరబడు ఫలము, వ్యక్తిగత సర్వవిధ బంధమోచనము.

ఈ గ్రంథము పఠించుటకు యోగ్యులెవరనగా, అనుబంధ చతుష్టయ లక్షణములు గలవారు. 1. నిత్యానిత్య వస్తువివేకము 2. ఇహాముత్ర ఫలభోగ విరాగము 3. శమాదిషట్కసంపత్తి (శమము, దమము, ఉపరతి, తితీక్ష, సమాధానము, శ్రద్ధా) 4. మోక్షమునందు తీవ్ర ఇచ్ఛ. *

ఒక వ్యక్తి ఒక భాండాగారమునందలి గ్రంథములనెల్ల చదివి ముద్రించినట్లు విషయములనెల్ల చూచియుండవచ్చును. అయినను, ఆశ్రమ ప్రత్యక్ష ప్రయోజన శూన్యముగ నుండవచ్చును. పారమార్థిక విషయమున గూడ, కేవల గ్రంథపఠనము ప్రత్యక్ష ప్రయోజనకరముగ నుండజాలదు. శ్రద్ధావంతుడగు ప్రతి సాధకుడు తాను సంపాదించిన జ్ఞానమును జీర్ణము చేసికొని, అట్టి జ్ఞానము తన తీర్మాన రూపమున కార్యములలో ప్రకాశింపజేయుచుండవలెను.

ఒక గురువొక గ్రంథమును లఖించునపుడు, అది ఒక అంతస్థునకు చేరిన శిష్యులకు ఉపయోగపడగలదని నిర్దేశించుచున్నాడు. ప్రతి పాఠ్యగ్రంథము కొన్ని లక్షణములతో కూడిన తరగతి విద్యార్థులకొరకు నిర్ణయించబడుచున్నది. ఆ గ్రంథమువలన వారుమాత్రము పూర్ణఫలమును పొందగలరు. ఆరంభ శ్లోకముననే, తానెట్టి తరగతికి చేరిన సాధకులకొఱకై, ఈ ఆత్మబోధయను గ్రంథమును నిర్దేశించుచున్నాడో, శ్రీ శంకరులు విమర్శించుచున్నారు.

బాహ్యప్రపంచముతో మనము సంపర్కము పొందుటయందు, ఆత్మ నిగ్రహమునకై చేయు ప్రతి ప్రయత్నమును, మన ఆత్మోద్ధారమునకై మన మంకితము చేయు ప్రతి ఉత్తమభావమును, తపస్సు అనబడును. యాత్రలు చేయుట, ఉపవాసము లుండుట మొదలుకొని, జపము, ధ్యానము, చేయు ప్రతి పారమార్థిక ఆత్మనిగ్రహ ప్రయత్నమున్ను వివిధ రకముల తపస్సగుచున్నవి. ఈ సాధనల మూలమున వ్యక్తి యందుగల పాపములు క్షీణించుచున్నవి.

---

* *ఈ విషయము మరీ విపులముగ వివేకచూడామణి యందు చూడనగును.*

ఏ కార్యము, కార్యమువలన పాపమనబడదు. అట్టి కార్యములు మరల మరల చేయగల వాసన, తత్కార్య రూపమున విపరీతముగ ఆలోచించుట--- ప్రమాద కార్యము చేయుటవలన మనసునందు నిలువగల దుర్వ్యవహారచింత- 'పాప' మనబడును. చిరకాల ఆత్మనిగ్రహమువలన ఇట్టి పాపచింతనలు శక్తిని కోల్పోవుచున్నవి.

ఇట్టి ప్రయత్నమువలన మరియు పారమార్థిక సాధనలవలన, శారీరక ఆవేదనలను బుద్ధిపూర్వకముక నిగ్రహించుటవలన, తత్ఫలితముగ హృదయమందు ప్రశాంతత ఏర్పడుచున్నది. ఈ విధముగ శాంతిజెందిన మనసున అందోళనలు మందగిల్లి, మోహములు, అనురాగములు సన్నగిల్లుచున్నవి. తపస్సువలన దుర్వాసనలను క్షీణింపగలిగి, హృదయమున అనుభవనీయ శాంతము కనుగొని కోరికల ఆందోళన తాత్కాలికముగ విశ్రమింపజేయగలిగిన వ్యక్తి, శ్రద్ధావంతుడగు సాధకుడై యుండినచో, తన వ్యక్తిగత బంధములను తొలగించుకొనుటకు తీవ్ర ఆవేదన యుండినచో, అట్టివాడు ఈ ఆత్మబోధ యనుగ్రంథమును విచారించ యోగ్యుడు.

ఇతరులెవరుకాని ఈ గ్రంథమును చదువకూడదని, విచారించకూడదని ఈ శ్లోకము ప్రకటించుటలేదు. ఇందుగల సిద్ధాంతములు చక్కగా బోధపడుటకు తత్ఫలితము పొందుటకు పాఠకులు, పై లక్షణములను సంపాదించుకొనుట లెస్సయని హితము పలుకుచున్నది.

శ్లో॥ బోధోఽన్య సాధనేభ్యోహి సాక్షాన్మోక్షైక సాధనమ్ ।
పాకస్యవహ్నివద్ జ్ఞానం వినా మోక్షో న సిధ్యతి ॥ 2 ॥

తా॥ వంటచేయుటకు అగ్ని ముఖ్యకారణము. అదేవిధముగ విమోచనకు జ్ఞానము ముఖ్యసాధనము. ఇతరసాధనలకంటే, విమోచనకు ఆత్మజ్ఞానము చక్కని సాధనమై యున్నది.

ముందు శ్లోకమున తపస్సును, ఆత్మనిగ్రహమును మిక్కిలి కొనియాడబడి యుండుటచే, వీటివల్లనే పరమపదము దొరకగలదను భ్రమకలుగుట కాస్పద మున్నది. కనుక అట్టి భ్రమకు, సాధకులు పాత్రులు కాకుండుటకై, మోక్షమును పొందుటకు జ్ఞానమొకటియే చక్కని సాధనమని ఇందు ప్రకటింపబడుచున్నది.

వేదాంత రంగమున నూతనముగ ప్రవేశించిన సాధకులకు చక్కని బోధ కుదురుటకై, ఈ శ్లోకమునందు ముందురాగల శ్లోకములలో, విచారించబడు విషయమున కనుగుణంగా, చక్కని ఉపమానములు తెలుపబడుచున్నవి. వంట చేయుటకు బియ్యము, కూరగాయలు, రుచిద్రవ్యములు ముఖ్యముగ కావలయును. వీటన్నిటిని సేకరించుటవలన అన్నము తయారుగా నున్నదని తలుపబడదు. అగ్నివల్లనే ఇవన్నియు పక్వము కావలయును. కనుక వంటచేయుటకు అగ్ని చక్కని కారణముగా నున్నది.

అదే విధముగా, కర్మనిర్వహణ, దాన ప్రదానము, తపస్సు, మనోనిగ్రహము, శాస్త్రవిచారము, జ్ఞానవిచక్షణ మొదలగునవెల్ల పారమార్థికాభివృద్ధి కలిగించు చున్నవి. కాని వీటివల్ల చక్కగా మోక్షము కలుగజాలదు. మన నిజ అస్తిత్వ జ్ఞాన బోధవల్లనే మోక్షప్రాప్తి సాధ్యము. ఆత్మసాక్షాత్కార వైభవము పొందనగును.

ఈ విషయము రాగల శ్లోకమున ప్రశంసించబడును.

శ్లో॥ అవిరోధితయా కర్మ నావిద్యాం వినివర్తయేత్ ।
విద్యావిద్యాం నిహన్త్యేవ తేజస్తిమిర సంఘవత్ ॥ 3 ॥

తా॥ కర్మవల్ల అజ్ఞానము నశించదు. ఎందుకనగా ఇవి పరస్పర విరోధములు కావు. ప్రకాశము అంధకారమును నశింపజేయునట్లు, జ్ఞానము అజ్ఞానమును చక్కగా నశింపజేయగలదు.

జ్ఞానమువలన కలుగగల ఫలము తపస్సువలన, క్రమశిక్షణ వలన యేల లభింపజాలదు? ఇచ్చట జ్ఞానమను పదము అలంకార రూపమున వాడబడి

యున్నది. జ్ఞానప్రాప్తియనగా, నిరంతరము అస్తిత్వమున లోటులేకయుండు ఆత్మ యొక్క పునః ప్రాప్తి; స్వప్నమున యున్న వ్యక్తి జాగ్రత స్థితిపొందునటువంటిది. అప్పుడు అతనికి స్వప్నము, స్వప్న దుఃఖములన్నియు అంతమొందుచున్నవి. శ్రుతులు వర్ణించు ప్రకారము- ఆత్మ శాశ్వత నివాసి, సర్వవ్యాపి పరిపూర్ణుడైన యెడల, అతనికొఱకు శ్రమపడి ఎచటినుండియో అతనిని పొందగల ప్రయాస అనవసరము. అతడు మనలో పూర్వమునుండి యున్నాడు కనుక, పారమార్థిక కర్మలు కూడ "కర్మ కర్మనుండి కర్మఫలోత్పత్తి" యను న్యాయమువలన, ఆత్మజ్ఞానము కలిగింపజాలవు. శుభ్రమగు అద్దమునందు మన ప్రతిబింబమును చక్కగ చూడగలము కనుక అద్దమువంటి అంతర జ్ఞానసాధనములను, కర్మలు పరి శుభ్రము చేయగలుగుచున్నవి.

ఒక గది చీకటిగ నున్నదని ఊహించుదాము. గంటలకొలది ఆ గదిని ఊడ్చుట చేతగాని, నూర్లకొద్ది జనము గంపలతో ఎత్తిబైటపోయుటవల్లగాని, గది యందలి చీకటి తొలగదు. చీకటిని తొలగించుటకు ఊడ్చుట చక్కని సాధన కాజాలదు. చేతియందొక దీపమునెత్తుకొని, గదిని ప్రవేశించినచో, ఎంతటి దట్టమైన చీకటియైనను తొలగిపోవును, ప్రకాశము కలుగును. అదే విధముగా మన శుద్ధ జ్యోతియగు జ్ఞానమును, అజ్ఞానము ముసుగువేసినట్లు కప్పియున్నది. ఆత్మ, స్వప్రకాశ జ్ఞాన ఎఱుక, సదా ప్రకాశించుచున్నది. దానిని కప్పియుండు అజ్ఞాన ముసుగును మనము తొలగించవలెను. మన నిజస్వరూపమును మరుగుపరచు భ్రమాజ్ఞానమును తొలగించినచో, ఆత్మ ముసుగు తొలగి ప్రకాశించును. ఎచ్చటనో ఆత్మను వెదకి కనుగొన నవసరము లేదు. అజ్ఞానమను ముసుగును తొలగించుటే ప్రయాస, ఆత్మయొక్క పునర్దర్శనము లభించును. ఇట్టి భావము వలన, కర్మ అజ్ఞానమును నశింపజేయజాలదు. అజ్ఞానమునకు జ్ఞానమొకటియే ఔషధమని యిందు తెలుపబడియున్నది.

శ్లో॥ పరిచ్ఛిన్న ఇవాజ్ఞానాత్ తన్నాశే సతికేవలః।
స్వయం ప్రకాశతే హ్యాత్మా మేఘాపాయేఽంశుమానివ ॥ 4 ॥

తా॥ అజ్ఞానమున వలన జీవుడు పరిచ్ఛిన్నుడుగ కనబడుచున్నాడు. అజ్ఞానము నశించగా, ఆత్మ తానుగా ప్రకాశమగును (ఆత్మయందు అనేకములు లేవు). మేఘములు తొలగగా, సూర్యుడు/స్వయం ప్రకాశమగును.

ముందటి శ్లోకమందలి ముఖ్యభావమిందు విపులముగ తెలుపబడుచున్నది. అజ్ఞానము జ్ఞానమువలననే నశింపగలదనుట వలన, వైదిక కర్మప్రయాసలు ఫలసిద్ధి నివ్వజాలవని సూచింపబడెను. అనేక ప్రయాసలవలన సూర్యుని ప్రకాశ వంతునిగ జేయ ప్రయత్నించ నవసరము లేదు. సూర్యుడు నిత్యప్రకాశుడు. గగనమార్గమున నిలచి, ప్రపంచమును ఋతువుల మేరకు ప్రకాశింపజేయు చున్నాడు. సూర్యుని ప్రకాశమును, సర్వజీవాధారమగు అతని కీర్తిని, ఇటునటు పారాడు మేఘములు మరుగుపరచుచున్నవి. మేఘములు తొలగిపోగా వాటి మరుగునయున్న సూర్యుడు ప్రత్యక్షమగుచున్నాడు.

ఆత్మ ఆద్యంత రహితుడు : సర్వప్రాణుల విధి నియామకుడు, నిరవయవుడు, ఏకరసుడగు ఆత్మయందు, ద్వంద్వములు, అనేక విభాగములు కానరావు. మన అజ్ఞాన ఫలమువలన మనము ఆ పరమాత్మయందనేక ఆరోపణములు చేసి దుఃఖపడుచున్నాము. అతని వలననే సర్వము ప్రకాశించుచున్నది. సర్వ ప్రాణులకు చైతన్యమొసగు జీవాధారమని అతడు యెన్నబడుచున్నాడు. కనుక, వాస్తవ స్థితి యందు, ఈ ఆత్మయే పరమాస్పదమనబడు కీర్తివహించి తన అస్తిత్వమున లోటులేక నిరంకుశంగా ప్రకటించుచు, తన సత్తు – చిత్తు స్వభావమున తానుగా ప్రకాశమగుచున్నాడు. ప్రపంచ విషయముల ఆకర్షణలకు లొంగని, వాటియందు అనురాగము లేనివారు, ఈ సత్య – ఆత్మానుభవము పొందుటకర్హులై యున్నారు.

శ్లో॥ అజ్ఞాన కలుషం జీవం జ్ఞానాభ్యాసాద్వినిర్మలమ్ ।
కృత్వా జ్ఞానం స్వయం నశ్యేత్ జలం కతక రేణువత్ ॥ 5 ॥

తా॥ అజ్ఞానమువలన మలినుడై యుండు జీవుడు, జ్ఞానాభ్యాసమువలన శుద్ధుడగు

చున్నాడు. పిమ్మట ఆ జ్ఞానాభ్యాసము కూడా లేకపోవుచున్నది. మురికి నీటిని శుభ్రపరచిన కటకరేణు, మురికితో తాను కూడా నీటినుండి తొలగి పోవుచున్నది.

అజ్ఞానమువలన కలుషమొందిన ఆత్మయే జీవుడని ఈ శ్లోకమున నిర్వచింప బడుచున్నది. పారమార్థిక జ్ఞానాభ్యాసము, బుద్ధియందు విభ్రమలు, మనసునందు ప్రగల్భములు కలుగజేయుచున్నది. మనోబుద్ధులనబడు కరణములు ఆత్మ ప్రకాశమును ప్రతిబింబించు అద్దము వంటివి. ఇట్టి మనోబుద్ధులనబడు కరణము లచే విచ్ఛిన్నమగు ఆత్మ జీవుడనబడును. ప్రకృతి విషయ బంధముల వలన బాధింపబడునది ఈ జీవుడు (అహంకారము). ఈ అహంకారము, జీవుడు, అద్దమునందు మనము చూడగల ప్రతిబింబమునకు పోల్చవచ్చును. ప్రతిబింబించు అద్దము చదరముగలేక, మిట్టపల్లములు గలిగి యుండినచో మన ప్రతిబింబము కూడ వికారముగ కనబడును.

ప్రతిబింబించు అద్దమును చదరపరచినయెడల, లేక ఆ అద్దము నాశనమైన యెడల, మన ప్రతిబింబమునందలి వికారములు కానరాక పోవును. మనో బుద్ధులు, నిర్మలములు, నిశ్చలములైన యెడల జీవునియందుగల వికారములు తొలగిపోవును. పరిపూర్ణము, నిర్మలము, నిశ్చలము పొందని మనసు, మనసు అనబడదు. ఏలననగా ఆలోచనల ప్రవాహమే మనసు, మనసు రూపులేకపోగా, ఇదివరకు జీవభ్రాంతితో వ్యవహరించుచుండిన అహంకారము తన నిజబింబమగు ఆత్మయందు లీనమగుచున్నది.

మనసును నిశ్చలపరచి, తుదకు ఆలోచనా ప్రవాహమును, వాటివల్లన కలుగు బంధములను తొలగించగల ప్రయాసయంతయు జ్ఞానాభ్యాసము లేక ధ్యానము అనబడుచున్నది. అసత్య విషయపూరిత కోశములతో తాదాత్మ్యము పొందుచుండుటను నిరసించుట. మన పరమార్థ దివ్య స్వభావమును స్థిరపరచు కొనుటయే ధ్యానమార్గమనబడును. ఈ మార్గమును ముందు రాగల శ్లోకములలో ఈ గ్రంథమునందే విపులముగ వివరింపబడుచున్నది.

"నేను శరీరము" అను భావము నిరంతరము కలిగియుండుట అహంకార మనబడును. ఇది అజన్మ పర్యంత ప్రయాసవలన కలిగినది. దీనిని తొలగించి, "నేను ఆత్మ" అను భావమును నిరంతరము కలిగియుండుట కూడా సాధ్యము అయినను, ఈ ప్రయాసయందు కూడ, నిరంతర ఆలోచనల ప్రవాహము యేర్పడుచున్నది. కనుక ఈ వృత్తి - జ్ఞాన అనుభవము కూడా పరిచ్ఛిన్నము. పరిణామ సహితము కాని పరిపూర్ణము అనుటకు వీలులేదు.

ఇట్టి సందేహ నివృత్తికొఱకు ధ్యానాభ్యాసము మనోలయము కలిగిన వెనుక తాను కూడా తొలగిపోవుచున్నదని ఈ శ్లోకమున సమాధానము తెలుపబడు చున్నది. నిదురించవలెనని చేయగల మన ప్రయత్నములు, నిదురించుటతో ముగియుచున్నవి. ఇచ్చట ఉపమానమునకై కటకరేణు- చిల్లగింజను తెలుపబడు చున్నది. పూర్వకాలము, మన దేశమున మురికినీటిని శుభ్రరపరచుటకై ఈ గింజను వాడుచుండిరి. వర్షాకాలమున, నదీజలము గాని, గుంటనీరు గాని, మురికిగ నుండినపుడు, నీటి పాత్రలలో చిల్లగింజను చాది, దాని గంధమును కలుపుచుండిరి. ఆ గంధము కొంత జిగటగ నుండును. కనుక కొంత కాలమునకు దాని భారముచేత అది పాత్రయందడుగు భాగమున పేరిపోవును. అట్లు క్రిందికి జారిపోవునపుడు, నీటియందుండు మురికి రేణువులను కూడా లాగుకొని అడుగుభాగము చేర్చును. ఇట్టి వ్యవహారమున, మురికి తొలగుటేకాక, మురికిని తొలగించుట కుపయోగించిన గంధము కూడా తొలగిపోయి శుభ్రమగు నీరు పాత్రయందుండును. నీటిని కదలనీయక వేరు పాత్రలోనికి తోడుకొందురు. ప్రస్తుత కాలమున, పట్టణములందు పటికను వాడుచున్నారు. అది కూడా నిట్లే ఉపయోగపడుచున్నది.

శ్లో॥ సంసారః స్వప్న తుల్యో హి రాగద్వేషాదిసంకులః ।
స్వకాలే సత్యవద్భాతి ప్రబోధేసత్యసద్భవేత్ ॥ 6 ॥

తా॥ ప్రపంచమంతయు రాగద్వేషముల మయముగ నున్నది. ఇదంతయు ఒక

స్వప్నతుల్యము. వాటిననుభవించునంత కాలమివి సత్యముగ నెంచబడుచున్నవి. (అజ్ఞాన దశయందున్నంతవరకు) జాగ్రతకు వచ్చినతోడనే స్వప్నమంతయు అసత్య మగుచున్నది (జ్ఞానోత్పత్తి కలుగగా సంసారము కల్లయగుచున్నది).

స్వప్నమునందు, మనసు తనకు ప్రియమగు వ్యవహారములను సృష్టించు కొనుచున్నది. తీరని కోరికలు, మోహములు, ఆవేశములు మన మనసునందు పేరుకొని యుండును. పడకయందు నిద్రించిన వెనుక మన స్వప్నమునందు ఇవి ప్రకాశమగుచున్నవి. మానసిక శాంతిగల వ్యక్తి– అనగా మనసును నియమించి తనవశము చేసికొనిన వ్యక్తి, కోపము, దంభము, ఈర్ష్య మొదలగు రాగద్వేషములచే పీడింపబడని వ్యక్తి, మనసు సృష్టించగల పిచ్చి స్వప్నములతో తాను విహరించడు. అనగా అతనికి స్వప్నములుండవు. బలహీనులు మాత్రము తీరని కోరికలతో, ఆలోచనలపుట్టతో, అనారోగ్య కలవరములతో బాధపడుచుందురు.

స్వప్న ప్రపంచమున మనకు అనేక విధములగు అనుభవములు కలుగు చుండును. జాగ్రదావస్థయందుకూడ మనకు అనుభవములు కలుగుచున్నవి. కాని, మన జాగ్రదావస్థను, దీర్ఘస్వప్నమని మనమంగీకరించ లేకున్నాము. దీనికి కారణమేమనగ మనపై అవిద్యయొక్క ప్రభావము దట్టముగా కప్పుకొని యున్నది. కనుక సత్యము యొక్క సత్యత్వమును అంగీకరింప అడ్డు పడుచున్నది. ఈ దేహ, మనోబుద్ధులతో మనకు గల సంబంధము మనకు తెలియు యోగ్యత లేకున్నాము. మన పరిసరములందుగల విషయములు అశాశ్వతములని నమ్మలేకున్నాము.

స్వప్నకాల పర్యంతము స్వప్నము సత్యమని తోచుచున్నది. జాగ్రతలో మేలుకొనిన తోడనే, ఆ అనుభవములన్నియు అసత్యమని తెలిసికొనుచున్నాము. అదే విధముగ, ఈ విషయపూరిత కోశములనెల్ల శోధించి, సర్వవ్యాపక చైతన్యము ననుభవింపగలిగినచో, ఈ దృశ్యప్రపంచము యొక్క అనేకత్వము ద్రొల్లుకుపోవును. పరమాత్మానుభవమున మేలుకొనుచున్నాము. ఇది యొకటియే సత్యమను నమ్మక మపుడు యేర్పడుచున్నది. కనుక, అజ్ఞానమును తొలగద్రోసి అసత్య అనుభవముల

నుండి మేల్కొని నిత్యసత్య జ్ఞానమును ప్రత్యక్షముగ తెలిసికొన యత్నింతుముగాక! మన నిజస్వరూపమగు సచ్చిదానందమును మనము తెలిసికొందుము గాక!

శ్లో॥ తావత్సత్యం జగద్భాతి శుక్తికా రజతం యథా ।
యావన్నజ్ఞాయతే బ్రహ్మ సర్వాధిష్ఠానమద్భుతమ్ ॥ 7 ॥

తా॥ సర్వాధిష్ఠానము, సర్వసృష్టికి మూలాధారమగు బ్రహ్మము నెఱుగని కాల పర్యంతము జగత్తు సత్యముగ కనబడుచుండును. ఒక ముత్యపు చిప్పపై సూర్యరశ్మి నుండునంతకాలమది వెండి ముక్కగ నుండనోపునని తోచుచుండును.

జగత్తు అనగ, కండ్లకెదురుగ కనబడు స్థూలవస్తు సముదాయములు మాత్రము కాదు. ఒక వ్యక్తి తన జాగ్రత్త, స్వప్న, సుషుప్త అవస్థలందనుభవించు, శారీరక, మానసిక, వైజ్ఞానిక అనుభవముల సమూహము జగత్తు అనబడును. అనగా జగత్తు అనుటతో మన ఆనందానుభవముల కొఱకు మనము దృశ్యించు జ్ఞానేంద్రియ విషయములగు, రూపము, ఘ్రాణము మొదలగునవి. మానసికముగ ననుభవించు స్పర్శలు, ఆవేశములు విజ్ఞానమున అనుభవించు భావములు, ఉద్దేశ్యములు కూడ చేరియున్నవి.

ఒక వ్యక్తి బ్రహ్మానుభవ దివ్యస్థితి ప్రవేశింపని పర్యంతము, జగత్తంతయు పరిపూర్ణము, చక్కని సత్యమనియే అతడికి తోచుచుండును. సర్వాధిష్ఠానమగు బ్రహ్మము, సర్వవ్యక్తరూపములందు వ్యాపించి యున్నాడు. గనుక అతడు లేని వస్తువు లేదు. అతనిని దృశ్యింపజాలని కాలము, జగత్తు కనబడుచునే యుండును. స్వప్న మనుభవించునంతకాలము, మన మనుభవించు స్వప్నము అసత్యమని మనము తలచుటలేదు. ఒక పర్యాయము స్వప్నము నుండి మేల్కొనిన వెనుక స్వప్నమున కలిగిన నష్టములకు వ్యసనపడము, స్వప్నమునందు కలిగిన లాభములకు సంతసించము. జాగ్రదావస్థకు మేల్కొనిన వెనుక స్వప్నావస్థయందు కలిగిన వివిధ అనుభవములు, జాగ్రత్త మనసున లీనమైపోవుచున్నవి. అదే విధముగ ఈ ప్రపంచమున గల వివిధ భేదములు, వివిధ అనుభవములు, ఏకైక పరమాత్మ

రసమున, సర్వాధిష్ఠానమగు ఆత్మయందు పరమార్థ జాగ్రత్తున మేల్కొనిన తక్షణము లీనమైపోవుచున్నవి.

ఒక ముత్యపు చిప్పయొక్క నిజస్వరూపమును కనుగొనిన వెనుక, అది వెండిరేకు అను భావమును మరల పొందదము. అదే విధముగ, పరమాత్మ స్వరూపమును కనుగొనిన వెనుక, బ్రహ్మానుభవము పొందగలిగిన వెనుక, శాశ్వత సత్యస్వరూపుని ఆద్యంత రహిత బ్రహ్మమును, శుద్ధమగు జ్ఞాన ఎఱుకను తెలిసికొనిన వెనుక, ఆ బ్రహ్మము మనయందు, సర్వమునందు సర్వవ్యాపిగ నున్నాడని తెలిసి మరల ఈ జగత్తు సత్యమని నమ్ముటలేదు.

రజ్జు ఉపమానమున అధిష్ఠానమగు పగ్గము లేక, సర్ప ఆరోపణ కలుగుట సాధ్యము కాదు. అదే విధముగ, అమృత స్వరూప నాశరహిత అవ్యయ పరమాత్మ సర్వాధిష్ఠానము లేక భ్రమాజనిత జగత్తుయొక్క స్వరూపము కూడ యుండజాలదు.

శ్లో॥ ఉపాదానేఽఖిలాధారే జగన్తి పరమేశ్వరే ।
సర్గస్థితి లయాన్యాన్తి బుద్బుధానీవ వారిణి ॥ 8 ॥

తా॥ నీటియందు బుడగలు పుట్టి, ప్రకాశించి మరగిపోవునట్లు, ఉపాదాన కారణము, అఖిలాధారమగు పరమేశ్వరుని యందు ఈ ప్రపంచములు పుట్టి, నిలిచి, లయము పొందుచున్నవి.

పూర్వకాలమున సృష్టి సిద్ధాంతమును, ధీమంతులు, ఇతర మత సిద్ధాంతముల కన్న హిందూమతమునగల సిద్ధాంతములను శ్రద్ధతో విచారించుచుండిరి. జీవిత సమస్యల యెడ హిందూమతమున జూపబడి యుండు తర్కసమ్మత విచారము, నవీన శాస్త్రజ్ఞుల విధానములను లజ్జపరుప గలిగియున్నవి.

ప్రపంచమున ఎవరివల్లగాని, ఏ వస్తువునుగాని నూతనముగ సృష్టింప సాధ్యము కాదు. రూప, నామ, స్వభావ పరిస్థితులు మారుటే సృష్టియనుచున్నారు. తిరగబోసి ప్రోగుచేయుట సృష్టి యగుచున్నది. ఇట్టి సృష్టియందు ఒకవస్తువును

సృష్టి చేయుటకు మూడంశములుండవలెను. ఈ మూడింటిని కూడ కారణము లనబడును.

ప్రతి సృష్టియందును త్రివిధ కారణాంకములు వ్యవహరించుచున్నవి. ఉపాదానకారణము, నిమిత్త కారణము, సహకార కారణము. ఒక కుమ్మరి తన చక్రముపైన నుంచిన మన్నునుండి ఒక కుండను తయారు చేయుచున్నాడు. ఇందు కుమ్మరి నిమిత్త కారణము, చక్రము సహకార కారణము, మన్ను ఉపాదాన కారణము. ఎన్ని కుండలు ప్రపంచమున సృష్టింపబడినను, మనకు వ్యతిరేకముగ కుమ్మరి యుండును. పరిణా యుక్తమగు ప్రపంచము, ఆద్యంత రహితుని నుండి సృష్టి రెండు కావు. నీటియందుగల బుడగలు, నీటి పరిణామములు, నీటి నుండి బుడగలు పుట్టి కొంతకాలము నిలిచి, నీటియందే పగిలి లయమగు చున్నవి. అదే విధముగ శరీర, మనోబుద్ధులచే తెలియబడు బహురూప నామము లతో కూడిన ప్రపంచము జగత్తు – ఆద్యంతరహిత బ్రహ్మమున, శాశ్వత దివ్య సర్వాధిష్ఠానమున సృష్టి, స్థితి, లయము పొందుచున్నవి.

ఇట్లుండియు పరబ్రహ్మమున యెట్టి పరిణామము కలుగుటలేదు. అది పరిపూర్ణము. అందు ఎట్టి ప్రమాదము కలుగుట కాస్పదము లేదు. అటులైనచో, బ్రహ్మమునుండి రూపనామభేదములతో కూడిన యీ ప్రపంచమెట్లు కలిగేను? ఇదొక దశ్యభ్రమ, నిజము. ఎట్టి సృష్టియు కలుగుటలేదు. నిజస్థితిలో సృష్టియే లేదు.

శ్లో॥ సచ్చిదాత్మన్యనుస్యూతే నిత్యే విష్ణౌ ప్రకల్పితాః ।
వ్యక్తయో వివిధాస్సర్వా హాటకే కటకాదివత్ ॥ 9 ॥

తా॥ సర్వవ్యాపక, శాశ్వత బ్రహ్మమునకు విష్ణువని పేరు. సత్త, చిత్తు అతని లక్షణములు. దృశ్య ప్రపంచమునగల సర్వప్రాణులు, సర్వవస్తువులు, సర్వాధిష్ఠానమగు అతనియందు మనో కల్పితములు. నగలు ఎన్ని రకములుగా కనబడినను అన్నియు బంగారుయందు కల్పింపబడి యున్నవి.

ఉత్తమ వేదాంత భావములందుగల సూక్ష్మ సత్యభావములను సామాన్య స్థూల మనసు అందుకొనజాలదు. సామాన్య బుద్ధికి అందుబాటగుటకు, అనేక ఉపమానములను మరల మరల నొక్కి చెప్పవలసి యున్నది. యోగ్యత పొందిన వెనుక, విషయము ఆశ్చర్యకరముగ శిష్యుడు గ్రహించగలుగుచున్నాడు. అతనికి సత్యము అత్యంత విశదముగ ప్రకటితమగుచున్నది.

ప్రతి సృష్టికిని, ప్రత్యేకముగ కారణాంశములు మూడు యుండవలెను. 1. ఉపాదాన కారణమగు మూలసామాగ్రి, 2. సహకార కారణమగు కొరముట్లు, 3. నిమిత్త కారణము – మూలసామాగ్రిని కొరముట్లతో వస్తురూపముగ తయారు చేయు జ్ఞానము.

సామాన్య సృష్టులందు, పై మూడుకారణములు ప్రత్యేకముగ నుండును. మూలసామాగ్రి నూతన వస్తురూపమున పరిణామము చెందుచున్నది. కాని జగత్తు – సృష్టియందు, సృష్టింపబడిన వస్తురూపములు, విషయములు, సృష్టికర్తకు భిన్నముగ లేవు. మూలసామగ్రియగు ఏకైక పరమాత్మ, వివిధ వస్తురూపములుగ తానుగ వ్యక్తమగుచున్నాడు. పరమాత్మ ఆద్యంత రహితుడు, తన అస్తిత్వమును కలిగియుండుటలో మరొక ఆద్యంతరహిత శక్తి యుండునవకాశము లేదు.

సముద్రమునగల అలలు సముద్రమునకన్న భిన్నమగు ఉనికి ననుభవింప జాలవు. అదే విధముగ మన ప్రతియొక్కరియందు ప్రకాశించు పరమాత్మ ఎఱుక యందు, ప్రతియొక్కరి అనుభవముగల శారీరక, మానసిక, వైజ్ఞానిక అనుభవములు, అట్లనుభవింపబడు బహిర్ ప్రపంచము కూడ, సృష్టిపొంది ఉనికి గలిగి, లయము పొందుచున్నవి. నీటిపైన బుడగలు కలిగి, విరిగిపోవునట్లు, వివిధరకపు అనుభవములు వివిధ హృదయములందు శుద్ధమగు జ్ఞానఎఱుక సన్నిధిని కలిగి మాసిపోవుచున్నవి.

ఇచ్చట విష్ణువను పదము, పురాణములలో వర్ణింపబడిన చతుర్భుజ దైవమని తలచరాదు. ఒక రూపము నిర్ణయించినపుడు అది ధ్యానసాధనకై ఉపయోగ పడుచున్నది. కాని, ఆ రూపమతని స్వరూపము కాదు. స్వభావము కాదు.

విష్ణువనగా, పరమాత్మ. వ్యాపనాత్ ఇతి విష్ణుః – విశాలనడక కలవాడు కనుక విష్ణువు అనబడును. నడక అనగ, ఒక పాదమునకు గల అంతరము నిర్ణయించుటగును. విశాల నడక యనగ, ఒక పాదమునకు రెండవ పాదమునకు గల అంతర అనంతరము అనగా, సర్వవ్యాపి. అతడు ఇచ్చట, అచ్చట, ఎచ్చటెచ్చటను యున్నాడు. అతడు, సమీపమున, పైన, క్రింద, మీలో, నాలో కూడ యున్నాడు.

అటులైన, వివిధరకపు వస్తువు సముదాయములు దృశ్యములగుటకు కారణ మేమి? పరమాత్మ ఒక్కడేకదా! బంగారం నుండి తయారు చేయబడిన నగలను, శ్రీ శంకరులు ఉపమానము తెలుపుచున్నారు. కంసాలివాని కొసగినది ఏకరస స్థూల బంగారుముద్ద. ఆయన, ఆ ఒక్క బంగారు ముద్దనుండి, ఉంగరములు గొలుసు, ముక్కెర, గాజులు, బిళ్ళలు తయారుచేసి యున్నాడు. అవి ఒకటొకటి ప్రత్యేకమ్ముగ, ప్రత్యేకరూపములో, ప్రత్యేక ఉపయోగమునకు ఏర్పడియున్నవి.

ఏకరస బంగారుముద్ద నందాధారపడియుండు నగలవలె, రూపనామ భేదములుగల ప్రపంచ దృశ్యములు, సర్వవ్యాపక, సర్వాధార బ్రహ్మమునందాధార పడి యున్నవి. వస్తువులు వేరువేరు అనేకములు వాటివలన కలుగు అనుభవములు వివిధములు ఇన్నియు ఆ ఏకప్రజ్ఞాన ఎఱుక యొక్క పరిణామములు. నగలయందు బంగారం ప్రకాశించునట్లు ఆ ఎఱుక వీటియందు ప్రకాశించుచున్నది. అధిష్ఠాన మెన్నటికిని పరిణామము చెందదు. ఒక ఉంగరము తయారగునపుడు, మరల ఉంగరము కరగవేసినపుడు కూడ బంగారమున కెట్టి పరిణామము కలుగదు. అదే విధముగ, ప్రపంచమంతయు కూలినను, నిత్యసత్య వస్తువునకు ఎట్టి ప్రమాదము లేదు. అది అవ్యయము, అచలముగ నున్నది.

శ్లో॥ యథాకాశో హృషీకేశో నానోపాధిగతో విభుః ।
తద్భేదాద్భిన్నవద్భాతి తన్నాశే కేవలో భవేత్ ॥ 10 ॥

తా॥ సర్వవ్యాపకమగు ఆకాశము, పరస్పర వ్యతిరేకములగు అనేక ఉపాధుల సంయోగమువలన అనేకములుగ కనబడుచున్నది. ఉపాధులు నాశమగుటవలన

ఆకాశము ఏకమగుచున్నది. అదే విధముగ సర్వవ్యాపక బ్రహ్మము అనేక ఉపాధుల సంయోగమువలన అనేకముగ కనబడుచున్నాడు. ఉపాధులు నష్టము కాగా, ఏకముగ కనబడుచున్నాడు.

వివిధాకార రూపములతో అస్తిత్వము కనబడుచుండినను, వివిధ రకపు అనుభవములు కలుగుచుండునట్లున్నను, పరిణామరహిత అధిష్ఠానము తాను ఏకముగ పరిపూర్ణ ప్రకాశముతో భాసించుచున్నాడు. దీనినే మనము, బ్రహ్మమని, పరమాత్మ యని, సత్ - చిత్ - ఆనందమని తలచుచున్నాము. పరమాత్మ యొక్క తేజ స్వరూపం సత్యము. ఆ పరిపూర్ణ సత్యమున విభేదములకు ఆస్కారం లేదు. అటులైన బ్రహ్మ ప్రపంచమున అనేక వస్తువులందు భేదభావమునకు ఆస్కారం లేదు. అటులైన బాహ్యప్రపంచమున అనేక వస్తువులందు భేదభావము మనకు కలుగుచున్నది. అవి సత్యమని తోచుచున్నది కదా, ఎందుకు? మన యందరియందు ప్రకాశించు తేజస్సు అద్వితీయమైనచో, అనుభవములందు భేద భావములు కలుగుటకు కారణమేమి?

ఇట్టి సంశయములను విమర్శింప తగు సాహసము మనకు చేకూరియున్నది. పురాతన కాలమున తెలుపబడిన వాక్యములనుగాని, ధీమంతుల వాక్యములను గాని మనము విచారించక, అవి సత్యములని ఒప్పుకొనలేకున్నాము. హృదయ భావన విజ్ఞానసమ్మతము రెండు ఆమోదించుటవలననే, ఆ భావము మనకు నచ్చినదని సమ్మతించుచున్నాము. అటుపిమ్మటనే ఇట్టి పారమార్థిక భావములు మన నిత్య జీవితమున దారిజూపి నడిపింపగలుగుచున్నవి.

"హృషీకేశ" అను పదమునకు రెండర్థములున్నవి. పొట్టికేశములు కలవాడు అని. యుద్ధరంగమున భగవానుడు, తన వెంట్రుకలను పొట్టిగ యుండునట్లు అమర్చుకొని యుండెనని వినియున్నాము. హృషీక - ఈశ- ఇంద్రియముల నియమించువాడు అని. ఇంద్రియములు జీవ అధిష్ఠానముండునంత కాలము వ్యవహరించును. ఇంద్రియముల ప్రభువగు ఆత్మ దేహమును పరిపాలించువరకు,

మనము చూచుట, ఆఘ్రాణించుట, స్పర్శించుట, మాట్లాడుట జరుగుచుండును. సర్వము వ్యాపించునదొక జీవచైతన్యము. ఆ చైతన్య ప్రవాహము లేనియెడల ఈ దేహమున యే వ్యవహారము నుండదు. బాహ్యప్రపంచమున యే వ్యవహారము అనుభవింపబడదు. ఆ జీవశక్తి, ఆ విశ్వచైతన్యము, ఆ సర్వవ్యాపక బ్రహ్మమును ఇచ్చట సర్వవ్యాపి అను భావముతో విభువని తెలుపబడినది.

సర్వవ్యాపి, విభువు, బ్రహ్మము, ఉపాధి భేదములతో వ్యవహరించుచుండుట వలన, బహురూప ప్రపంచముగ కనబడుచున్నాడు. విశాలమగు ఆకాశమున ఒక భవనము కట్టుచున్నాము. దానియందు ఆఫీసు గదియని, పడకగదియని, వంటగదియని, భోజనశాలయని నిర్మించుచున్నాము. వీటియందుండు అవకాశము కూడ, గదులవలెనె, అనేక రకములుగ నున్నదని తలచుచున్నాము. భవనమను ఉపాధివలన కలిగిన గదులందు వేరు వేరు ఆకాశములున్నవని తలచుచున్నాము. కాని, ఈ భవనమునకు గల గోడలనెల్ల పడగొట్టినయెడల, గదులయందుగల ప్రత్యేక ఆకాశముల అస్తిత్వము అంతమగుచున్నది. కాని, ఆకాశమునకు హాని కలుగట లేదు. కదలుచుండిన ఆకాశములు ఏకమై మహాకాశ మగుచున్నది.

అదే విధముగా వ్యక్తిగత అహంకారము, అనేక ఉపాధుల సంయోగము వలన, బహురూప ప్రపంచమును అనుభవించుచున్నది. ఉపాధులన్నియు తొలగినచో, ప్రతి ఉపాధి ప్రకాశమునకు కారణమగు ఏకైక సత్యస్వరూపము శోభించుచున్నది. ప్రపంచమున కంతయు సూర్యుడొక్కడేగాని అనేకములు కాదు. అటులనే తేజోవంతమగు జీవచైతన్యము అనేక ఉపాధుల కవకాశమిచ్చు చుండినను, అద్వితీయమని తెలియబడుచున్నది. ఆ శక్తి లేనిది, అస్తిత్వము లేదు. అట్టి విభువువలన ప్రతియొక్కటి నిలచియున్నది.

ఆత్మజ్ఞానము కలుగుటకు ముందు, కలిగిన వెనుక కూడ, ఆత్మయొక్కడే కాని అనేకము కాదు. అనేక ఉపాధులయందు బంధింపబడి యుండుటవలన

భ్రమజెందిన మనోవ్యవహారమువలన, ఆత్మ అనేకమని తోచుచున్నది. అసత్య ఉపాధి పరిమితులను తొలగించినచో, సర్వకాల, సర్వదేశములందు వెలయుచుండు ఏకైక ఆత్మను మరల కనుగొన గలుగుచున్నాము.

శ్లో॥ నానోపాధివశాదేవ జాతివర్ణాశ్రమాదయః ।
ఆత్మన్యారోపితాస్తోయే రసవర్ణాది భేదవత్ ॥ 11 ॥

తా॥ ఉపాధి సంయోగము వలన ఆత్మయందు జాతి, వర్ణ, ఆశ్రమ భేదముల నారోపింపబడుచున్నవి. నీటియందు నానా భూసారముల సంయోగమువలన రుచి, వర్ణముల భేదములు కలుగుచున్నవి.

ఒక వ్యక్తి న్యాయవాదియో, వైద్యుడో అనేక భేదములు కలిగియుండినను అతనియందలి అంతరంగములందు భేదములు లేవు. వారు వారు పొందిన విద్యాభ్యాసము, వృత్తి, శిష్యత్వములందు భేదములున్నవి. వీరందరు ఒక జాతి, మానవజాతికి చేరినవారే. బాహ్యమున వారు ధరించు వస్త్రములందు, వారి చిరునామాలయందు వర్ణనల వ్యత్యాసములున్నవి. అదే విధముగా జీవకళ ఏకమైనను జీవప్రకాశమున భేదము కనబడుచున్నది. రూప, నామములలో, జాతి ఆశ్రమములలో, భావసౌందర్యములలో, బుద్ధికుశలతలో భేదము లెన్ని యున్నను, అన్ని జీవరాసులలో గల ఆత్మ ఏకముగ ఉన్నది. ఆత్మయందు, బల ఆత్మయని, ముసలి ఆత్మయని, హిందూ ఆత్మయని, క్రీస్తు ఆత్మయని, బీద ఆత్మయని, ధనవంత ఆత్మయని భేదములు లేవు. వివిధరకపు వస్తు సముదాయములలో జీవ చైతన్యమొసగు సత్యము ఒకటి అన్ని వస్తువులలో అందరు వ్యక్తులలో అన్ని శరీరములలో సమముగ ఆ శక్తి చైతన్యమొసగుచున్నది. బహిరంగ వేషములకు ఆ శక్తికిని సంపర్కము లేదు, సంయోగము లేదు. ఎట్టి వికారములు చెందని సాక్షివలె నిరంతరం ఈ జీవిత నాటకమును అది తిలకించుచుండును.

విద్యుచ్ఛక్తి, పంకాను త్రిప్పి గాలినిచ్చును. రెఫ్రిజిరేటర్ నందుంచిన వస్తువులను శీతలపరచును. వివిధ రంగులు గల దీపములలో, వివిధ రంగులతో

ప్రకాశించును. ఈ శక్తి ప్రకాశించు ఉపాధులు భేదముగ నుండుటవలన, అవివేకులు శక్తియందు భేదములు చూచుచున్నారు. అయినను విద్యుచ్ఛక్తిని విచారించిన విజ్ఞాని, శక్తియొక్క ప్రభావములుకాని, శక్తిభేదములు కాదని నమ్ముచున్నాడు.

స్వచ్ఛమగు వాన నీరునకు వర్ణము, రసము, వాసనలు లేవు. అయినను వాన వెలసిన వెనుక ఒకచోట తెల్లగ, ఒక చోట పచ్చగ, ఒకచోట ఎరుపుగ నీరు కనబడుచున్నది. కొన్నిచోట్ల నీరు మధురముగ నున్నది. కొన్నిచోట్ల క్షారముగ నున్నది. కొన్నిచోట్ల దుర్గంధముగ నున్నది. ఆయా భూసారములనుబట్టి నీటికి గుణములేర్పడుచున్నవి. అదే విధముగ, ప్రతివ్యక్తియందు గల వాసనలననుసరించి ఒక వ్యక్తికి మరొక వ్యక్తికి భేదమేర్పడుచున్నది. ఉపాధివలన కలుగు మలినమును తొలగించినచో ప్రతి వ్యక్తియందు అంతరమునందలి చైతన్యమున భేదము లేదు. మనకగపడు భేదములెల్ల ఆ చైతన్యముపై మనము చేయు ఆరోపణముల వలన కలుగుచున్నది. ఆ చైతన్యము లేనియెడల, జీవితమంధకార సమమై, అస్తిత్వము కోలుపోయి శూన్యమగును.

శ్లో॥ పంచీకృత మహాభూత సంభవం కర్మ సంచితమ్ ।
శరీరం సుఖదుఃఖానాం భోగాయతన ముచ్యతే ॥ 12 ॥

తా॥ ప్రతి వ్యక్తికి తన పూర్వకర్మానుసారము నిర్మించుకొనిన ఫలమగు సుఖదుఃఖముల ననుభవింపయోగము ఆలయము అగు ఈ శరీరము, పంచమహాభూతముల పంచీకరణ సంయోగమువలన నిర్మింపబడుచున్నది.

ఇప్పుడు ఈ ఉపాధు(బంధము)లు ఎట్లు కలుగుచున్నవో విచారించు చున్నాము. ఆత్మ, చైతన్యరూపమున ఈ శరీరములలో, కోశములలో వ్యవహరించు చున్నాడు. ఈ శరీరముల యుత్పిత్తిని విమర్శించుచున్నాము. ఈ శరీరములు, మూడు గలవు. అవి స్థూల, సూక్ష్మ, కారణ శరీరములనబడును.

ఈ స్థూలశరీరము పంచ మహాభూతముల సమ్మేళనము. ఆకాశము, వాయు, అగ్ని, జలము, పృథివి వీటినుండి కలిగియున్నది. మరణానంతరము శరీరము జీర్ణమైపోవు క్రమము చూడుడు. శరీరమునుండి జీవం వెళ్ళినతోడనే, శరీరము నందలి ఉష్ణము తొలగిపోయి, చల్లబడుచున్నది, (అగ్ని). శరీరము ఉబికి వాయువు సడలుచుండును (వాయువు). త్వరలో దానియందుండు ద్రవభాగము ఎండిపోవును (నీరు). కడపట శల్యములు కూడా శిథిలమై, ధూళి భూమితో కలిసిపోవుచున్నది (పృథివి). ఇంతవరకు శరీరమాక్రమించిన ఆకాశము మరల ఆకాశమున చేరి పోవుచున్నది (ఆకాశము). సృష్టిక్రమమున సూక్ష్మమునుండి స్థూలమేర్పడుచున్నది. కార్యమునకు కారణము ముందుండును. సూక్ష్మముగ నుండును. పంచీకరణ సిద్ధాంతమున, పంచభూతముల సృష్టి, వాటి విభాగములు, సంయోగములు, సూక్ష్మతన్మాత్రలనుండి, స్థూల మహాభూతములు సంభవించుట విపులముగ తెలుపబడియున్నది.

ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథ్వీ ఇవి ఐదు పంచభూతము లనబడును. పంచీకరణమగుటకు పూర్వమివి తమ తమ నిర్మల రూపమున యుండునపుడు ఆ స్థితియందు, వాటిని తన్మాత్రలు (తత్+మాత్రము=అది యొకటే) అనబడును. వీటి పంచీకరణ మీరీతి, పంచవిధ శాస్త్రక్రమమున జరుగుచున్నది.

1. అవి తమ ప్రత్యేక శుద్ధస్థితి యందుండును. ఇవియే తన్మాత్రలు.
2. పంచభూతముల తన్మాత్రలు ప్రతియొక్కటి రెండగునట్లు కనబడును.
3. అవి ప్రతియొకటి రెండు భాగములగుచున్నవి.

4. ప్రతి తన్మాత్రయొక్క అర్థభాగమొకటి వికారములేక నిలచును. రెండవ అర్థభాగము నాలుగు భాగములుగా చీలును. అనగా, ప్రతి తన్మాత్రయొక్క అర్థభాగ మొకటి, పరకభాగము నాలుగుగా యేర్పడును.

5. ప్రతి తన్మాత్రయొక్క చెడకుండు అర్థభాగములో, ఇతర తన్మాత్రల పరక భాగమొక్కొక్కటిగా, నాలుగు పరకభాగములుగ చేరును.

విషయరాశి ననుభవించుటకు ఈ మానవశరీరము ఒక క్షేత్రమగుచున్నది. శరీరమున జ్ఞానేంద్రియముల వలన సుఖదుఃఖముల ననుభవించుచున్నాము. ఈ సుఖదుఃఖములు జీవిత జయాపజయములను నిర్ణయించుచున్నవి.

ఈ శరీరము భోగాయతనము, సుఖదుఃఖముల ననుభవించుటకు కుటీరములాంటి అనుభవరంగము. ఆ సుఖదుఃఖములు మన పూర్వ కర్మానుసార ముండును– ఒక్కొక్క ఆలోచనతో, ఒక్కొక్క కర్మవలన, మనకు సమకూడియుండు శరీర, మానసిక, పరికరములు మనము నిర్దేశించి యున్నాము. మరియు మనమీ శరీరముతో ఇచ్చట జీవించుచు, మనకు భవిష్యత్తున రాగల శరీరమును నిర్ణయించు చున్నాము. మనయందుండు దుర్వాసనలను జయించి, చక్కని మార్గమవలంబించి, ఋజువగు జీవితవిలువలను నిరంతరము అలవడకపోయినచో, మన ఆలోచనలు, కార్యములు దైవీభావమును పొందజాలవు. కనుక, మన అభివృద్ధికి మనము సహాయపడగలమో లేక నాశనము కలిగించుకొనగలమో అది నేడు మన బాధ్యతగ నున్నది. ఇంతకన్న ఉన్నత జీవితము కలిగి, పరమాత్మ ప్రాప్తికి అనేక అవకాశములు మనకు కలుగవలెనా? లేక నీచజీవితము కలిగి, అధిక అంధకారమున మునిగి పోవలెయునో, మనము నిర్ణయించుకొనవలెను. ముందెట్టి ప్రాప్తి కలుగవలెనో దానికి తగువైన చిత్రమును, మన కర్మలచే, లిఖించి భగవంతునికి అందజేయు చున్నాము. మన చిత్రముల రీతి అతడు ఈ శరీరమను కుటీరమును తయారుచేసి ఆ సర్వదయామయుడు, సర్వజ్ఞుడు, దివ్యసృష్టికర్త, మనలో ప్రతియొక్కరికిని అందజేయుచున్నాడు.

శ్లో॥ పంచప్రాణ మనోబుద్ధి దశేంద్రియ సమన్వితమ్ ।
అపంచీకృతభూతోత్థం సూక్ష్మాంగం భోగసాధనమ్ ॥ 13 ॥

తా॥ పంచప్రాణములు, దశేంద్రియములు, మనసు, బుద్ధి ఇవన్నియు అపంచీకృత (తన్మాత్ర స్వరూప) పంచభూతములనుండి సృష్టి పొందియున్నవి. వీటి సమూహమును సూక్ష్మశరీరమనబడును. యివి అనుభవము పొందుటకు సాధనాలు, ఉపకరణము లుగా నున్నవి.

నీచ జన్మలగు, వృక్షజాతులకు, మృగజాతులకును, ఉత్తమ జన్మమగు మనుష్య జన్మములకు, దేవ జన్మములకు, కడు తారతమ్యమున్నది. అట్లుండియు విశాలదృష్టిగల, సత్యపరిశోధకులకు వీటిన్నిటియందు జీవచైతన్యమొకటి ప్రత్యేకముగ కనబడుచున్నది. అట్టి సర్వవ్యాపక అద్వితీయాంశ మొకటి యున్నయెడల, నా అంతరానుభవములలో కూడ అనేక తారతమ్యములున్నవి. బాహ్యమునగల జీవరాసులయందు కూడా అనేక వ్యత్యాసములున్నవి. ఎందుకు?

ఈ శ్లోకమునగల "ప్రాణ" మనబడు పదమును చక్కగా అర్థము చేసుకొనవలెను. "ప్రాణమనగా జీవకళ, ఊపిరి పీల్చుట, విడుచుట కాదు. పంచప్రాణములనగా దేహమునందుగల వివిధ ప్రాణ వ్యవహారములు.

పంచ ప్రాణములనగా, ప్రాణ, అపాన, వ్యాన, సమాన, ఉదాన - ప్రాణ వ్యవహారములు. 1) ప్రాణమనగా--- జ్ఞానేంద్రియ వ్యవహారములను నియమించు, రక్షించు శక్తి. ఈ శక్తివల్లనే జ్ఞానేంద్రియములు చైతన్యముతో వ్యవహరించగలుగుచున్నవి. 2) అపాన--- ఆరోగ్యమగు దేహమునుండి విసర్జనము చేయించుశక్తి. దేహమునకు అనవసరము, హానికరమగు విషయములను వెలుపలికి తొలగించు శక్తి. 3) వ్యానము --- జీర్ణకోశమునగల శక్తి. ఆహారమును జీర్ణించి, దేహమన కుపయోగము చేయు శక్తి. 4) సమాన--- జీర్ణమయిన ఆహారమును, న్యాయరీతి అవసర నిమిత్తముల కనువుగా దేహ మాద్యంతము పంచిపెట్టగల శక్తి, చేతులు పనిచేయుచుండిన వాటికాహారం ఎక్కువ పోవును. 5) ఉదాన-- ఉన్నత ఆశయములను దృష్టించి, పేరుకొనియుండు దురభిమానముల పైకెగసి, నూతన సంస్కారముల రీతి అనుభవింపగలుగుట.

కొత్త ఢిల్లీ నగరమునుండి ఏకైక కేంద్ర పరిపాలనా సంస్థ దేశమందంతటయు వ్యాపించి, నియమించుచుండు విధమున, ఆత్మ జీవచైతన్యము హృదయ కుహరమున కేంద్రీకరించి, దేహమాద్యంతము వ్యాపించి, నియమించి, రక్షించు చున్నది. ఈ దేహపరిపాలనా విధానములను వివిధ ప్రాణములని ఇచ్చట

తెలుపబడి యున్నది. పరిపాలనా సంస్థకు కొందరు మంత్రులు నియమింపబడి యుందురు. ఏకైక జీవచైతన్యము అయిదు వేరువేరు విధముల ప్రాణవ్యవహారముల నడుపుచున్నది. పరిపాలక మంత్రివలె, ఈ దేహమున ప్రతియొక్క ప్రాణము యొక ప్రత్యేక విధమైన రక్షణ చేయుచున్నది.

ప్రాణవాయువు, ఇంద్రియములందు, స్పర్శలను నియమించుచున్నది. దేహమున ఎచ్చట విషయస్పర్శ తెలియుచున్నదో అది జ్ఞానేంద్రియ మనబడదు. ఈ రెండు నేత్రములు గోళములనబడును. వీటి ద్వారా నేత్రేంద్రియము వ్యాపించి, దృష్టించుచున్నది. కనుక ఆ నేత్రేంద్రియము మనోబుద్ధులయందు యున్నదని గుర్తింపబడుచున్నది. జ్ఞానేంద్రియముతో మనస్సు స్పర్శింపక పోయిన యెడల, ఎట్టి స్పర్శయు అనుభవమునకు రాదు. నిద్రించువాడుగాని, దీర్ఘాలోచన చేయువాడు గాని తన ప్రక్కన నిలిచియుండు వ్యక్తిని కనుగొనుట లేదు. ఎందుకనగా అతని మనస్సు వ్యాపించి అతని నేత్రేంద్రియముతో సంపర్కము పొందుటలేదు.

ఈ సూక్ష్మశరీరము, పంచప్రాణములు, దశేంద్రియములు, మనసు, బుద్ధితో కూడి మన సుఖదుఃఖముల ననుభవించుటకు యోగ్యమగు సాధనమగుచున్నది. ఇది అపంచీకృత – పంచమహాభూతముల తన్మాత్రవలన నియమింపబడి యున్నది. స్థూలశరీరము సుఖదుఃఖముల ననుభవించుటకు భవనమగుచున్నది. సూక్ష్మ శరీరము సుఖదుఃఖముల ననుభవించుటకు సాధనమగుచున్నది.

వేదాంతమున స్పర్శజ్ఞాన సిద్ధాంతమిట్లు కలదు, ఆత్మ ఎఱుక, మనసు ద్వారా ప్రవహించి, జ్ఞానేంద్రియముల ద్వారా వస్తువును చేరుచున్నది. (ఘటన దేశమును చేరి), వస్తువుయొక్క ఆకారమును తాకుచున్నది. అపుడు వస్తుజ్ఞానము మనకు కలుగుచున్నది (అయం ఘటః).

శ్లో॥ అనాద్యవిద్యానిర్వాచ్యా కారణోపాధిరుచ్యతే ।
ఉపాధిత్రితయాదన్యం ఆత్మానమవధారయేత్ ॥ 14 ॥

తా॥ అనిర్వచనీయము, అనాదియగు అవిద్యను కారణ శరీరమంటారు. ఈ మూడు ఉపాధులకు అన్యముగా ఆత్మ యున్నది.

స్థాణువునందు చోరుని చూచుట, భ్రమవల్ల కలుగు అధ్యాస అనబడును. ఇందు సత్యమగు స్థాణువును ప్రమాదము వలన చూడకపోవుట. చోరుని చూచుటకు కారణమగుచున్నది. సత్యమును కనుగొనలేని దోషము, భ్రమాధ్యాసమునకు అంకురమగుచున్నది. సత్యమును, ఆవరణము (ముసుగు) మూసి యుండగా, అవిద్యవలన సత్యము గోచరమగుటలేదు. సత్యము గోచరము కానపుడు విక్షేపమను దురభిప్రాయమువలన, భ్రమాజ్ఞానము కలుగుచున్నది. దీనినే అధ్యాస అంటారు. బుద్ధి అవిద్యవలన ముసుగువేయబడి యుండగా మనసు విక్షేపము పొందును. దిక్కుతెలియక భయసూచక దృశ్యములను కల్పించుకొనును.

అవిద్యాకారణము వలన ముసుగు వేయబడిన ఆత్మను తెలియని దోషము వలన, కప్పుకొనియుండు ముసుగే ఆత్మయందు భ్రమాజ్ఞానము కలుగుచున్నది. అట్లు కప్పుకొనియుండు కోశములతో తాదాత్మ్యము పొంది వ్యక్తిభావ మేర్పడు చున్నది. ఇదియే అహంకారము. అహంకారము, సుఖదుఃఖములనబడు సంసారము ననుభవించుచున్నది. కేవల అజ్ఞానమువలన సత్యము తెలియక పోయినను, భ్రమాజ్ఞానము కలుగక యుండునంత కాలము ఆనందకరముగనే యుండును. దీనికి ఉదాహరణముగ, నిజమైన ఆనందములేని సుఖస్వరూప సుషుప్తి, నిద్రయందు మనము అవిద్యయందు మునిగియున్నాము. అప్పుడు ఆత్మజ్ఞానము లేదు. అనాత్మ - శరీర - జ్ఞానము లేదు.

ఈ అవిద్యలు కారణ శరీరమనబడును. ఈ అవిద్యవలన పరిపూర్ణ దైవిక ఆత్మజ్ఞానము లేకున్నది. దానివలన బుద్ధియందు కోరికలు పొంగుచున్నవి. మనసులో ఆలోచనలు పొర్లుచున్నవి. శరీరమున కర్మలు పొర్లుచున్నవి. అవిద్య సూక్ష్మశరీరము, స్థూలశరీరము కూడ కలిగియున్నది. వీటికెల్ల అవిద్య కారణము గనుక అది కారణ శరీరమనబడుచున్నది.

అనాది అనగా పుట్టుకలేనిది. అవిద్య కిదొక లక్షణము. వేదాంత సాధకులు తొలుత దీనిభావము గ్రహించుటకు చాల కష్టపడుచున్నారు. నవీన శాస్త్రపరిశోధన లందుఈ విషయము చక్కగా విశదీకరింపబడి యున్నది.

రెండు వ్యవహారములకు మధ్యగల వ్యవధిని కాలము(Time)-- అంటారు. వేదాంత గ్రంథములలో మరీ సూక్ష్మమగు నిర్వచనము కలదు, రెండనుభవములకు మధ్యగల వ్యవధిని కాలము అనబడును.

ఒక అనుభవము కలుగుటకు మూడంశములుండవలెను. అనుభవించు కర్త, అనుభవింపబడు కర్మ, ఈ కర్తకు కర్మకు, చక్కగ ఏర్పడియుండగల సంబంధము క్రియ అనుభవము పొందుట ఇట్లు, మనోబుద్ధులనబడు కరణము కర్తయగును. అది అనుభవించుటకు విషయ ప్రపంచము కర్మ యుండవలెను. దానివలన అనుభవము పొందుట సాధ్యము. వీటివలన ప్రథమ అనుభవము కలుగుచున్నది. ప్రథమ అనుభవము సమాప్తమగుటకు సరిగ, అనగా మరొక అనుభవము ప్రారంభమగుటకు ముందు కాలమాన పరిజ్ఞానము మన ఊహకు అందుచున్నది. ఒక గీత గీచిన, అందు A చుక్కను నిర్ణయించుచున్నాము. ఆ A అను చుక్కయందు కొలుచుటకు ఎడముండుటలేదు అదే గీతయందు మరొకచోట, B అను చుక్క యందు కొలుచుటకు ఎడముండుటలేదు అదే గీతయందు మరొకచోట, B అను చుక్కను నిర్మించిన యెడల A, B లకు మధ్య కొలుచగల ఎడము కనబడు చున్నది.

కాలనిర్ణయ మారంభముకాని ప్రథమ అనుభవమున కూడ, అనుభవము సిద్ధించుటకు, మనోబుద్ధులను కరణము కర్త, విషయ ప్రపంచమును అనుభవింపబడు కర్మయుండిననే, చూచుట, వినుట తాకుట మొదలగునవి సాధ్యము కనుక, అనుభవరంగమున కాల నిర్ణయారంభమగుటకు పూర్వమే విషయ ప్రపంచము, దానిని అనుభవించగల కరణములు సృష్టిపొంది యున్నవి. ఈ కరణములు అవిద్యా పరిణామములు కనుక, స్థూల, సూక్ష్మ శరీరములు

అవిద్యా పరిణామములు, వీటికన్న ముందు అవిద్యయున్నదని స్థిరమగుచున్నది. అవిద్య, దానివలన, స్థూల సూక్ష్మ శరీరములు, దానివలన కాలజ్ఞానము కలుగుచున్నవి. కనుక అవిద్య కాలమునకు పూర్వమున్నది. అది అనాది యనబడుచున్నది. కాలజ్ఞానము వలన అవిద్యను కొలుచ ప్రయత్నించుట సాధ్యము కాదు. ఒక పసిబాలుడు, "తాతగారు! మీరు అవ్వగారిని వివాహమాడిన పెండ్లికి నన్నేల పిలుచుకొని వెళ్ళలేదు?" అని ప్రశ్నించునట్లున్నది. కాలమునకు పూర్వము అవిద్య వున్నది. కనుక అది అనాది, కాలాతీతము.

ఈ అవిద్యను, అనిర్వచనీయమని శ్రీ శంకరులు వర్ణించియున్నారు. ఒక వస్తువు అస్తిత్వము కలిగియుండిన, ఇంద్రియములకో, మనసుకో, బుద్ధికో, గోచరించగలిగినచో, దానిని అనేక భావములతో, వర్ణనలతో వర్ణించ సాధ్యమగును. అయితే అవిద్య, మన జ్ఞానేంద్రియములకు, మనసుకు, బుద్ధికి, కారణాంశముగ నున్నది. కనుక దానిని అనుభవింప సాధ్యము కాదు. వర్ణింప తరము కాదు. ఒక వస్తువు యుండిన దానిని వర్ణించవచ్చును. ఒక వస్తువు లేకుండిన దానిని వర్ణించవచ్చును. కాని అవిద్య ఉండు వస్తువు కాదు. లేని వస్తువు కాదు. రెండును కాదు. కనుక అది అనిర్వచనీయము.

తుదకు వేదాంతమునందు విద్యను గురించిన చర్చగలదు కాని అవిద్యను గూర్చి తెలుపు చర్చలేదు. సాధకుడు కష్టములకోర్చి, గురువును ఆశ్రయించి విద్యను కోరుచున్నాడు కాని అవిద్యను కోరుటలేదు. కనుక అవిద్యను తెలియగోరి, అనుభవింప ప్రయత్నించుట సాధకునికి తగదని శాస్త్రములు తెలుపుచున్నవి. ఒక దీపమును చేతబట్టుకొని అంధకారమును వెదకబోయినచో, అది కనబడజాలదు. సూర్యోదయముతో రాత్రి పారిపోవుచున్నది. ఒక మూఢుడు తలపై నొక గాసులైటు నుంచుకొని ఎచ్చట చీకటి యుండునో అచ్చట ఆ దీపమును దించెదని తలచుచు వెళ్ళెను. దించుటకు స్థలము కనబడలేదు.

అవిద్యను గూర్చి మనము విమర్శించుకొలది అది దూరమై, కడకు విద్యయందు మునిచి వేయుచున్నది.

శ్లో॥ పంచకోశాది యోగేన తత్తన్మయ ఇవ స్థితః ।
శుద్ధాత్మా నీలవస్త్రాది యోగేన స్ఫటికో యథా ॥ 15 ॥

తా॥ పంచకోశములతో తాదాత్మ్యము పొందుటవలన పరిశుద్ధమగు ఆత్మ వాటి గుణములు తనపై ఆరోపించుకొనుచున్నాడు. ఒక స్ఫటిక నీలవస్త్రముపై నుండుట వలన అది కూడ నీలవర్ణముగ కనబడును.

పరిశుద్ధము, పరిపూర్ణము అగు ఆత్మకు, అపరిశుద్ధము, అపరిపూర్ణత్వమేల సంభవించెనో ఇచ్చట వివరింపబడుచున్నది. ఆత్మ ప్రతిచోటను, శుద్ధముగ నున్నది. సృష్టిపొందిన విషయములుగాని, ప్రకృతిమయ కోశములుగాని ఆత్మను మలినపరచ జాలవు. విషయములెల్ల ఆత్మజ్ఞానము లేకపోవటము వలన కలిగినవి. అవ్యయ మగు ఈ ఆత్మ పంచకోశ సంపర్కము వలన, మనోబుద్ధి ఇంద్రియముల మలినము పొందినట్లు మన మూహించుచున్నాము. ఆరోపిత సర్పము యొక్క విషము, అధిష్ఠానపగ్గమును విషమయము చేయజాలదు. చోరునియందు అనుమానింపబడు రక్తము అధిష్ఠాన స్థాణువును మలినపరచజాలదు.

ఒక స్ఫటికము ఒక నీలవస్త్రముపై నుండగా స్ఫటికము కూడా నీలవర్ణముగ కనబడును. పంచకోశములందు, ఆ కోశముల ద్వారా ఆత్మ ప్రకాశించుట వలన, ఈ కోశములే మన నిజస్వరూపమని మనము భావించుచున్నాము.

ఇచ్చట ప్రశంసించబడిన పంచకోశములు...

1. స్థూలశరీరము – అన్నమయ కోశము 2. ప్రాణమయ కోశము – ప్రాణ వ్యవహారము 3. మనోమయ కోశము – మనో వ్యాపారము 4. విజ్ఞానమయ కోశము 5. ఆనందమయ కోశము.

శ్లో॥ వపుస్తుషాదిభిః కోశైః యుక్తం యుక్త్యావఘాతతః ।
ఆత్మానమన్తరం శుద్ధం వివిచ్యాత్తన్డులం యథా ॥ 16 ॥

తా॥ వడ్లయందుండు బియ్యమును వెలిదీయుటకై పొట్టు, తవుడు మొదలగు పొరలను తొలగించునట్లు, శుద్ధ ఆత్మను, కోశములనుండి వేరుపరచుటకు విజ్ఞానపూర్వక ఆత్మ విమర్శ, తర్కసమ్మత విచారము అత్యవసరముగ నున్నవి.

మనయందుండు ఆత్మ, సర్వవ్యాపుడు, పరమసత్యము అని అతని ప్రభావము తెలిసినంత మాత్రమున, అతనిని కనుగొను విధానమేమి? విషయపూరిత కోశముల నుండి శుద్ధచైతన్యము నెట్లు వేరుపరచగలము?

వడ్లయందుండు బియ్యమును వెలుపలకు తీయుటకు పొట్టును, తవుడును తొలగించవలెను. అదే విధముగ, అవిద్యచే కప్పబడి, అనేక మలిన కోశముల సంపర్కము పొందియుండు నిత్య ఆత్మను పరిశుద్ధము, పరిపూర్ణముగ కనుగొనుటకు నిత్యానిత్యములు నిర్ణయించగల వివేకమును మనము ఉపయోగించి ఆత్మపై నుండు మలిన పొరలనెల్ల తొలగించవలెను.

ఇట్లు స్థూలకోశములను, సూక్ష్మ మానసిక ఆవరణమును నిరసించి ఆత్మపై పేరియుండు మలినమంతయు తొలగించి, శుద్ధమగు ఎఱుకను కనుగొనవలెను. ఏ శ్రద్ధావంతుడగు సాధకుడు తనయందీ శుద్ధ ఆత్మను అనుభవించుచున్నాడో, అతడు తన కోశములనుండి విరక్తుడగుచున్నాడు. ఈ కోశముల కన్న భిన్నముగ ఆత్మ యున్నదని అతడెరుగును. నిరంతరము కోశములయెడ విరక్తుడై యుండుట వలన, అతడు అనంత జ్ఞానానందపదవి పొందుచున్నాడు. నిత్య ఆత్మయొక్క పరమపదమతడు కనుగొనుచున్నాడు.

శ్లో॥ సదా సర్వగతోఽప్యాత్మా న సర్వత్రావభాసతే ।
బుద్ధావేవావభాసేత స్వచ్ఛేషు ప్రతిబింబవత్ ॥ 17 ॥

తా॥ ఆత్మ సర్వవ్యాపిగ నున్నను, ప్రతి వస్తువునందు ప్రకాశింపబడు, శుద్ధ అద్దము నందు ప్రతిబింబము చక్కగ ప్రకాశించునట్లు, ఆత్మ, అంతఃకరణమగు శుద్ధబుద్ధి యందు మాత్రము ప్రకాశించును.

ఆత్మ ఆద్యంత రహితుడు గనుక, సర్వవ్యాపక స్వభావము గలిగి యున్నాడు. ప్రతి వస్తువునందు ఆత్మను వెదకి కనుగొనవచ్చును. కాని, శుద్ధబుద్ధి యందు మాత్రము ఆత్మ తత్త్వమును, సర్వగుణోపేతముగ కనుగొనవచ్చును. ఒక శుభ్ర మగు నిర్మల అద్దమున మాత్రము మన ప్రతిబింబము చక్కగ తెలియవచ్చును. ప్రతిబింబము ప్రతిచోట యున్నదని తర్కము తెలుపుచున్నను, అన్నిచోట్ల మనము చూడలేకున్నాము. *

మన ప్రభుత్వమును విచారింతము, ఆ ప్రభుత్వము కొత్తఢిల్లీలో మాత్ర మున్నది. ఇతర ప్రదేశములలో లేదు అనుట అనుచితము. ప్రభుత్వ కేంద్రస్థానము నెలకొని యుండవచ్చును. కాని దక్షిణమున చివరియందు గల గుడిసెపైనకూడ, ఈ ప్రభుత్వ చట్టములు వ్యాపించి యున్నవి. ప్రతి చదరపు అంగుళముపై కూడ ప్రభుత్వ అమలు జరుగుచున్నవి. దేశమందంతట దాని చట్టములు అన్వయమగు చున్నవి. అయినను ప్రభుత్వమును దర్శించవలెననగా, కొత్తఢిల్లీకి పరుగిడి పోవలసి యున్నది. అదే విధమున, పరమాత్మ సర్వనియామకుడు, మనయందు, లోపల, వెలుపల కూడ వ్యాపించియుండినను, ప్రశాంత, సూక్ష్మబుద్ధియందు మాత్రము అతని ప్రతిబింబము స్పష్టముగ కనుగొననగును.

శరీరము జడము, మనసు చంచలం కనుక వీటియందు ఆత్మ ప్రతిబింబము కనబడదు. ప్రశాంతము నిర్మలమునగు బుద్ధియందు ఆత్మదర్శనమును సాధకుడు అభ్యాసమువలన తెలియగలడు. శుద్ధమగు అద్దమున మన ప్రతిబింబము కనబడునట్లు, పవిత్రభావము పొందిన, ప్రశాంత, నిర్మలబుద్ధి యందు ఆత్మ ప్రకాశము కనుగొనసాధ్యమగును.

---

* *వస్తుశాస్త్ర సిద్ధాంతమున ఒక వస్తువుపై సూర్యరశ్మి తగిలి అది ప్రతిబింబించి, మన కంటిపొరపై వ్రాలుచున్నది. అప్పుడు ఆ ప్రతిబింబమును మన కంటి మూలమున గ్రహించుటచే, వస్తువుయొక్క జ్ఞానము కలుగుచున్నది. ఈ ప్రతిబింబము నల్లరాతిపైన కూడ పడుచున్నది. కాని అందు ప్రతిబింబము కానరాదు.*

శ్లో॥ దేహేంద్రియ మనోబుద్ధి ప్రకృతిభ్యో విలక్షణమ్ ।
తద్-వృత్తి సాక్షిణం విద్యాత్ ఆత్మానం రాజవత్సదా ॥ 18 ॥

తా॥ దేశపరిపాలనమున రాజు ప్రవర్తించునట్లు ఆత్మ, ప్రకృతిమయమగు శరీర, ఇంద్రియ, మనోబుద్ధులకు విలక్షణుడై, వాటి వ్యవహారములను సాక్షివలె గమనించు చుండును.

సూక్ష్మమగు బుద్ధి వ్యవహారములను, మనసునందలి చంచల ఆలోచనల ప్రవాహమును, స్థూలశరీర వ్యవహారములను ఆత్మచైతన్యము ప్రకాశింపజేయు చున్నది. అట్టి చైతన్యము, ఈ ఉపకరణములగు శరీర, మనోబుద్ధులకు విలక్షణ ముగ నున్నది. అదియే శుద్ధజ్ఞానము, సర్వవ్యాపక బ్రహ్మము. వీటినెల్ల ఆత్మ ప్రకాశింపజేయు చుండినను, వాటితో పాల్గొనక సాక్షివలెనున్నది. వస్తువులను ప్రకాశింపజేయు దీపము, వస్తువులకన్న విలక్షణముగా నున్నది. అనుభవించు కర్త అనుభవింపబడు కర్మగ నుండజాలడు.

ఒక రాజ దర్బారునందు ప్రతిదినము జరుగుచుండు నాటక వ్యవహారముల నతడు సాక్షివలె తిలకించు చుండును. వాటిలో తాను పాల్గొనడు. అదే విధముగ పిండాండమున బ్రహ్మాండమున జరుగుచుండు జీవితనాటకమును, ఆత్మ, సాక్షివలె తిలకించుచుండును.

మన అంతరమున విచారించినచో ప్రకృతిచేష్టలను ఆత్మ సాక్షివలె చూచు చున్నాడు. మంచి, చెడ్డ, తప్పు ఒప్పు, సుఖము, దుఃఖము, అందము, వికారము, ధర్మము, అధర్మము మొదలగునవి స్థూలశరీర కర్మలతో కూడా చేరి మన బాహ్యా అంతర జీవిత అనుభవములగుచున్నవి. ఒక వస్తువును తెలుసు కొనుటలో గల భావము, అభావము, అన్నివిధములైన జ్ఞానములు శుద్ధమగు జ్ఞాన ఎఱుకవల్ల ప్రకాశమగు చున్నవి. ఆత్మ విలక్షణముగనుండి, మన అంతర వ్యవహారములతో గాని, బాహ్య బ్రహ్మాండమున జరుగు వ్యవహారములతో గాని, జోక్యము పొందుట

లేదు. గమనించుచుండునట్లు ఆత్మ సర్వనియమాకుడైనను అందెట్టి ఆకాంక్షలేక యుండును.

శ్లో॥ వ్యావృతేష్వింద్రియేష్వాత్మా వ్యాపారీవావివేకినామ్ ।
దృశ్యతేఽభ్రేషు ధావత్సు ధావన్నివ యథా శశీ ॥ 19 ॥

తా॥ ఆకాశమున మేఘములు పరుగిడునపుడు, చంద్రుడు పరుగిడుచున్నట్లు తోచును. జ్ఞానేంద్రియములు వ్యవహరించుచుండగ ఆత్మయే వ్యవహరించుచున్నట్లు అవివేకులకు తోచుచున్నది.

జడమగు దేహమున ఆత్మ ప్రకాశించగా, దేహమునకు జీవచైతన్యము కలుగుచున్నది. దేహము వ్యవహరించుచుండినను ఆత్మయే వ్యవహరించుచున్నట్లు కనబడుచున్నది. ఇంద్రియ వ్యవహారములు ఆత్మకు సంబంధపడుటలేదు.

ఇంజనుయందుండు ఆవిరి, ఇంజను నడుచుటకు శక్తి యొసగుచున్నది. ఆవిరికి ఎవరియెడల ప్రియాప్రియములు లేవు. ఆవిరి ఎచ్చటికో వెళ్ళదలచి యుండలేదు. అయినను, ఆవిరి బలమువల్ల ఇంజను ప్రయాణము చేయుచున్నది. అదే విధముగ పరమాత్మ, శరీర మనోబుద్ధులను --- ప్రకాశింపజేయునపుడు, ఆ పరమాత్మయే వ్యవహరించునట్లు కనబడును. కాని ఏ వ్యవహారమున కూడ ఆత్మకు సంబంధము లేదు. ఆత్మ వ్యవహరించి పొందగల లాభము ఏదియు లేదు.

వ్యక్తియందెట్టి ఆలోచనలు, కర్మలు కలిగినను ఆత్మ అధిష్ఠానమున జరుగుచున్నవి. ఆత్మ ప్రకాశమువలన అవి కనబడి అనుభవింపబడుచున్నవి. పరమాత్మ యొక్క ఆధారము లేక వ్యక్తియందుగాని, బ్రహ్మాండమునగాని ఎట్టి ప్రకాశము యుండజాలదు.

ఆత్మ, నిర్లేపముగ సాక్షివలె నుండినను, అనాత్మ కార్యములనెల్ల, ఆత్మాధిష్ఠానము వలన కలుగుచుండినను, అవివేకులు ఆత్మయే కార్యములు చేయుచున్నదని భ్రమించుచున్నారు. నిజముగ ఆత్మ నిర్లిప్త సాక్షివలె నున్నది.

ప్రతిశ్లోమునందును, ఒక ఉపమానము తెలిపి, ఆత్మవైభవమును తెలుపుచు-నిత్యమునకు, అనిత్యమునకుగల వ్యత్యాసము చక్కగ బోధించుచున్నది. బాలురు ఆకాశమున మేఘముల కావలనుండి చంద్రుని చూచునపుడు, మేఘములు పరుగిడుచుండిన, చంద్రుడు పరుగిడుచున్నాడని తలచుచున్నారు. రైలు ప్రయాణము చేయుపుడు రైలు పరుగిడుచుండినను, ప్రక్కనున్న చెట్లు గుట్టలు పరుగిడుచున్నట్లు తోచుచున్నది. చలించు మధ్యవర్తి ద్వారా చూచునపుడు చలించని వస్తువులు దృశ్యములు కూడా చలించునట్లు కనబడును.

మనసునందు విక్షేపము కలిగిన, ఆత్మయందెట్టి చలనము కలుగుటలేదు. విక్షేపములెల్ల ఉపరిభాగమగు మనసున కలుగుచున్నవి. అయినను అవివేకము వలన ఆత్మవైభవమును జడవికారమున నారోపింపబడుచున్నవి. జడమగు కోశములను నిరసించి విచారించిన, ఆద్యంతరహిత ఆత్మను పరిపూర్ణ దైవాంశముతో అనుభవింప దగుచున్నది.

శ్లో॥ ఆత్మచైతన్యమాశ్రిత్య దేహేంద్రియ మనోధియః ।
స్వక్రియార్థేషు వర్తన్తే సూర్యాలోకం యథా జనాః ॥ 20 ॥

తా॥ సూర్యుని ప్రకాశమువలన సర్వజనులు వ్యవహరించగలిగినట్లు, ఆత్మచైతన్య మాశ్రయించి, దేహము, ఇంద్రియములు, మనసు, బుద్ధి, వాటి వాటి కార్యములందు వ్యవహరించగలుగుచున్నవి.

దేహము, మనసు, బుద్ధి ప్రతియొక్కటి వాటివాటి ఆవరణమున వ్యవహరించును. ప్రతీది ఆత్మశక్తిపై ఆధారపడుటవలన వాటియందు చైతన్యం అగుపడుచున్నది.

విద్యుచ్ఛక్తి ఏకమయినను, దాని ప్రయోగములనేక విధములుగ నున్నవి. ఎన్ని దీపములను చక్కగ అమర్చినను విద్యుచ్ఛక్తి లేకపోతే అవి వెలుగుట లేదు. అదే విధముగ చైతన్యమొసగు ఆత్మ అధిష్ఠానములేక ప్రపంచమున ఒక వ్యవహారము జరుగజాలదు. సృష్టియందుండు వస్తువులెల్ల జడరూపములై బండలవలె భారము

తప్ప, ఎట్టి ఉపయోగమునకు పనికిరాకుండును. తన అధిష్ఠాన మాత్రమున, ఆత్మ సర్వవస్తువులందు చైతన్య ప్రకాశము కలిగించుచున్నది. చైతన్యము వస్తువుల వలన ఆత్మకెట్టి ప్రయోజనముగాని పరివర్తనముగాని లేదు.

ప్రపంచమున సూర్యోదయమువలన కలుగు జనుల వ్యవహారములనిచ్చట ఉపమానముగ తెలుపబడుచున్నది. జనులయందుండు సుఖదుఃఖముల వలన సూర్యునకెట్టి పరివర్తనము కలుగుటలేదు. తన ఎదుటవచ్చిన వారికి తన ప్రకాశము అందజేయుచుండును. అదే విధముగ ఆత్మచైతన్యమువలన ప్రపంచ వ్యవహారములు జరుగుచున్నవి. తాను చైతన్యమొసగు విషయములలో ఆత్మ సంపర్కమొందుట లేదు. ప్రపంచమునగల రాగద్వేషములతో ఆత్మకు సంబంధం లేదు. ప్రపంచమున కలుగుచుండు యుద్ధములవలనగాని, మండుచుండు భవనముల వల్లగాని సూర్యునికి సంపర్కము లేదు.

శ్లో॥ దేహేంద్రియ గుణాన్కర్మా ణ్యమలే సచ్చిదాత్మని ।
అధ్యస్యన్త్యవివేకేన గగనే నీలతాదివత్ ॥ 21 ॥

తా॥ ఆకాశమున నీలము మొదలగు వర్ణములున్నవనునట్లు, పరిపూర్ణ సత్తు, చిత్తు, ఆనందమగు ఆత్మయందు, అవివేకమువలన, దేహము, మనసు ఇంద్రియముల వ్యవహారములను మూఢులు ఆరోపించుచున్నారు.

వివేకము లేనందువలన, మనోబుద్ధుల గుణములను స్థూల సూక్ష్మ శరీరముల పరిమితులను, శుద్ధ ఆత్మయందారోపించి, ఆత్మకీ గుణదోషము లున్నవని నిర్ణయించుచున్నారు. ఇట్టి అవివేకము, పసిబాలురు, వర్ణములేని ఆకాశమునకు నీలవర్ణమున్నది అనునట్లు తలచవలెను.

నీలవర్ణము మాత్రము కాదు. ఆకాశము గుండ్రముగ నున్నదని, మైలగ నున్నదని, దుమ్మునిండినదని కూడ తలచుచున్నారు. నిజము, ఆకాశమున ఇన్ని గుణములు తోచినను, ఆకాశమున ఏ గుణమును లేదు.

నిజముగ లేని గుణదోషముల నారోపించుటవలన ఆత్మకు ఎట్టి దోషము కలుగుటలేదు. విశాల ఆకాశమును వేసవికాలమున చూచినయెడల దృష్టిదోషము వలన నీలముగ తోచుచున్నది.

శ్లో॥ అజ్ఞానాన్మానసోపాధేః కర్తృత్వాదీని చాత్మని ।
కల్ప్యన్తేఽంబుగతే చంద్రే చలనాది యథాంభసః ॥ 22 ॥

తా॥ నీరు చలించుచుండగ, నీటియందు ప్రతిబింబించు, చంద్రుడు చలించు చున్నాడని అవివేకులు తలచుచున్నారు. అదే విధముగ మనో వ్యాపారములగు కర్తృత్వము కర్మఫల భోక్తృత్వము కర్మయందలి కష్టనష్టములు అజ్ఞానమువలన ఆత్మయందారోపించుచున్నారు.

నేను కర్త, నేను భోక్త యనునది బుద్ధియొక్క వ్యవహారము. జాగ్రత్త, స్వప్నము నందు మాత్రమ్ము, "నేను కర్తా, భోక్త, కష్టపడుచున్నాను, దుఃఖపడుచున్నాను" అనగల భావములు కలుగుచున్నవి. సుషుప్తియందు గాఢనిద్రలో ఇట్టి భావములు లేవు. మనో వ్యాపారముండు నంతవరకు విషయ జ్ఞానము కలుగుచుండును. మనసుతో తాదాత్మ్యము పొందునంతవరకు, కర్త, ఫలము అను ద్వంద్వ అనుభవములు, పై స్థితులయందు గలుగుచుండును. మనోరంగమునుండి విరమించుకొని, సమాధియనబడు శుద్ధమగు ఎఱుకయందు లీనమైనపుడు, దేహమనోబుద్ధుల వ్యవహారములు ఆత్మయందు లేవని, అవి ఆత్మ సంబంధములు కావని తెలియుచున్నది. ఆలోచనల ప్రవాహము ఆగిపోయినపుడు మానస సరోవరమున ఆత్మ ప్రతిబింబము, చలించుటవలన నేను కర్త, నేను భోక్త అను ఆందోళనములు లేకపోవుచున్నవి.

ఇచ్చట ఒక గిన్నెలోనున్న నీరు ఉపమానముగా తెలుపబడియున్నది. నీటిపై చంద్రుని ప్రతిబింబము కనబడుచున్నది. నీరు చలించునపుడు ప్రతిబింబము కూడ చలించును. చంద్రుడు ముక్కలైనట్లు తోచును. నీరు శాంతపడగా, వికలమైన చంద్రుడు పూర్ణమగునట్లు తెలియును. అదేవిధముగా ఒక వ్యక్తి తన మనసును

నిర్మలపరచి, శక్తివంతముచేసి, అచలముగా, దృఢముగా నుండునట్లు చేసి తనకు పూర్వముండిన దోషగుణములెల్ల తొలగించుకొనిన యెడల అతనియందు స్వతః సిద్ధముగ ఆత్మప్రకాశము సర్వవైభవములతో ప్రకాశించును.

శ్లో॥ రాగేచ్ఛా సుఖదుఃఖాది బుద్ధౌ సత్యాం ప్రవర్తతే ।
సుషుప్తౌ నాస్తి తన్నాశే తస్మాత్ బుద్ధేస్తు నాత్మనః ॥ 23 ॥

తా॥ ఇచ్ఛట రాగము, సుఖము, దుఃఖము మొదలగునవి బుద్ధి (మనస్సు) వ్యవహరించునంతకాలము కనబడుచుండును. మనసు (బుద్ధి) లీనమగు సుషుప్తి యందు ఇవి కానరావు. కనుక ఇవి మనసుకు సంబంధించినవి, కాని ఆత్మకు కాదు.

సర్వజ్ఞ సర్వవ్యాపి ఆనందమయమగు, ఆత్మయందు అవిద్యకు ఆస్పదము లేదు. దీపములకెదురుగా చీకటి యుండజాలదు. మనసు ఆత్మయందు లీనమైపోయినపుడు రాగద్వేషములకు అవకాశము లేదు. జీవునియందుగల అవిద్యవలన సుఖాపేక్ష కర్మఫలాసక్తి కలిగి అతడు సంసారబంధములందు తగులుకొనుచున్నాడు.

నిర్మలమగు మనసు గొప్ప సుఖము, ఆనందము, ప్రకాశము కలిగించి తుదకు ముక్తివలన పరమపద ప్రాప్తి కలిగించును. అదే మనసు అజ్ఞాన మలినము చేత జీవుని హీనజన్మముల పాలుజేయుచున్నది. కనుక ఈ దుష్టస్వభావములను మనసు చక్కగా నియమించి, దాని విపరీత చేష్టలను శాంతింపజేసిన యెడల జీవన్ముక్తి పదవి లభించును. ఆత్మసాక్షాత్కారము కలుగును. కనుక రాగద్వేషములు మొదలగునవెల్ల మనసు యొక్క సొత్తు, ఆత్మవి కాదు.

మనసుతో జతపడి మనము వ్యవహరించునంతకాలము రాగ, ద్వేష సుఖ దుఃఖముల రాపిడి తప్పదు. నిద్రయందు తాత్కాలికముగా మనసు లీనమగు చున్నది. కనుక ఈ రాపిడి కనబడదు. నేను పచ్చని అద్దము ద్వారా చూచిన

ప్రపంచమంతా పచ్చగా కనబడును. ఆ అద్దమును తొలగించి చూచిన, పచ్చరంగు లేకపోవును. అదే విధముగా రాగద్వేషములెల్ల మనసు యొక్క రంగు ఆత్మది కాదు.

శ్లో॥ ప్రకాశోఽర్కస్యతో యస్య శైత్యమగ్నేర్యథోష్ణతా ।
స్వభావః సచ్చిదానన్ద నిత్యనిర్మలతాత్మనః ॥ 24 ॥

తా॥ ప్రకాశించుట సూర్యుని స్వభావము. చల్లదనము నీటి స్వభావము. ఉష్ణత్వము అగ్ని స్వభావము. అదే రీతి, నిత్యనిర్మల సత్య, జ్ఞాన, ఆనందములు ఆత్మస్వభావములు.

మానవులు కాని, జంతువులు కాని, వృక్షములుకాని, దుఃఖమనుభవించ వలెనని, మరణించవలెనని, కోరునదేదియు కనబడదు. మఱి ప్రత్యక్ష విరుద్ధముగ సర్వకాలము నందు, సుఖమునపేక్షించుట, ప్రాణరక్షణ చేసుకొనుట జ్ఞానసంపద పొందుటయందు ప్రయత్నములు చేయుట చూచుచున్నాము.

స్వధర్మమును కోల్పోయి ఏ వస్తువు నిలువజాలదు చల్లని అగ్ని యుండదు. చీకటి సూర్యుడు లేడు. ప్రతివస్తువు తన స్వభావమును ప్రకటించి తీరవలెను.

ప్రకాశస్వరూపుడగు సూర్యుడు ప్రకాశము నిచ్చుచున్నాడు. అగ్ని ఉష్ణత్వము కలిగియున్నదని అందరికి తెలియును. అదే విధముగ ఆత్మను గుణలక్షణములతో తెలుపవలెనన్న ఆత్మ నిత్యము, నిర్మలము, సత్తు, చిత్తు, ఆనందము అని తెలియవలెను.

శ్లో॥ ఆత్మనః సచ్చిదంశశ్చ బుద్ధేర్వృత్తి రితి ద్వయమ్ ।
సంయోజ్య చావివేకేన జానామీతి ప్రవర్తతే ॥ 25 ॥

తా॥ ఆత్మయొక్క సత్తు, చిత్తు అను అంశములతో, బుద్ధియొక్క ఆలోచనా వృత్తులను అవివేకమువలన తెలియపరచుటవలన, నాకు తెలియును అను జీవ భావమేర్పడును.

ఆత్మ స్వప్రకాశ స్వరూపమైవుండగా, మనస్సు జడమై వున్నది. ఆత్మ చైతన్యములోని ప్రకాశశక్తి మనసు కలిగివుండకపోతే ఏదీ తెలుసుకోలేనిదై, శక్తి

హీనమై, జడముగా వుండిపోవలసిందే, మనలో ఆ ఎఱుకయే లేకుంటే మన ఆలోచనలు ఏమిటో మనం గుర్తించలేము. చైతన్యము – జడము ఒకదానికొకటి విరుద్ధము కనుక ఈ రెండూ కలవటం అనేది సాధ్యపడదు. అందువలన కేవలం భ్రమవల్ల జనించిన ఆధ్యాసవలననే ఈ రెండూ కలిసినట్లు భావించటం జరుగుతుంది.

చైతన్య ప్రకాశములో ఆలోచనలు లేక వృత్తులు వెలిగింపబడినప్పుడే "నాకు తెలుసు" అనే వృత్తి ఉదయిస్తుంది. మనోభాండారములో, అలజడిరూపంలో లేచే ప్రతి ఆలోచనా తరంగము ఇక్కడ ఆలోచన అనే వృత్తిగా పరిగణింప బడుతుంది. మనలో ఈ ఆలోచనా తరంగాలు ఎగసినప్పుడు, మన ఎఱుకలోనే అవి ప్రకాశింపబడుతున్నాయి... అందుకే మనం ఏడ్చినప్పుడు "నాకు తెలుసు", "నాకు అర్థమయినది", "నేను భావిస్తున్నాను" వగైరా వృత్తులను వ్యక్తం చేస్తున్నాము.

సూర్యుడు ఉదయించినప్పుడు ఆ ప్రకాశంలోనే సముద్రతరంగాల దృశ్య జ్ఞానం మరియు అనుభవం రెండూ కలుగుతున్నాయి. సూర్యకాంతి తరంగాలన్నింటి మీద సమంగా విస్తరించుకుంటుంది. ప్రతి తరంగముపై ఈ కాంతి మెరుస్తూ పొరలాగా కనిపిస్తుంది, ఆ లేచే తరంగాలతోపాటుగా ఈ కాంతి ఎంత మేరకు తరంగము లేచిందో అంత మేరకు అన్నివైపులా స్పృశించి విస్తరించుకుని మెరుస్తూ వుంటుంది. అదే ప్రకారంగా మన అంతరంగములోని చైతన్యప్రకాశము, ప్రతి ఒక్క ఆలోచనని స్పష్టంగా ఎటువంటిదైనప్పటికీ వెలిగించుచున్నది.

ఇంద్రియాలు బాహ్య ప్రపంచం నుండి విషయ సమాచారాన్ని అంతరంగానికి చేరవేసినప్పుడు మనోబుద్ధి కరణాలు నిత్య ఆత్మచైతన్యపు ఎఱుకలోనే ఎప్పుడూ వెలిగింపబడుతూ వున్నాయి. మనస్సు గతంలో కలిగిన అనుభవజ్ఞానాన్ని ఆధారంగా చేసుకుని, ఆ విషయ సమాచారానికి స్పందించటం వలన బాహ్యంగా కర్మల రూపంలో వ్యక్తమవుతున్నాయి.

"అవిచ్ఛిన్నమైన అనుభవాల పరంపరయే" జీవితం, అందుచేత జీవుడు

నిరంతరం ఆ వచ్చే స్పందనలకి ప్రతిస్పందిస్తూ వుండవలసినదే. కనుక ఏర్పడుతూ వున్న పరిస్థితులను అర్థం చేసుకోవటం మరియు తగిన రీతిలో వ్యవహరించటం ఇవే మానవుని వివేకవంతమైన జీవితసరళికి ఆశయాలు, అవసరాలు అయి వున్నాయి.

పరమమైన జ్ఞానమే ఆత్మ. తనకు తానుగా జ్ఞానస్వరూపమై వున్నదే ఆత్మ. ఇందులో తెలుసకోవలసినదంటూ మరొకటి లేదు. అద్వితీయమైనపరమాత్మ స్వరూపములో తెలుసుకోవలసిన రెండవ జ్ఞేయవస్తువు లేక పోయినప్పటికీ, బౌద్ధిక జీవనములో నిరంతరం తెలుసుకోవటం అనేది మనకు అనుభూతమవుతున్నది ఇది ఎలా? అనే విషయాన్నే ఈ శ్లోకంలో వివరించారు.

వేదాంతం మనకు స్పష్టంగా సిద్ధాంతీకరించి తెలిపేది ఏమిటంటే... సంప్రాప్త మవుతున్న వస్తుజ్ఞానాలు ఏవీకూడా ప్రత్యక్ష్యంగా శుద్ధచైతన్యం వలన కలిగేవికావు. "మనోబుద్ధులలో ప్రతి బింబించే చైతన్య ప్రతిబింబ స్పర్శవల్లనే కలుగుచున్నవి" ఇది ఒక ఉదాహరణతో పరిశీలించుదాం.

మీ ఇంటిలో ఒకానొక గది ఎప్పుడూ చీకటిగా వుంటూ వుండేదనుకోండి, ఒక రోజు హఠాత్తుగా ఆ చీకటి గదిలో వెలుతురు నిండి వుండటం గమనించారు. ఎక్కడిదా వెలుతురు? అక్కడెక్కడో బయట వాకిట్లో వుంచబడిన బకెట్ నీటిపై సూర్యకాంతి ప్రసరించటం వలన ఆ నీటిపై ప్రతిబింబించిన కాంతి కిరణాలు చీకటిగా వున్న గదిలో గోడమీదకు దూసుకు వచ్చాయి. అందుకే గదిలో ప్రకాశం ఏర్పడినది. ఇంతలో మీ పసివాడు ఆ బకెట్ నీళ్ళతో ఆడుకోవాలని ముచ్చటపడి కదిలించాడు, గదిలోకి ప్రకాశం రావటం ఆగిపోయింది. సూర్యకాంతి ప్రసరించటానికి మాధ్యమంగా నిలిచిన బకెట్ నీరు ఎప్పుడైతే కదిలిపోయిందో ప్రతిబింబించే కాంతిప్రసారం కూడా చెదిరిపోయింది. మరల తిరిగి నీరు నిశ్చల మయ్యే వరకు కాంతి ప్రసరించే వీలులేదు కనుక గది మునుపటిలాగే చీకటిగా మారిపోయింది.

అదే ప్రకారంగా విషయ వస్తువులు వేటినీ ఆత్మ ప్రత్యక్షంగా ప్రకాశింప చేయుటలేదు, అయితే ఆత్మ ప్రకాశము మనో బుద్ధులలో ప్రసరించటం వలన వ్యక్తమయ్యే ప్రతిబింబ చైతన్యమేదైతే వున్నదో, అది విషయ వస్తువులను స్పృశించటం ద్వారా, మనకు "నాకు తెలుసు" అనే అనుభవాన్ని కలిగిస్తుంది. అందుకే చివరకు వివేకవంతుడైనవాడు సైతం ఏదైనా విషాదానికి గురైనప్పుడు సరిగా ఆలోచించలేక పోవటం, అర్థం చేసుకోలేకపోవటం జరుగుతుంటుంది. అతడిలో మనస్సు అలజడికి లోనైనప్పుడు ఆలోచనాశక్తి, అవగాహనశక్తి మరుగై పోతుంది.

అలా మనసులో ఆలోచనలు ఎగసిపడినప్పుడు వాటిని ప్రకాశింపచేసేది ఆత్మయే. ఆత్మ ప్రకాశంతో ఆలోచనలు – జత కూడటం వలన "నాకు తెలుసు" అనే అనుభవం స్పష్టంగా కలుగుచున్నది. చైతన్యం అలా కలిగే కదిలే భావనలు మరియు అనుభవాలు ఏవైతే వున్నాయో అవే విషయాలకు సంబంధించిన జ్ఞానమవుతుంది.

జ్ఞానం కలగటం, క్రోధం విజృంభించటం మొదలైనవన్నీ మనస్సుకు సంబంధించినవి అయితే అవివేకము చేత వీటిని ఆత్మకి ఆరోపించటం జరుగుతుంది. నిజానికి ఆత్మ ఎప్పుడూ సచ్చిదానందస్వరూపమే, జీవుడు సుఖదుఃఖాది అనుభవాలు పొందుతున్నప్పటికీ ఆత్మ ఎటువంటి వికారములు చెందుటలేదు.

శ్లో॥ ఆత్మనో విక్రియానాస్తి బుద్ధేర్బోధో న జాత్వితి ।
జీవ స్సర్వమలం జ్ఞాత్వా జ్ఞాతా ద్రష్టేతి ముహ్యతి ॥ 26 ॥

తా॥ ఆత్మ నిష్క్రియుడు ఏ పనిచేయుట లేదు. బుద్ధికి స్వయముగ ఏ పనిచేయుటకు "నేను తెలుసుకొనుచున్నాను" అని అనుభవించుటకు శక్తి లేదు. అట్లుండియు భ్రమ వల్ల జీవుడు "నేను చూచుచున్నాను, తెలుసుకొనుచున్నాను" అని తలచుచున్నాడు.

మానవబుద్ధి స్వయముగ స్ఫుర్శించు, ఆలోచించు, నియమించు, ఆశించు

శక్తిసంపన్నముగ లేదు. ఇది జడం, ప్రకృతి జన్యము, ప్రకృతి నుండి కలిగినది. ఒక దీపమునకు విద్యుచ్ఛక్తి సోకకపోయినచో, ఎట్టి ప్రకాశమును యివ్వజాలదు. ఆత్మ, స్వయముగ శుద్ధజ్ఞానస్వరూపము, మానసిక ఆలోచనలు, శారీరక కర్మలు దానిని అంటవు. జీవుడు, మనసునందు ఆత్మ ప్రతిబింబము నిజస్వరూప మెఱుగని అవిద్యవలన, శరీర మనోబుద్ధులతో అసత్య తాదాత్మ్యము పొంది, ఈ జడప్రాయపు కోశములపై ఆత్మగుణముల నారోపించుచున్నది. ఇట్టి ప్రమాదము వలన, "నేను చూచుచున్నాను" అను భావములు, నిజస్వరూప జ్ఞానములేని దోషము వలన జీవునియందు కలుగుచున్నవి.

సర్వవ్యవహారములకు అధిష్ఠానము, ఈ అవ్యయమగు ఆత్మ సముద్రములో అలలవలె ఈ రూపనామములతో కూడిన బహురూప ప్రపంచములు పుట్టుచున్నవి, గిట్టుచున్నవి. ఆ అధిష్ఠానమునందు భ్రమచెందిన జీవుడు ఈ స్వప్నమను చూచు చున్నాడు. సముద్రమును వదలి అలలు లేవు. పరమాత్మ అధిష్ఠానమును వదలి ప్రపంచము లేదు. ఆ పరమ పురుషుడే ఆత్మ, ఈ పరిణామములవలన అతనికెట్టి లోటు కలుగుటలేదు. కాల, దేశ, ప్రమాదములు అతనిని అంటజాలవు.

అంతర మనోరంగమున కలుగు వ్యవహారములన్నియు ఆత్మచైతన్యము వలన ప్రకాశమగుచున్నవి. దుఃఖములు, నిరుత్సాహము, విసుగు, సుఖము, జయము, క్రోధము, ఈర్ష్య, మోహము లాంటి ఎన్నిరకముల అలలు మనసున కలుగుచుండినను ఈ అలలనెల్ల ఎఱిగిన ఆత్మకు ఎట్టి పరిణామము కలుగుటలేదు. ప్రపంచమున, పాపకార్యములు జరుగుచున్నవని విశేషముగ ప్రకాశింపబడు "సుఖము, దుఃఖము అనుభవించుచున్నాను" అని పలుకుట నా సాన్నిధ్య బలము వలన, ఈ మనోభావములనెల్ల నేను ప్రకాశింపజేయుచున్నాను. "నేను జ్ఞాన ప్రకాశమును ఈ మనోభావములు నావి కావు" ఇదియే జ్ఞానియొక్క జ్ఞానము.

శ్లో॥ రజ్జు సర్పవదాత్మానం జీవం జ్ఞాత్వా భయం వహేత్ ।
నాహం జీవః పరాత్మేతి జ్ఞాతశ్చేన్నిర్భయో భవేత్ ॥ 27 ॥

తా॥ ఒక త్రాడును పాముగ నుండవచ్చునని తలచువాడు భయకంపితు డగుచున్నాడు. అదే విధముగ నేను జీవుడనని తలచువాడుకూడ భయభ్రాంతు డగుచున్నాడు. అహంకారజనిత వ్యక్తి, నేను జీవుడు కాదు, పరమాత్మయని తెలియుటచే భయ వివర్జితుడగుచున్నాడు.

త్రాడొకటి అచ్చట యున్నదను విషయము తెలియనపుడు, సర్పదృశ్య మారోపితమగు చున్నది. ఒక భ్రాంతి కలిగినపుడు, అది అనేక కలవరములతో, వేలకొలది నిష్కారణ భావములుగ పెరుగుచున్నది. దాని ఫలము ననుభవించు చున్నది. ఒక సర్పదృశ్యము కలిగినపుడు సర్పము యొక్క వివరణ యంతము తోచును. దాని కాటువల్ల కలుగుబాధ, విషమువల్ల మరణభీతి- అన్నియు త్రాడు మీద ఆరోపింపబడిన సర్పమువల్ల కలుగుచున్నవి.

ఆత్మజ్ఞానము లేమిచే ఈ స్థూలశరీరము, మనసు మొదలగు భ్రాంతి దృశ్యములెల్ల సత్యమని తోచుచున్నవి. ఈ భ్రమయందు వివేకము చెడిన అహంకారము తాను సృష్టించుకొనిన దుఃఖముల ననుభవించుచున్నది. మన నిజస్వరూపము ఈ పరిమితి గల ఆకారము కాదు, మనకు తెలిసియుండు దానికన్న, అధిక విస్తారమగు ఆవరణము మన అనుభవమునకు వేచి యున్నది. అది మన కుత్సితభావమువల్ల మనకు దూరమై యున్నది. నిజమగు ఆత్మజ్ఞానము శ్రవణమాత్రముచేత కలుగుటచేత, నిరంతర దుఃఖములపాలై యున్న అదే వ్యక్తి తన పరిమితులు విదలించుకొని, మేల్కొని, సర్వవ్యాపక, నిత్య ఆనందస్వరూప ఆత్మయే తానని మరల తెలియుచున్నాడు.

అటుపిమ్మట బాహ్యప్రపంచమున అనుభవములు కలుగుచుండినను అట్టి మహాత్ముడు, తన నిత్యానంద జీవిత గానమును పాడగల ఆవరణములనే అతడు కనుగొనుచున్నాడు.

శ్లో॥ ఆత్మావభాసయత్యేకో బుద్ధ్యాదీనీంద్రియాణ్యపి ।
దీపో ఘటాదివత్ స్వాత్మా జడైస్తైర్నావభాస్యతే ॥ 28 ॥

తా॥ ఒక దీపము- ఒక కుండను, బిందెను మొదలగువాటిని ప్రకాశింప జేయునట్లు ఆత్మ- మనసు, ఇంద్రియములు మొదలగు వాటిని ప్రకాశింపజేయుచున్నది. ఈ ప్రకృతిమయ వస్తువులు జడములు కనుక అవి స్వయంగా ప్రకాశింపజాలవు.

వీధియందు వెలుగు దీపము, తన ప్రకాశమున జరుగు కార్యములచే కలవరము పొందక శాంతముగ నుండును. ఆ ప్రకాశమును నడచు పెండ్లి వారి సంతోషములు, మరణించినవాని మరణరోదనము చేయుచు పోవు వారి దుఃఖములు, ఆ దీపమును వికారమొనర్ప జాలకున్నవి. వారి అందరిమీద దాని ప్రకాశము సమముగ వ్యాపించుచున్నది.

ఒక తపాల ఉద్యోగి, తాను తెచ్చి అందజేయు ఉత్తరమునందలి విషయము లచే వికృతి పొందుటలేదు.

ఒక రైలులో, బస్సులో, వెళ్ళునపుడు మనము కూడ, మన ప్రక్కనయున్న ప్రయాణికుని కష్టములను గమనించుటలేదు.

మనయందుగల మంచి చెడ్డలను ప్రకాశింపజేయునది మన శుద్ధమగు జ్ఞాన ఎఱుక. ఆత్మ ఏకైక ప్రకాశింపజేయగల శక్తి. "మనసు దేనిని తెలియజాలదో దేనివలన మనసు తెలియగలుగుచున్నదో అది బ్రహ్మము. ఇచ్చట జనులు పూజించునది కాదు".

"యన్మనసాన మనుతే యేనాహుర్మనో మతమ్ ।

తదేవ బ్రహ్మత్వం విద్ధి నేదం యదిద ముపాసతే" *(కేనోపనిషత్)*

ఆ ఒక్కశక్తి వలన, శరీర కర్మలు, మనోవ్యాపారములు, బుద్ధి ప్రవాహములు, మనలో తేజోవంతముగ జరుగుచున్నవి. ప్రకృతి జన్యమగు అంగములు, శక్తియందు, తేజస్సునందు, వికాసమునందు తారతమ్యములు కలిగియున్నను, వీటినెల్ల వ్యాపించి, వీటికి చైతన్యమొసగి, జగత్తుకు చైతన్యమొసగునది ఈ ఆత్మశక్తి యొకటియే.

శ్లో॥ స్వబోధే నాన్యబోధేచ్ఛా బోధరూపతయాత్మనః ।
న దీపస్యాన్యదీపేచ్ఛా యథా స్వాత్మా ప్రకాశనే ॥ 29 ॥

తా॥ ప్రకాశించుచుండు ఒక దీపమును తెలుపుటకు మరొక దీపమనవసరము. అదే విధముగ, జ్ఞానస్వరూప ఆత్మను తెలియుటకు మరొక జ్ఞానసహాయము అవసరము లేదు.

ఒక చీకటి గదిలో నుండు పాత్రలను చూచుటకు ఒక దీపము కావలెను. అందుకొఱకై తెచ్చిన దీపమును చూచుటకు మరొక దీపమవసరము లేదు.

ప్రపంచమునయుండు సర్వవిషయములను సూర్యుడు ప్రకాశింపజేయు చున్నాడు. ఆ సూర్యుని చూచుటకు ఒక దీపమవసరము లేదు. మనయందు ప్రతి అనుభవమును ప్రకాశింపజేయు తేజస్సును తెలుసుకొనుటకు, చూచుటకు, అనుభవించుటకు, సర్వప్రాణులయందు నిత్యనివాసియగు ఆ ఆత్మను తెలిసి కొనుటకు వేరొక తెలివి అవసరము లేదు. ఆ ఆత్మ యొక్కటే సత్యము, ఆత్మ, దృశ్యాదృశ్య జగత్తుకు జ్ఞానజ్యోతియై యున్నది.

ప్రకాశమున యుండిన పాత్రల నావలికి తీసినయెడల, ప్రకాశము నాశ మగుటలేదు. అదే విధముగ, ప్రపంచ విషయములెల్ల, మన జాగ్రత్ స్వప్న సుషుప్తులెల్ల ముగిసిపోయినను, ఆత్మప్రకాశము నాశనమగుటలేదు. ఎందుకనగా ఆత్మ, నిత్యము, స్వప్రకాశము. ఆ ప్రకాశమును తెలుసుకొనుటకు వేరు ప్రకాశ మవసరము లేదు.

నేను బహిర్ముఖుడనై యుండునంత కాలము, బాహ్యమునగల విషయ ప్రపంచము ప్రకాశించుచుండును. నేను అంతర్ముఖుడైన తక్షణము నా దృష్టిలోనికి మరల, నా హృదయమందు ప్రకాశించు తేజసు, బాహ్యప్రపంచమున సర్వమును ప్రకాశింపజేయు తేజసు ఏకము. అదియే సత్యము అని తెలియుచున్నది. విజ్ఞాను లగు ఋషులు తెలిపిన ఏ మార్గమవలంబించినను, సక్రమముగ పాటుబడిన యెడల, ఆ సత్యమును తప్పక కనుగొనగలము.

సర్వపరిపూర్ణ, సర్వవ్యాపక, అద్వితీయ ఆత్మను బుద్ధి నిర్ణయించజాలదు. బుద్ధికి నిర్ణయించగల శక్తినిచ్చునది ఆత్మ, అట్టి ఆత్మను పరిచ్ఛిన్నమగు బుద్ధి విషయములవలె, దృశ్యరూపముగ కనుగొనగలుగుట దుర్లభము. బుద్ధి ఆత్మవైపు మరలుటతోడనే ఆత్మప్రకాశమున అది రూపులేకపోవుచున్నది.

ఈ స్థూలశరీరము అనుభవింపబడు విషయముగ నున్నది. మనసు ఈ శరీరము కన్న సూక్ష్మముగ నున్నది. బుద్ధి మనసుకన్న సూక్ష్మముగ నున్నది. అయినను అది అనుభవవేద్య దృశ్యమగుచున్నది. లోదృష్టి పొందుటవలన సూక్ష్మ ఆలోచనలు కనబడుచున్నవి. వీటికి సూక్ష్మముగ భావములు, భావగమ్యములు తెలియుచున్నవి. ఇట్టి ఆలోచనలు, భావములు కూడ అణగిపోయిన వెనుక, ఆత్మప్రకాశము పొందుటకేదియు మిగులుటలేదు. అట్టి పవిత్ర అపురూప క్షణికమున, ఆత్మ తానుగ ప్రకాశించుచుండును. వీధియందలి దీపము అర్ధరాత్రి యందు ఏకాకిగ నుండునట్లు ఆత్మ అద్వితీయముగ నుండును.

స్వప్నించువాడు, జాగ్రత్తున మేల్కొనిన వెనుక, స్వప్నించుచుండినవాడే నేను ఇపుడు జాగ్రత్ యందున్నానని తెలుసుకొనును. ఆత్మ ఎఱుకయగు పరమ పదవి పొందినపుడు, అన్ని ద్వంద్వభావములు నశించి, నేను నిత్య ఆనంద ఆత్మనని తెలిసికొనుటకు వేరొక ప్రకాశము అవసరము లేదు. ఈ అనుభవము వ్యక్తి, తన ఆత్మ పదవికి ఆత్మ సాక్షాత్కారమునకు తానుగా మేలుకొనునటువంటి ప్రయత్నముగా నున్నది.

శ్లో॥ నిషిధ్య నిఖిలోపాధీన్ నేతి నేతీతి వాక్యతః ।
విద్యాదైక్యం మహావాక్యైః జీవాత్మ పరమాత్మనోః ॥ 30 ॥

తా॥ శ్రుతులందు తెలుపబడియుండు మహావాక్య సూచకములుగా నేతి, నేతి అను వాక్యములచే, ఉపాధులనెల్ల నిరసించి, జీవాత్మ పరమాత్మ ఐక్యమును తెలియ వలెను.

వేదములందలి మహావాక్యములు నాలుగు. 1. తత్త్వమసి, 2. అయమాత్మా బ్రహ్మ, 3. ప్రజ్ఞానం బ్రహ్మ, 4. అహం బ్రహ్మాస్మి. జీవాత్మకు పరమాత్మకు అధిష్ఠాన మొక్కటే యగుటచేత, ఇవి రెండును ఏకము, అద్వితీయమని పై మహా వాక్యములు తెలుపుచున్నవి.

ఈ శ్లోకమునందు వ్యక్తిని బంధించు అనాత్మ కోశములగు, స్థూల, సూక్ష్మ, కారణ శరీరములను తదితర అనాత్మ విషయములను నిరసించి, ఆత్మను పొందు మార్గము తెలుపబడి యున్నది. ఈ మార్గములు జీవుని, తన నిజ స్వరూపమున చేర్చి పరమాత్మయందు ఐక్యము పొందింపజేయుచున్నది.

శుద్ధజ్ఞాన ఎఱుక, సత్యస్వరూపముగ నాయందున్నది. అదియే, మీయందు, సర్వులందు, సర్వత్రయున్నది. దీనిని గురువు "తత్త్వమసి' అని బోధించును. తీవ్రమోక్షేచ్ఛగల సాధకుడు, ప్రకృతి రూప, జడ ఉపాధులనెల్ల విచారించి, ఇవి నేను కాదు అని నిరసించును. శరీరము, ఇంద్రియములు, ఇంద్రియ విషయములు, మనసు, ఆలోచనలు, బుద్ధి భావములు మొదలగునవి ఆత్మ కాదు. కాల, దేశ పరిస్థితులు మనోకల్పితములని వాటిని నిరసించి, ఈ అనాత్మ ఉపాధులు నేను కాను, అన్నిటికీ ఆధారము అధిష్ఠానమగు ఆత్మయే నేను అని తెలిసికొనును.

ఈ మహావాక్యములు, భగవంతుని దివ్యమందిరము యొక్క బంగారు వాకిళ్ళు తెరచుటకు తాళపుచెవుల వంటివి. తలుపులు తెరచి, జీవుడు అహం బ్రహ్మాస్మి అని భగవంతుని అనుభవించును.

శ్లో॥ అవిద్యకం శరీరాది దృశ్యం బుద్బుదవత్ క్షరమ్ ।
ఏతద్విలక్షణం విద్యాత్ అహం బ్రహ్మేతి నిర్మలమ్ ॥ 31 ॥

తా॥ "శరీరత్రయములు అవిద్యా కల్పితములు, దృశ్యములు, నీటి బుడగలవలె క్షణభంగురములు. వీటికెల్ల విలక్షణమగు శుద్ధబ్రహ్మమును నేను" అని విచక్షణవల్ల తెలిసికొనుము.

జీవుడు తన అనుభవములను ప్రకాశింపజేయుటకు ప్రకృతిమయమగు పంచకోశములు నిర్మింపబడెను. స్థూల, సూక్ష్మ, కారణ శరీరముల ద్వారా ఆత్మ తాదాత్మ్యము పొంది, జాగ్రత, స్వప్న సుషుప్తుల ననుభవించుచున్నాడు. ఆత్మ స్థూలశరీరముతో తాదాత్మ్యము పొంది విశ్వుడని జాగ్రతానుభవముల ననుభవించు చున్నాడు. సూక్ష్మశరీరముతో కూడ తైజసుడని స్వప్న వ్యవహారముల ననుభవించు చున్నాడు. స్థూల, సూక్ష్మ శరీరములనుండి విరమించుకొని, కారణ శరీరముతో తాదాత్మ్యము పొంది ప్రాజ్ఞుడని, సుషుప్తి (నిద్ర)ని అనుభవించు చున్నాడు. ఈ నిద్రయందు పూర్వమనుభవించిన, జాగ్రత, స్వప్న అనుభవములు కనబడుట లేదు. ఈ రీతి ఆత్మ స్థూల, సూక్ష్మ, కారణ శరీరములతో తాదాత్మ్యము పొంద గలిగిన జాగ్రత, స్వప్న, సుషుప్తులను మూడవస్థల ననుభవింపగలిగినచో, అతడు ఈ మూడు శరీరములకు అవస్థలకు అతీతుడై యుండవలెను. ఆత్మ అట్టివాడని ఈ శ్లోకము తెలుపుచు విచక్షణవలన ఈ ఉపాధులను తొలగించి ఆత్మను ఎఱుగవలెనని బోధించుచున్నది.

ఇంతవరకు అజ్ఞానము వలన కలిగిన నష్టమును తొలగించుకొని దృశ్యము కన్న ద్రష్ట విలక్షణుడనియు, ఇంద్రియముల వలన తెలియువాడు, ఇంద్రియముల కన్న విలక్షణుడని, ఆలోచించు మనసుకన్న ఆలోచనలు తెలియువాడు విలక్షణుడని, భావములు తెలియువాడు భావించు బుద్ధికన్న విలక్షణుడని తెలియవలెను. నాయందలి దైవాంశమే వీటినెల్ల ప్రకాశింపజేయుచున్నది. ప్రకాశమునకన్న ప్రకాశించు విషయములు విలక్షణములు, నేను ఎఱుగుచుండు విషయములకన్న నాయందలి శుద్ధమగు ఎఱుక విలక్షణము, ప్రత్యేకము, శాశ్వత కర్తగా యున్నది.

శ్లో॥ దేహాన్యత్వాన్న మే జన్మ జరాకార్శ్యలయాదయః ।
శబ్దాది విషయైః సంగో నిరింద్రియ తయా న చ ॥ 32 ॥

తా॥ ఈ దేహముకన్న నేను అన్యము, కనుక నాకు జన్మము లేదు. ముసలితనము లేదు. శరీరము సళ్ళుబడుట లేదు. ఈ శబ్ద, స్పర్శ మొదలగు ఇంద్రియ విషయము లతో నాకు సంపర్కము లేదు. నాకు ఇంద్రియములు లేవు.

వివిధ రకాల అనుభవాలకు, అవస్థలకు ఆధారమైన ఆత్మ తత్త్వనిరూపణ చేయడం ఇంతకు మునుపే జరిగింది. ఈ శ్లోకంలో తరువాత రాబోయే ఆరు శ్లోకాలలో శరీర మనోబుద్ధులు మరియు వాటి అనుభవాలు అన్నింటిని నిషేధించే విధానాన్ని తెలియజేస్తున్నారు. ఈ నిషేధ విధానం ద్వారా సాధకులు చివరకు తమని తాము అన్నింటిని వెలిగించే స్వయం ప్రకాశరూపంగా దర్శించుగాక! అని ఆచార్యులు దీవిస్తున్నారు.

నేను దేహాన్ని కాకబోతే ప్రారబ్ధవశాత్తు దేహానికి దాపురించే దుర్భరమైన అనుభవాలు నాకు వుండవు. అవి నాకు కాదు. పుట్టినది మొదలు మరణించే వరకు దేహానికి కలిగే ఈ చావు, పుట్టుకలు పెరుగుట, క్షీణించుట, రోగాలపాలగుట వంటి నిరంతర మార్పులు దేహానికే కాని నాకు కాదు. అజమైన ఆత్మనే నేను. పుట్టుకే నాకు లేనప్పుడు మార్పులు చెందే లక్షణం కాని, నశించే తత్త్వముకాని నాకు లేదు. వీటిలో దేనినైనా నాదిగా పొరబాటున భావించటం జరిగితే అది నా దురదృష్టమే. దేహాత్మబుద్ధి వలన మనలో జనించే అహంకారము, కలిగే ఈ మార్పులకు మరియు అనర్థాలకు బాధపడుతూ వుండవలసిందే. దేహము కన్నా ఏవిధంగా నేను వేరై వున్నానో, అలాగే ఇంద్రియ సంబంధ విషయాలకు కూడా నేను విలక్షుడనే. దేహము నేను కాక, ఇంద్రియాలూ నేను కాకపోతే వుండే 'నేను' ఎవరు? శూన్యమా? అసత్తా? నశ్వరమైన బాహ్య మరియు అంతర ప్రపంచాలను మరియు తత్సంబంధిత విషయాలన్నింటిని వెలిగించే చైతన్యమేదైతే వున్నదో అదే ఆ అద్వితీయమైన, అసంగమైన సర్వవ్యాపక స్వయం ప్రకాశరూపమే, నేను.

శ్లో॥ అమనస్త్వాన్న మే దుఃఖ రాగద్వేష భయాదయః ।
అప్రాణో హ్యమనః శుభ్ర ఇత్యాది శ్రుతి శాసనాత్ ॥ 33 ॥

తా॥ నేను ఈ మనసుకు అన్యము కనుక, నాకు దుఃఖము, రాగము, ద్వేషము, భయము మొదలగు వికారములు లేవు. "అతడు అప్రాణుడు, అమనస్కుడు, శుభ్రుడు" అని శ్రుతి, ఉపనిషత్తులు శాసించుచున్నవి.

మన ఆలోచనలు ప్రవహించునపుడు కలుగు భ్రమలు, వాటి ఉద్రేకమే మనసు అనబడును. అది ఎల్లప్పుడు వికారములు పొందుచుండును. ఆలోచనలు లేక మానవుడు ఒక నిముషము కూడ యుండజాలడు. నాయందు మనసున్నది. కాని నేను మనసు కాదు. నా నిజస్వరూపము శాశ్వత, నిర్వికార ఆత్మ. మనసు నందలి వికారములెల్ల దాని ప్రేరేపణలు, మనసు నిండుగ ఆలోచనలుండును. ఆలోచలు కోరికలనుండి కలుగును. కోరికలు నాకు అన్యముగ నుండి విషయరాశి నుండి సుఖము పొంద యత్నించుటవలన కలుగును. నేను సుఖస్వరూపుడను, విషయములు నాకు సుఖము నియ్యజాలవు. నేను మనసున కతిరిక్తుడుగ నున్నాను, నేను ఆ మనసుకు చైతన్య మొసగుచున్నాను. ఆ మనసుకు గలుగు వికారములు నన్నంటజాలవు అని తెలియుచున్నది. స్వప్నమునుండి మేల్కొనిన వెనుక స్వప్నమున మరణించిన నా బిడ్డకొరకు నేను జాగ్రత్తున దుఃఖించ నవసరము లేదు. మనసు నుండి నేను విరమించుకొని యున్నాను. మనసు నన్ను దుఃఖపెట్ట జాలదు. నేను అమనస్కుడ, శుద్ధజ్ఞానము, అనిర్వచనీయ శాశ్వత పరమ సత్యము. నేను ఆత్మానుభవము పొందిన వారికెల్ల అనుభవ వేద్యముగ నున్నాను.

శంకరులు కూడ శ్రుతివాక్యములను అనుసరించక, తీవ్రమగు పిడివాద వాక్యముల పలుకుట ప్రమాదము, కనుక ఇప్పుడు ఉపనిషత్తు వాక్యములు కొన్ని వల్లించుచున్నాడు.

శ్లో॥ నిర్గుణో నిష్క్రియో నిత్యో నిర్వికల్పో నిరంజనః ।
నిర్వికారో నిరాకారో నిత్యముక్తోఽస్మి నిర్మలః ॥ 34 ॥

తా॥ నేను గుణకర్మ రహితుడను శాశ్వతు(నిత్యు)డను, నాకు కోరికలు లేవు. ఆలోచనలు లేవు (నిర్వికల్పుడను). నిరంజనుడను, వికార రహితుడను, నిత్య ముక్తుడను, నిర్మలుడను.

దేనికి గుణములు, పరివర్తనములు కలవో అది వస్తువనబడును. వస్తువు లన్నియు ప్రకృతి సంబంధములు. ఇచ్చట ప్రకృతికి విలక్షణముగ నుండి

చైతన్యవిషయము వర్ణించబడుచున్నది. కనుక ఆ చైతన్యమునకు గుణములు లేవు. "గుణరహిత ఆత్మ నేను" ప్రకృతి అశాశ్వతము, గుణ యుక్తము. ఆత్మకు గుణములు లేవు కనుక చైతన్యరూప ఆత్మ నిత్యము (శాశ్వతము). కోరికలు, ఆలోచనలు, మనోబుద్ధుల వికారములు, మనోబుద్ధుల కతీతముగ ఆత్మ యున్నాడు. ఆత్మకు ఈ కోరికలు, ఆలోచనలు లేవు పై విచారణవలన ఆత్మ స్థూల, సూక్ష్మ శరీరములకు విలక్షణమని తెలుపబడినది. ఇక కారణశరీరము కూడా నిరసింప బడుచున్నది. అవిద్యయే కారణశరీరము, ఆత్మ యందెట్టి లేపనములు, మైలయు లేవు. అనగా, వాసనలు లేవు. పాపములు లేవు ఆత్మ శుద్ధుడు.

పైన తెలిపినట్లు నాలుగువిధ లక్షణములుగల ఆత్మ అవ్యయుడు (పరిణామ రహితుడు) నిరాకారుడుగ నుండగలడు. అందువలన అతడు నిత్యముక్తుడు. సదా నిర్మలుడు.

ఆరోపిత బంధపరిణామములెల్ల నిరసించగ, సర్వప్రపంచ అధిష్ఠాన మొకటి మిగులుచున్నది. ఏకైక జ్ఞాన ఎఱుక ఈ ఆలోచనలనెల్ల ప్రకాశింపజేయునదా చైతన్యముబట్టి ఆత్మయే నేను అని తెలియుచున్నాను. ఆ యాత్మ పరిణామముల కెల్ల నిర్వికల్ప కూటస్థుడుగ, ఆభరణములకు బంగారువలె, పాత్రలకెల్ల మన్నువలె, నాశరహితుడుగ నున్నాడు. అట్టి నా నిజస్వరూపమున నాకు రూపము లేదు. నిత్యముక్తుడను, శాశ్వతుడను, శుద్ధుడను, గుణకర్మ రహితుడను.

శ్లో॥ అహమాకాశవత్సర్వం బహిరన్తర్గతోఽచ్యుతః ।
సదా సర్వ సమస్సిద్ధో నిస్సంగో నిర్మలోఽచలః ॥ 35 ॥

తా॥ ఆకాశమువలె నేను, బాహ్యమున అంతరమున కూడా వ్యాపించి యున్నాను. నాకు పరిణామ భేదములు లేవు. ఎల్లెడల, ఎల్లకాలముల నేను సమముగ శుద్ధుడనై, నిస్సంగుడనై, మలరహితుడనై అచలుడుగ నున్నాను.

నాయొక్క నిజస్వరూప వర్ణన ఇంకను సాగుచున్నది. విశాల ప్రపంచమున

గల సర్వవిషయములనెల్ల ఆకాశము వ్యాపించియున్నది. ఈ ప్రపంచము ఆద్యంతములు లేని విశాలమనబడుట కూడ మనోకల్పితముగ నున్నది. దేశ, కాల, పరిణామ రహితముగ నుండునది ఆత్మ. అట్టి ఆత్మను ఈ దేహములో ఒక అంగమున స్థావరమై యున్నదని నిర్ణయించజాలము. ఆకాశము వస్తువు లుండుట కవకాశమొసగుచున్నది. ఆకాశమున అవకాశము పొంది, అస్తిత్వము పొందు విషయములు, ఆకాశమును మలిన పరచజాలవు. అదే విధముగ, ఆత్మ, సర్వ అనాత్మ వస్తువులను తెలిసికొనుచున్నను, వాటివలన అది మలిన మగుటలేదు.

నేను సహజ స్వభావమున నిత్యుడను, శుద్ధడను, అన్నిటియందునుండు, ఏకైక దైవస్వరూపుడను నేను నిర్మలుడను. ప్రకృతిమయ కోశములతో నిర్లేపుడనై, నిస్సంగుడనై, నిరంజనుడనై యున్నాడను, సర్వవ్యాపక బ్రహ్మమే నేను.

శ్లో॥ నిత్యశుద్ధ విముక్తైకం అఖండానంద మద్వయమ్ ।
సత్యం జ్ఞాన మనన్తం యత్పరం బ్రహ్మాహమేవ తత్ ॥ 36 ॥

తా॥ సత్యం జ్ఞానం అనంతం అను లక్షణములుగల, నిత్య, శుద్ధ, ముక్త, ఏకైక, అవిభక్త అద్వితీయ పరబ్రహ్మమే నేను.

మన స్వస్వరూపము మరల మరల ఇచ్చట తెలుపబడుచున్నది. ఎందుకనగా, నిత్య నిరంతరము చింతించుచుండుటే జ్ఞానాభ్యాసము చక్కని వేదాంతుల మగుటచేత, మన నిత్య నిరంతర అనుభవమున ఈ భావములు కుదురవలెను. ధ్యానము కొఱకు ఈ శ్లోకములు బహు ఉపయోగకరముగనున్నవి. వీటిని గురించి చింతించుచుండుట, వీటిని అనుభవించుచుండుట బ్రహ్మ ఐక్యమునకు చక్కని దారి.

నిరంతరము మనసును వశపరచుకొను ప్రయత్నమువలన, ప్రకృతిమయ కోశము లొసగు అంధకార నిరుత్సాహమునుండి అడుగడుగున విరమించుకొను

వారు, పారమార్థిక శక్తియందు, శక్తి సంపన్నులగుచున్నారు. దీనివలన వారి హృదయ మందు బ్రహ్మజ్ఞాన తేజస్సు ప్రకాశించును. సత్యమును కప్పియుండు (అవిద్య) ఆవరణమును, మనసునందలి విక్షేపములు తొలగుటచే అహంకారజనిత స్వార్థ ఆలోచనలు చల్లారిపోయి, ఆత్మ ఎఱుక ప్రకాశించును. అట్టి ప్రకాశము, శుద్ధము, నిత్యము, అవిభక్తము, అట్టి పరమపదవి సత్యం, జ్ఞానం, అనంతమని తెలుపబడుచున్నది.

శ్లో॥ ఏవం నిరన్తరభ్యస్తా బ్రహ్మైవాస్మీతి వాసనా।
హరత్యవిద్యా విక్షేపాన్ రోగానివ రసాయనమ్ ॥ 37 ॥

తా॥ ఈ ప్రకారము నిరంతరాభ్యాసమువలన, అహం బ్రహ్మాస్మియను వాసనాబలము వలన అవిద్య, అవిద్య వలన కలుగు విక్షేపములు, రసాయనము వలన రోగములు తొలగునట్లు తొలగిపోవుచున్నవి.

ముందు వివరించినరీతి నిరంతర బ్రహ్మానుచింతనమువలన, తీవ్రాభ్యాసము వలన, అవిద్య తొలగుచున్నది. చక్కని ఔషధ సేవనవలన రోగనివారణ కలిగి, ఔషధముకూడ దేహమునుండి జీర్ణమయి వెడలిపోవుచున్నది.

అనేక జన్మసంస్కారముల వలన వాసనలు యేర్పడుచున్నవి. వీటినుండి తొలగుటకు, దేహమనోబుద్ధులతో తాదాత్మ్యమును తొలగించుకొనుటకు తీవ్ర నిరంతరాభ్యాసము అత్యవసరము. అందువలన సత్యాన్వేషకుడు, ఆత్మయొక్క నిర్లిప్తమును నిరంతరము తలచుచు, తనయందుగల అహంకార జీవిత దురభిప్రాయములను తొలగించుకొనవలెను.

అహంకారమువలన జీవుడు మరల మరల బంధములకు వశుడగు చున్నాడు. అహంకారమువలన అవిద్యకు వశుడగుచున్నాడు. ద్వైతభావము తొలగినచో, అహం బ్రహ్మాస్మి అను చింతనకూడ సర్వశక్తిమంతమగు ఆత్మయందు లీనముకాగా, మిగులునది ఏకైక పరమాత్మానుభవము నిత్యము, పరిపూర్ణము,

ఇట్టి అంతరంగిక స్వానుభవమే, పారమార్థిక సాధనకు ఫలసిద్ధి యగుచున్నది. ఎందుకనగా ఆత్మ, దృశ్యమగు పదార్థము కాదు. సర్వ అనుభవములను ప్రకాశింప జేయు తేజస్సు ఆత్మయై యున్నాడు.

కనుక నిరంతర జ్ఞానాభ్యాసమువలన, సర్వవాసనలను తొలగించుకొన వలెను. మనోనాశము కావలెను. మన నిజ స్వరూపము, ఆత్మానుభవము పొంద వలెను. మనము సేవించు ఔషధము, శరీరమును స్వస్థపరచి శరీరము నుండి తొలగిపోవునట్లు అహం బ్రహ్మోస్మి అను చింతనకూడా ఆత్మ ప్రకాశమున లయమై పోవును. నిద్రరానంతవఱకు నిదురించ ప్రయత్నించుచున్నాము. నిదురపోయిన వెనుక, నిదురించు ప్రయత్నములు స్వయముగ ఆగిపోవుచున్నవి.

శ్లో॥ వివిక్త దేశ ఆసీనో విరాగో విజితేంద్రియః ।

భావయే దేక మాత్మానం తమనన్త మనన్యధీః ॥ 38 ॥

తా॥ ఏకాంతమున కూర్చుని, మనసునందలి కోరికలను తొలగించి, ఇంద్రియముల వశపరచుకొని, అద్వితీయమగు ఆత్మను అనన్యచింతనతో ధ్యానించుచుండవలెను.

ఆత్మసాక్షాత్కార మొసగగల ధ్యానమార్గ మిచట వివరింపబడుచున్నది. ఎట్టి ఉపద్రవములు కలుగజాలని ఏకాంత స్థలమున కూర్చొనవలెను. మనసు నందు విక్షేపములు, బుద్ధియందు విచారములు తొలగించవలెను. సామాన్యముగ విరామకాలమున మనసునందు కలుగు ఆవేశములు, బుద్ధియందు కలుగు విచారములు నీయొక్క ఏకాంతమును నాశనము చేయుచుండును. అట్టి మనో విభ్రమములు, తీవ్రవిచారములు తొలగిపోవలెను. ఇంద్రియములు చక్కగ వశపరచుకొనవలయును. ముందు తెలిపినట్లు బ్రహ్మమందు నీ స్వభావమును ఐక్యపరచుకొనుము. దీనినే ధ్యానము అందురు. ఇది సాధ్యమగునట్లు ఏకాంతమున వేరు ఆలోచనలులేక ధ్యానించుము. అద్వితీయ ఆత్మను గూర్చి ధ్యానించుము. **అహంబ్రహ్మాస్మి, సర్వవ్యాపక, శుద్ధ, శాశ్వత, పరమాత్మ నేను, అను పవిత్రభావమును**

ధైర్యముతో, కాల పరిమితుల కతీతమగు విజ్ఞాన ఏకాంతమున, నొక్కితీర్మానము చేయుము.

శ్లో॥ ఆత్మన్యేవాఖిలం దృశ్యం ప్రవిలాప్య ధియా సుధీః ।
భావయేదేక మాత్మానం నిర్మలాకాశవత్సదా ॥ 39 ॥

తా॥ ధీమంతులు, దృశ్య ప్రపంచమునంతయు ఆత్మయందు జ్ఞానవిచక్షణచేత లయింపజేసి, ఆకాశమువలె, ఆత్మ, సదా నిర్లిప్తుడని ధ్యానము చేయుచుండవలెను.

జ్ఞానవంతమగు విచారణవలననే సాధకుడు ఆత్మాన్వేషణను, జయప్రదముగ సాగించగలడు, తాను ఆత్మానుభవము పొందిన వెనుక, అతనికి బాహ్యప్రపంచము కలదా, లేదా? లేదనిన ఎందుకు లేదు?

శుద్ధజ్ఞానము తన వివేక విచారమువలన ఆత్మానుభవము పొందింపజేయు చున్నది. అట్టి జ్ఞానప్రకాశమున, ప్రకృతి కోశములనుండి విరమించుకొని విచారించిన, జరిగిపోయిన దానికొఱకు, జరుగుచున్న దాని కొఱకు, జఱుగగల దానికొఱకు మనము చింతించ కారణము లేదు. సత్యమును విపరీతముగ దృష్టించగల పరిస్థితి మనకుండదు.

మనము స్వప్నానుభవముల సరిహద్దు దాటిన యెడల, స్వప్న ప్రపంచము తన విషయసమూహ సమేతముగ, మన మనసున లీనమై పోవుచున్నది. స్వప్న మనుభవించుచున్నవాడు ఇప్పుడు తానే జాగ్రత ననుభవించు చున్నాడని తెలియును. అదే విధముగ బాహ్యప్రపంచ విషయరాశి కనబడనపుడు, ఇంతకాలము విషయముల ప్రకాశింపజేయుచుండిన శుద్ధ ఎఱుక, తనలోనికి లీనమగుచున్నది. మనసు ఏకాగ్రత పొందినపుడు రెండవ విషయమునకు దానియందు అవకాశము లేదు. స్వప్న ప్రపంచమంతయు, స్వప్నము కనుచున్న మనసులోనికి జాగ్రత్తయందు లీనమైపోయినట్లు, ఆత్మానుభవముతో ప్రపంచ విషయానుభవములు ఉపసంహరింపబడి ఆత్మయందు లీనగుచున్నవి.

శ్లో॥ రూప వర్ణాదికం సర్వం విహాయ పరమార్థవిత్ ।
పరిపూర్ణ చిదానన్ద స్వరూపేణావ తిష్ఠతే ॥ 40 ॥

తా॥ ఆత్మానుభవము పొందిన వ్యక్తి, నామరూపాత్మక విషయముల యందు తాదాత్మ్యమును వదలివేయును, పిమ్మట అనంత జ్ఞానానంద స్వరూపముగ అతడు నివసించును. అతడు ఆత్మ (బ్రహ్మము) అగుచున్నాడు.

పరమాత్మను పొందుమార్గము, నిరంతర సత్తు, చిత్తు, ఆనంద పదవి యందుండుటకు సాధన ఏకాగ్రత ధ్యానమని ముందు తెలుపబడినది. నిరంతర ధ్యానాభ్యాసము పొందుటచే "ఆత్మవిత్" అగుచున్నాడు. అతనికి ఆత్మయొక్క సత్‌రూపమగు నామరూపాత్మక వివిధ దృశ్యములు కానరావు.

నామరూప మయమగు ప్రపంచము అధిష్ఠానమున లీనమగుచున్నది. ఆత్మ నెఱిగినవాడు పరమాత్మవిత్ అగుచున్నాడు. అతడే సత్తు, చిత్తు, ఆనంద రూపమగుచున్నాడు.

స్వప్న మనుభవించువాడు, జాగ్రతయందలి తనరూపము చూడజాలడు, తెలియజాలడు, అనుభవించజాలడు. అట్లనుభవించగలిగినచో, తానే జాగ్రత్త యందలి వాడగుచున్నాడు. అతనికి మరల స్వప్నము లేదు. అతనికి, ప్రకాశ వంతము, నిర్మలము విశాలము అగు జాగ్రదావస్థ, ఎఱుక యందున్నది.

శ్లో॥ జ్ఞాతృ జ్ఞాన జ్ఞేయ భేదః పరేనాత్మని విద్యతే ।
చిదానంధైక రూపత్వాత్ దీప్యతే స్వయమేవ తత్ ॥ 41 ॥

తా॥ పరమాత్మయందు, ద్రష్ట, దృశ్యము, దృష్టి అను భేదములు లేవు. అనంత ఆనంద స్వరూపము కనుక ఇట్లు భేదములకు ఆత్మయందు అవకాశము లేదు. ఆత్మ స్వయముగ తానొక్కడే ప్రకాశించును.

బుద్ధి తన కన్యముగ నుండు విషయములను తెలిసికొనుచున్నది. కనుక మనకుండు జ్ఞానమంతయు మనలను తప్ప, ఇతరములనెల్ల తెలిసికొనగల

జ్ఞానముగ నున్నది. అనుభవింపబడు విషయములతో అనుభవించు కర్త సంపర్కము పొందుటవలన తెలివిగల జీవితము కలుగుచున్నది. ఇందుకు, అనుభవించు కర్తకు తోడుగ, అనుభవింపబడు విషయ ప్రపంచము అత్యవసరమగుచున్నది. అనుభవించు కర్తకు అనుభవింపబడు కర్మలు పరస్పర సంబంధమగు అనుభవ మొకటి కుదురవలెను. ఇట్లు కర్త, కర్మ, క్రియ, (అనుభవము) ఈ మూడు లేక మన ప్రస్తుత ప్రపంచమున ఎట్టి బుద్ధిపూర్వక జీవితము జరుగదు.

ఆత్మ అద్వితీయము, పరిపూర్ణము, శాశ్వతము కనుక అందు కర్త, కర్మ, క్రియ అనగల భేదములకు ఆస్పదము లేదు. బహుశః సాధకుడు ప్రశ్నించ వచ్చును. "నేను ఆత్మానుభవము పొందుటెట్లు సాగును, దేహస్పర్శలు, మనో భావములు విజ్ఞాన తీర్మానములు లేక ఏ కరణములతో ఆత్మానుభవము పొంద గలను? ఇట్టి కరణములకు, ఈ కరణముల వ్యవహారరంగములకు అతీతముగ ఆత్మయుండిన "అతనిని అనుభవించు వాడెవడు. దేనిని అనుభవించగలడు?" అని సంశయము. అందుకు సమాధానము, సర్వ ఆలోచనలను, భావములను స్పర్శలను ప్రకాశింపజేయునది ఆత్మ. వీటినెల్ల నిరసించిన వెనుక ఆ ప్రకాశింప జేయు జ్ఞానమును తెలిసికొనుటకు వేరు జ్ఞానము అవసరము లేదు. ఆత్మ జ్ఞానస్వరూపము, అదియే ఎఱుక.

ఒక గదిలో నుండి సామగ్రినంత వెలుపల వేసిన వెనుక, అచ్చట యుండిన సూర్యరశ్మి గతి ఏమగుచున్నది? గదియందు సామగ్రి ఉండిన లేకుండన, ఆ రశ్మి ప్రకాశించుచునే యున్నది. సూర్యుని చూచుటకు దివిటీ యొకటి కావలెనా?

శ్లో॥ ఏవ మాత్మారణౌ ధ్యానమథనే సతతం కృతే ।
ఉదితావగతిర్ జ్వాలా సర్వాజ్ఞానేన్ధనం దహేత్ ॥ 42 ॥

తా॥ ఈ విధముగ జీవునియొక్క ఉత్తమ అంశములను చక్కగ మథనము చేయుట వలన, జ్ఞానాగ్ని ఉత్పన్నమయి, తన విశాల జ్వాలలందు అజ్ఞానమను సమిధలనెల్ల భస్మము చేయుచున్నది.

నేను ఆత్మను (బ్రహ్మము) ఈ దేహ మనోబుద్ధుల సమూహము నేను కాదు- అను చక్కని భావమును, నిరంతరము మనయందు ధ్యానమథనము చేయుటవలన పరమ పదవి చేర్చగల సహకార ఆలోచనలను ఏకాగ్రతతో సతతము అనుసంధానము చేయుచుండుటవలన అనగా, మనయందుండు, జ్ఞానాగ్నిని చక్కని విమర్శ, బాగుగా తెలియుటయను అరణులందు చిలుకుటవలన, జ్ఞానాగ్ని విశేషముగా ప్రజ్వలించును. ఆ జ్వాలలందు మనయందు పేరియుండిన అజ్ఞానము భస్మమై పోవును. ఆ జ్వాలలు గొప్పవిగ విజృంభించినపుడు, పుల్లలు (సమిధలు) అగ్నిలో మండిపోవునట్లు, మన అజ్ఞానమంతయు నాశనమగుచున్నది.

ఈ ధ్యానమథనమను విషయము కైవల్యోపనిషత్తునందు విపులముగ వర్ణింపబడి యున్నది. పూర్వకాలము యజ్ఞములు చేయుటకొఱకు కొయ్యముక్కలను మథనము చేయుటచేత అగ్నిని ఉత్పత్తిచేసి యజ్ఞమునందు వాడుకొనుచుండిరి. రెండు కొయ్యలందు రంధ్రము చేసి, వాటి రంధ్రములలో మరొక గుండ్రపు కొయ్యనుంచి మథించినపుడు, ఆ రాపిడికి అగ్నికణము లుత్పన్నమగును. అట్లు మథించుటవలన, కలుగు అగ్నిని ఇచ్చట చక్కని ఉపమానముగ తెలుపబడి యున్నది. "అహం బ్రహ్మోస్మి" యను మంత్రమును క్రింది భాగమున జీవభావము ఉపరియందు బ్రహ్మభావము, వీటిమధ్యను చక్కగ మథింపబడుట వలన, జ్ఞానాగ్ని ప్రజ్వలించును ధ్యానము దానికి వాయువు వీచును. జ్వాలలు ఉద్రేకించును. ఈ జ్వాలలందు మన అజ్ఞానపు పనులు, భ్రమలు భస్మమగుచున్నవి.

శ్లో॥ అరుణేనేవ బోధేన పూర్వం సన్తమసే హృతే ।
తత ఆవిర్భవేదాత్మా స్వయమేవాంశుమానివ ॥ 43 ॥

తా॥ చీకటిగ యుండిన రాత్రిని సూర్యోదయము కలుగుటకు పూర్వమే అరుణుడు (ఉదయభానుడు) ముందుగా తోసుకొని పోవుచున్నాడు. అదే విధముగ, ఆత్మజ్ఞానము కలుగుటకు ముందు జనించిన సమ్యక్ జ్ఞానము, మన హృదయమున పేరియుండిన అజ్ఞాన అంధకారమును ముందుగ నాశనము చేయుచున్నది.

అజ్ఞానమనగా వాసనలనబడు దట్టమైన నల్లనితెర, దైవానుభవము పొందగల సత్యమందిరము ప్రవేశించుటకు, ఈ తెరను ఛేదించి ప్రవేశించవలెను.

ఉషః కాలమున కనతికాలమునకే, సూర్యుడుదయించి ప్రపంచమునంత ప్రకాశింపజేయుచున్నాడు. అనగా అరుణుడు (ఉదయభానుడు) సూర్యాగమనమును హెచ్చరించుచున్నాడు. అంతియేకాదు, సూర్యుడు చక్కగా ప్రకాశించుచు అంధకారమును ముందుగా తొలగించుచున్నాడు. అదే విధముగ, మనము నిరంతరము విచక్షణతో బ్రహ్మచింతన చేయుచుండిన యెడల, మనయందలి అహంకార జనిత అజ్ఞానము కరిగిపోవుటేగాక, ఆత్మను ఆవరించియుండిన చీకటి తొలగిపోవుచున్నది. అట్టి అనుభవకాలమున, మన నిజస్వరూపమును మన మనుభవించుచున్నాము.

ఆత్మను దృష్టినుండి మరుగుపరచుచుండు తెలివియెల్లను మన మానసిక విక్షేపములు, అహంకార జనిత చందములు, ధ్యానమువలన మనసునందలి ఆలోచనల ప్రవాహము మందగించును. బహిర్ముఖము తొలగును, ఈ రీతిన శాంతపడిన మనసు, బాహ్య వ్యవహారముల విరమించుకొని, అంతర్ముఖమై, ఆత్మయందు దుమికి, ఆత్మతో ఏకమగుచున్నది.

శ్లో॥ ఆత్మా తు సతతం ప్రాప్తోఽప్యప్రాప్తవ దవిద్యయా ।
తన్నాశే ప్రాప్తవద్భాతి స్వకంఠాభరణం యథా ॥ 44 ॥

తా॥ ఆత్మ నిత్యనిరంతర సత్యవస్తువు. అజ్ఞానమువలన కానరాకున్నది. అజ్ఞాన నాశమువలన ప్రత్యక్షమగును. దారబోయినదని తలచబడిన కంఠాభరణము పునః ప్రాప్తినంచినట్లు.

"అజ్ఞానే నావృతం జ్ఞానం" జ్ఞానమును అజ్ఞానము మూసివేయుచున్నది. స్వప్నించువానికి, అతని జాగ్రదావస్థ అనుభవములను అతనికి ఇతరులు బోధించజాలరు. స్వప్నము పొందుచున్నవాడే, జాగ్రత ననుభవించువాడు అగు చున్నాడు. అదే విధముగ ఆత్మ పారమార్థిక అనుభవములు పొందుటకు మనము

వేరు జన్మమెత్తనవసరము లేదు. నేను సదా సచ్చిదానంద స్వరూపుడను, నేను అట్టి స్థితి ననుభవింపలేకున్నాను గదాయని లోటుతెలిసిన యెడల, తత్ నివారణకై శ్రవణము, మననము, నిధిధ్యాసనము, ధ్యానము అను సాధనలను నియమించి యున్నారు. ఈ సాధనలవల్ల నీయందు ఆత్మ క్రొత్తగ సృష్టిపొందుట లేదు. ఈ సాధనలే మరుగుపడవలెను. కారణము ముగియుటతో కార్యము కూడ ముగియ గలదు. ఏది సృష్టి పొందినదో, అది మరణించి నశించవలసి యున్నది. కనుక, నాశరహిత బ్రహ్మము, సాధనవలన సృష్టిపొందుట లేదు. బ్రహ్మము, ఆత్మ మనలో ఎల్లప్పుడు యున్నది, దానిని మరుగుపరచు పొరను, నిత్యనిరంతర సాధనల వలన తొలగించి కనుగొనుచున్నాము.

ఆత్మ సర్వకాలములలో, సర్వప్రాణులలో, సర్వ అవస్థలలో స్థిరముగ నున్నది. మనము నిద్రించినను, అతడు మేల్కొని యుండును. అయినను సత్య స్వరూప జ్ఞానములేని దోషమువలన అతనిని తెలిసికొనలేకున్నాము. వాస్తవముగ అతని ప్రకాశమున మనము నివసించగలుగుచున్నాము. అతని ప్రకాశమును తెలియలేని గుడ్డివారమై యున్నాము. అజ్ఞానము తొలగిన వెనుక, చీకటిపొర తొలగిన యెడల, కంటియందుండు పొరను ఎత్తివేసిన యెడల, ఆత్మ వైభవము ప్రకాశించును. ఎల్లప్పుడు నిత్యుడై యుండు సూర్యుడు మేఘములవలన మరుగుపడి, మేఘములు తొలగగా మరల ప్రత్యక్షమగుచున్నాడు.

ఆత్మపై కప్పియుండు తెరను తొలగించడముతో, ముందుండని ఆత్మను క్రొత్తగ మనము వెదకి తెచ్చియున్నామని తలచుచున్నాము. నిజమది కాదు, మనము దారబోసుకొనని వస్తువునకై పరితపించుచున్నాము. ఒక వస్తువును పోగొట్టుకొనక పోయినను, అది పోయినదనే భావముతో, దానిని మన యందుంచు కొనియే నష్టపరితాపము పొందుచున్నాము. ఒక్కొక్కప్పుడు తాళపు చెవిని జేబునందుంచుకొనియే అనేకచోట్ల వెదకి విసుగుజెందుచున్నాము. ఒక యిల్లాలు, తన కంఠమున యుండు హారమును రవిక మరుగుపరచు చుండుట వలన కంఠాభరణము లేదు. దారబోయెనని ఇల్లంతా వెదకి భయకాంతయాయెను.

భర్తవచ్చి రవిక మరుగున యుండు ఆభరణమును, గుర్తింపగా, తన సొత్తు మరల దొరికెనని సంతోషపడుచున్నది. అదే విధముగ, నిత్య నిరంతరము మన తోడుగ నుండు ఆత్మను మనము మరల కనుగొనుచున్నాము. ధ్యానము మొదలగు క్రమశిక్షణల వలన మన అజ్ఞానము తొలగగ, ఆత్మయొక్క పునర్దర్శనము పొందుచున్నాము. ఎల్లప్పుడు ఆత్మ మనలను విడచియుండలేదు.

శ్లో॥ స్థాణౌ పురుషవద్ భ్రాంత్యా కృతా బ్రహ్మణి జీవతా ।
జీవస్యతాత్త్వికే రూపే తస్మిన్ దృష్టే నివర్తతే ॥ 45 ॥

తా॥ ఒక స్థాణువు భూతమువలె అగుపడునట్లు, అజ్ఞానమువలన బ్రహ్మమే జీవుడుగా కనబడుచున్నాడు. జీవుడే ఆత్మ (బ్రహ్మము) అని తెలియగా అహంకార జనిత వ్యక్తిభావము నాశనమగుచున్నది.

భ్రమవలన స్థాణువును భూతమని తలచుచున్నాము. స్థాణువుయొక్క సమ్యక్ జ్ఞానములేని దోషమువలన భూతమను భ్రమాజ్ఞానము కలుగుచున్నది. అదే విధముగ సర్వాధిష్ఠాన బ్రహ్మమున, పరమాత్మ యందు, మన అజ్ఞానము అహంకార జనిత వ్యక్తిభావము, వివిధరూప ప్రంచమున ఆరోపించబడి యున్నది. ఇట్టి భ్రమా అవస్థయందు, మనము స్వయముగ బంధములను కల్పించుకొని, ఈ శరీర మనోబుద్ధులతో తాదాత్మ్యము పొందుచున్నాము. మన అజ్ఞానము వలన స్వయముగ సృష్టించుకొనిన వలయందు మనము చిక్కుకొని యున్నాము. ఈ వివిధరూప ప్రపంచమున కధిష్ఠానముగ నుండు స్థాణువును కొనుగొనిన యెడల, మనయందలి ఆత్మను మనము అనుభవించగలిగిన వెనుక, ఒక స్వప్నము, స్వప్నించువానియందు లీనమగునట్లు, మనము సృష్టించిన ఈ విభ్రాంతి కలిగించు దృశ్యములెల్ల తన సత్యభాసమును కోల్పోవుచున్నవి.

స్థాణువును పరికింపలేని దోషమువలన, తల, ఒళ్ళు, కాళ్ళు, చేతులు, కండ్లు, అలంకారము, వ్యవహారములన్నియు ప్రత్యక్షముగ నున్నట్లు కనబడుచున్నవి. కారణ నాశనముతో కార్యనాశనము కూడ కలుగుచున్నది. అహంకార భావము

ముగియగా, దాని కార్యములెల్ల తొలగిపోవుచున్నవి. పిమ్మట బాధింపగల బంధములు తొలగిపోవుచున్నది.

శ్లో॥ తత్త్వ స్వరూపానుభవాత్ ఉత్పన్నం జ్ఞానమంజసా ।
అహం మమేతి చాజ్ఞానం బాధతే దిగ్భ్రమాదివత్ ॥ 46 ॥

తా॥ చక్కని మార్గదర్శనమువలన, బాటసారికిగల దిగ్భ్రమ తొలగిపోవునట్లు, ఆత్మయొక్క సత్యస్వరూపమును తెలిసికొనుటవలన కలుగు సమ్యక్ జ్ఞానము వలన, నేను, నాదియను అజ్ఞానభావములెల్ల నశించుచున్నవి.

ఆత్మజ్ఞానము వలన, ఆత్మానుభవము వలన, వ్యక్తియందుండిన అజ్ఞాన జనిత అహంకార భావములెల్ల తక్షణము నశించుచున్నవి. పరిచ్ఛిన్నము, మలినము, వక్రము అగు నేను, నాది అను అనుభవములు అజ్ఞాన జనితములు, వీటివలన పరిచ్ఛిన్న వ్యక్తిభావము కలిగియుండెను.

ఒక క్రొత్త దేశమునకు వెళ్ళినప్పుడు, దిక్కులు తెలియక రాత్రియంతయు వెదకుచుండినను, సూర్యోదయముతో, తూర్పు, పడమరను నిర్ణయించునట్లు ఆత్మ జ్ఞానము కలిగిన వెంటనే విషయపూరిత శరీరబంధములతో, స్పర్శలు, భావములు, ఆలోచనలతో మునిగి తప్పించుకొన వెదకుచుండిన ప్రయాసలెల్ల తీరిపోవుచున్నవి.

మనము గుర్తించిన, గుర్తించకపోయినను, దిక్కులు చలించక వాటి స్థాన మందున్నవి. భ్రమయుండు నంతకాలము, తూర్పువైపు పోవలెనని తలచి, పడమట వైపు పోవుచుందుము. చక్కగా విమర్శించిన, సూటియగు దారి దొరుకును. అదే విధముగా, ఆత్మజ్ఞానము కలిగిన యెడల, ప్రపంచమున మనకుగల సంబంధము చక్కగ బోధపడగలదు.

శ్లో॥ సమ్యక్ విజ్ఞానవాన్ యోగీ స్వాత్మన్యేవాఖిలం జగత్ ।
ఏకం చ సర్వమాత్మానం ఈక్షతే జ్ఞానచక్షుషా ॥ 47 ॥

తా॥ పరిపూర్ణ ఆత్మజ్ఞానము పొందిన జ్ఞానపురుషుడు, యోగి తన జ్ఞాన నేత్రమువలన, బ్రహ్మాండమంతయు తన ఆత్మగ తెలియును. ప్రతి యొక్కటి తన ఆత్మయనియు, అన్యముగ ఏమీ లేదనియు తెలియుచున్నాడు.

సత్యమగు బ్రహ్మమును ఎఱిగిన యోగి పరిపూర్ణ ఆత్మజ్ఞాన సంపన్నుడగుటచే, తన మనసును చక్కగ సంస్కరించినవాడై, ప్రతిచోట తన ఆత్మనే చూచును. అట్టి మహాత్ముడు తన హీనగుణములనెల్ల తొలగించుకొని, పరమార్థమున శాంతముగ జీవించగలుగును. అతని మనోబుద్ధులు చక్కగ శిక్షణ పొంది, నియమింపబడి యుండుటచేత, అవి అతనిని ప్రపంచముపై లాగుట లేదు. అట్టి మహాత్ముడు జగత్తంతయు "ఆత్మమయం", "బ్రహ్మమయం" అని చూచును. అతని యందుండు ఆత్మయే ప్రతిచోట అనుభవించుచుండును. తన యందనుభవముల ప్రకాశింప జేయు ఆత్మయే, ప్రపంచమున కంతయు ప్రాణాధార శక్తియని తెలియుచున్నాడు. జ్ఞాననేత్రములు వికసించుటతోడనే, తనయందు తన వెలుపల ఇచ్చట ఎచ్చటెచ్చట పరమాత్మ నొక్కడినే అతడు చూడగలడు. బంగారమును తెలియగలగిన యెడల నగలన్నియు ఏకమని తెలియగలదు. ఇదివరకు తాను జీవాత్మయని బంధించి యుండిన అహంకారము నాశనము కాగ, ఆత్మజ్ఞాన ప్రకాశము వ్యాపించుచున్నది. జీవితము సార్థకమగుచున్నది. నిజతత్త్వము వెల్లడియగుచున్నది. అతనియందుండు సత్యము, బ్రహ్మము అనుభవింపబడుచున్నది. అతడు పరిపూర్ణ కృతార్థుడగు చున్నాడు.

శ్లో॥ ఆత్మైవేదం జగత్సర్వం ఆత్మనోఽన్యన్న విద్యతే ।
మృదో యద్వద్ఘటాదీని స్వాత్మానం సర్వమీక్షతే ॥ 48 ॥

తా॥ ఆత్మయొకటే కలదు. ఆత్మ కతిరిక్తముగ మరొకటి లేదు. దృశ్య ప్రపంచ మంతయు ఆత్మయే. కుండలు, తొట్లు, ముంతలు అన్నియు మన్నే. మన్ను లేక ఇవి లేవు. అదే విధముగ ఆత్మజ్ఞానము నందుండు వారికి దృశ్యమంతయు ఆత్మ స్వరూపము.

పరమాత్మ కన్యముగ మరేదియు లేదు. విషయ ప్రపంచమంతయు ఆత్మ విభూతియని ముందు తెలుపబడెను. "ఆత్మ ఏవ జగత్సర్వం" అని ఎట్లు నమ్మ గలము?

మన్నునుండి అనేక కుండలు, తొట్లు, మూకుడులు చేయబడి యున్నవి. అవి మన్నునుండి యుత్పత్తి పొంది, మన్నుయందు అస్తిత్వము పొంది, కడకు మన్నులో కలిసిపోయి, మన్నే అగుచున్నవి. మన్ను లేక ఇన్ని రూపములు కలుగుట లేదు. మొదలు మన్నుగా నున్న ముద్దయే వివిధ ఘటరూపములను కలుగజేసెను. మన్ను లేకుండా కుండలు, తొట్లు, మూకుడులు ఉండజాలవు. సముద్రము లేకుండా వివిధ తరంగములుండజాలవు. అదే విధముగ ఆత్మ యునికి నుండి నామ రూపాత్మక జగత్తు చైతన్య వ్యవహారములు కలిగెను. ఆత్మజ్ఞానులకీ విషయము గోచరమగుచున్నది. సామాన్య మానవులకు నామరూపముల సౌందర్యమును వెదకుటే రుచికర వ్యవహారముగ నుండును. ఆద్యంత రహిత జగత్తు ఆద్యంత రహిత ఆత్మనుండి ఉత్పత్తి పొంది బ్రహ్మాండమునంతయు ఆక్రమించి యున్నది. వివిధ రూపభేదములు నిత్యనిరంతర బ్రహ్మమందు ఆరోపితమై యున్నవి.

శ్లో॥ జీవన్ముక్తస్తు తద్విద్యాత్ పూర్వోపాధి గుణాంస్త్యజేత్ ।
సచ్చిదానంద రూపత్వాత్ భవేత్ భ్రమర కీటవత్ ॥ 49 ॥

తా॥ ముక్తపురుషుడు, ఆత్మజ్ఞాన సమన్వితుడు తనకు పూర్వముండిన ఉపాధుల గుణములను సచ్చిదానంద లక్షణముల బలముచేత వదలి, కీటకము భ్రమరమగు రీతి, ఆతనే బ్రహ్మమగుచున్నాడు.

ప్రపంచమున జీవించుచుండగనే, తన అస్తిత్వము ఆద్యంతరహిత ఆత్మయని యెరిగిన వ్యక్తి జీవన్ముక్తుడనబడును. అతడు ఆత్మసాక్షాత్కారము వలన శరీరముతో జీవించుచుండగనే తన అవిద్యనుండి దూరుడై ప్రారబ్ధానుసారము జీవించు చుండును. అతడు చక్కని క్రమశిక్షణ, నియమముల వలన తన శారీరక, మానసిక, వైజ్ఞానిక కర్మలందు, ప్రకృతి కోశముల గుణములు, అహంకార వ్యవహారములు

తొలగించుకొని, పరిపూర్ణ పరమార్థ జీవితము గలవాడగుచున్నాడు. అతడొకడే జ్ఞానియని చెప్పనగును. అతడొకడే అహంకార నాశము పొందిన వాడగుచున్నాడు.

అట్టి జీవన్ముక్తుడు, పారమార్థిక జీవఘనుడు. తన అనుభవమునందెట్టి చలనములేక, ఎట్టి వికారములకు లొంగక, తన దైవిక ఆత్మపదమున నివసించు చుండును. అతనిని స్థూల, సూక్ష్మ, కారణ శరీర ఉపాధులు బంధింపజాలవు. అతడు తన సాధనకాల పర్యంతము ఏ బ్రహ్మమును గూర్చి చింతించుచుండెనో, కీటకము భ్రమరమును చింతించుచు కడకు భ్రమరమగునట్లు, ఆ బ్రహ్మమే తానగుచున్నాడు.

కనుక భ్రమరము మట్టితో చిన్నగూడు కట్టి దానికొక రంధ్రమేర్పచి ఒక కీటకమును తెచ్చి ఆ రంధ్రము ద్వారా గూడులో నుంచి భద్రపరచును. దినమున కనేకమార్పులు భ్రమరమువచ్చి కీటకమును పొడుచుండును. ఆ పొడుపులను కీటకము భరించలేక భ్రమరము మరల ఎప్పుడు రాగలదాయని సదా భ్రమరమునే చింతించుచు, కడకు భ్రమర రూపమును పొంది ఎగిరిపోవుచున్నది. అదేవిధముగ ప్రకృతిమయకోశముల నిరసనము వలన నిరంతర ఆత్మ చింతనవలన దీర్ఘకాలము ఆత్మవైభవము చింతించుటవలన అతనియందలి అహంకార పరిచ్ఛిన్న వ్యక్తిభావము తొలగిపోయి, సర్వచైతన్య ఆత్మయగుచున్నాడు.

శ్లో॥ తీర్త్వా మోహార్ణవం హత్వా రాగద్వేషాది రాక్షసాన్ ।
యోగీ శాన్తి సమాయుక్తః ఆత్మారామో విరాజతే ॥ 50 ॥

తా॥ రాగద్వేషములను రాక్షసులను జంపి, మోహమనబడు అజ్ఞాన సముద్రమును దాటగలిగిన యోగి, తన ప్రశాంత జీవితమున ఆత్మారాముడై విరాజిల్లుచుండును.

పరిపూర్ణ పరివర్తనము పొందిన అహంకార జీవుడు తన శుద్ధస్వరూపము శాశ్వత బ్రహ్మమని తెలియుటవలన అజ్ఞానస్వరూప మోహసముద్రమును దాట గలుగుచున్నాడు. గడచిన జీవితానుభవములలో పేరుకొనుచు వచ్చిన మానసిక

వాసనలు అజ్ఞాన మోహసముద్ర మగుచున్నది. ధ్యానమువలన తన ఆత్మ వైభవమును పొందగలిగిన యోగి సత్యమును మరుగుపరచు మోహములను రచించుచున్నాడు. కనుక అతని అజ్ఞానము నివర్తియగుచున్నది.

ఇందుకు, రాగద్వేషములను రాక్షసగుణములు, సాధకుని అంతరంగము నుండి నాశనమయి తొలగిపోవలెను.

అజ్ఞానమోహ సముద్రమునుదాటి, రాగద్వేషములనబడు రాక్షసులను దుర్గుణముల నిర్మూలించ గలిగిన సాధకుడు ఆత్మసామ్రాజ్యము ప్రవేశించి, తాను తాత్కాలికముగ కోలుపోయిన శాంతమును మరల పొందుచున్నాడు. ఆత్మ యొక్క స్వభావము శాంతం, శివం, సుందరం అట్టి ఆత్మానుభవం శాశ్వతమైనది. కనుక అట్టియోగి అవిచ్ఛిన్న అనంతశాంతము, ఆనందము ననుభవించుచుండును. అతడు ఆత్మారాముడై విరాజిల్లుచుండును.

ఆత్మారాముడు– ఈ సందిగ్ధ పదము కవిత్వముతో కూడినదేగాక, హిందూ మత ఉపనిషత్తులు, పురాణములు చదువువారికి మిక్కిలి భావార్థము కలిగియున్నది. హిందూమత పరంపరకు యజమానుడగు శంకరులు, ఈ ఒక్క శ్లోకమున రామాయణ భావమంతయు ఇమిడ్చియున్నాడు. వాల్మీకి, రామాయణము వ్రాయుటయందు ఆదర్శపురుషుడు వివిధ జీవిత పరిస్థితులలో ఎట్లు వ్యవహరించ గలడో పాఠకులకు తెలుపుటేగాక, తన స్వానుభవ ఆత్మజ్ఞానమును కూడ ప్రకటించియున్నాడు. వాల్మీకి కేవలం గ్రంథముల ప్రచురించిన కవియని తలచ కూడదు. అతడు ముఖ్యముగ ఆత్మజ్ఞాని, శ్రుతుల రక్షకుడు, రామాయణమున వర్ణింపబడిన వ్యక్తి సౌందర్యముల వలన ముగ్ధులై, సామాన్య పాఠకులు రామాయణము యొక్క ఆదర్శము, ప్రాముఖ్యత గమనించలేకున్నారు. సంపూర్ణ రామాయణమునందలి ముఖ్యోద్దేశమును శంకరులీ శ్లోకమున సూచించుచున్నాడు.

ఈ గొప్ప ఆదికావ్యమగు రామాయణము యొక్క ముఖ్యనాయకుని నామమందు గొప్ప భావార్థమున్నది. రాముడనగా, “సర్వహృదయములలో

రమించు వాడని" అర్థం. రాముడు, తన శాంత స్వరూపమగు సీతను వివాహమాడి యుండెను. అయోధ్యారాజ్యముననేమి, అడవులందేమి, తన శాంతమునకు భంగములేక ఆనందముగ జీవించుచుండెను. తన అర్ధాంగియగు శాంతము దశముఖ రావణు డగు, ఇంద్రియవాంఛలకు వశమై లొంగగా, అతని దుఃఖములు ప్రారంభ మాయెను. ఈ వాంఛలు, మానవుని యందుండు నీచకోరికలు, వీటికి పది శిరస్సులున్నవి. అవియే జ్ఞానేంద్రియములైదు, కర్మేంద్రియములైదు. సనాతన ధర్మభూమియగు ఆర్యావర్తనమున, అనాత్మవాదులకు ఐహిక సుఖాభిలాషులకు అవకాశములేదు, ఇది పారమార్థిక ఉద్యానవనము, రామరాజ్యమందు రావణులు రాజ్య పరిపాలకులుగ నుండజాలరు.

రాముడు తన అర్ధాంగిని వెదుకుచు, సముద్రమును దాటి లంకను ప్రవేశించి, రాక్షస బలమును సంహరించి, తాను కోలుపోయిన శాంతమనబడు సీతను మరల దర్శింపగలిగెను. ఇచ్చట దాటవలసిన సముద్రము మోహబంధములతో కూడిన అజ్ఞాన భావము. ఇవన్నియు రాముని తిరస్కరించుచు ఎదుట నిలచి యున్నవి. ఇవియే భ్రమజెందిన మనసునందుండు దుర్గుణములు. వ్యక్తియొక్క అంతరంగము శుద్ధమై, వాసయోగ్యము పొందినచో, ఆత్మయొక్క అర్ధాంగియగు శాంతము మరల ప్రాప్తించుచున్నది. అటుపిమ్మట అట్టి ఆత్మజ్ఞాని అయోధ్య (శత్రువులు జొరబడలేని)యను తన రాజధానిని, జీవిత సామ్రాజ్యమును సుఖముగ పరిపాలించుచుండును.

ఒక పురాణమునంతయు సంగ్రహించి కొన్ని క్లుప్తపదములతో సూచింప గలుగుట, అందలి అత్యున్నత సత్యమును చక్కగ వర్ణించగలుగుట, మేధావియగు శంకరులకే తగును.

శ్లో॥ బాహ్యానిత్య సుఖాసక్తిం హిత్వాఽత్మ సుఖనిర్వృతః ।
ఘటస్థ దీపవత్స్వస్థ స్వాన్తరేవ ప్రకాశతే ॥ 51 ॥

తా॥ బాహ్యమున తోచు భ్రమతో కూడిన అనిత్య సుఖములను త్యజించి, ఆత్మ

సుఖమందే నిలచినవాడై, ఆత్మ సుఖముననే తృప్తి పొందుచు, కుండ మరుగున ప్రకాశించు దీపమువలె ఆత్మజ్ఞాని ప్రకాశించుచుండును.

ప్రతిసాధకుడు కోరునది సర్వదుఃఖనివృత్తి, పరిపూర్ణ సుఖప్రాప్తి దేహ మనో బుద్ధులందుండు, తాదాత్మ్యములను పూర్ణముగ ఉపసంహరింపగలిగిన వ్యక్తి, ఆత్మజ్ఞాని యనబడును. అతడు ఈ మూడిటి ఆవరణము లందుండు విషయములను గమనించుట లేదు. ఇంద్రియ విషయములు, మనోభావములు, విజ్ఞాన తీర్మానములు అతనికి లేవు. ఆత్మ ఆత్మయందు ఆత్మనే ప్రకాశింపజేయు చున్నది. అయినను ఒక మహాప్రకాశమున, ప్రకాశింపజేయగల విషయమొకటియు లేని యెడల, దానియొక్క అనంత వైభవమెట్లు ప్రకాశింపగలదు? అను సంశయము, వేదాంత పాఠకునికి, తన ప్రథమసాధన కాలమున పరిచ్ఛిన్న జ్ఞానవిచారమున కలుగుచున్నది.

శుద్ధజ్ఞాన ఎఱుక, ఆత్మ తప్పవేరు విషయ సంపర్కము లేక ప్రకాశింప గలుగుటను, శంకరులు ఉపమాన సహితముగ ఇచ్చట రమ్యముగ వర్ణించి యున్నాడు. ఒక దీపమును బల్లపై నుంచిన యెడల, చుట్టుప్రక్కల నుండి విషయ రాశిని, ప్రకాశ తారతమ్యములతో ఆ దీపము ప్రకాశింపజేయుచున్నది. ఆ దీపమును మెల్లగ ఒక పాత్రయందు దించిన యెడల, అది పాత్రలో భాగమును మాత్రము ప్రకాశింపజేయు చుండును. అదే విధముగ, ఆత్మ ఎరుక విషయరాశిపై ప్రకాశించినపుడు విషయములు గోచరమగుచుండును. కాని ఆ ఎఱుక ఆత్మలోనికి ఉపసంహరింపగా, విషయములు లేని, తనను తాను ప్రకాశింప జేసుకొను చుండును.

ఇట్టి ధ్యానావస్థయందు, "ఆత్మ తన అంతరమున ప్రకాశించుచుండు" అని ఈ శ్లోకంలో తెలుపబడియున్నది. అంతరమున అనగా లోభాగము మాత్రము అని అర్థము చేయకూడదు. ఇచ్చట అంతరమున అను పదము వేదాంత పరిభాషలో ఉపయోగింపబడి యున్నది. వేదాంతమున, ఒక విషయము సూక్ష్మము అనగా

దాని వ్యాపకశక్తిని తెలుపుచున్నది. స్థూలమునకు సూక్ష్మము అంతరమున యున్నది. అని వేదాంత భావము. కనుక అన్నిటికి అంతరమున అతి సూక్ష్మమయినది ఆత్మ. అనగా ఆత్మ సర్వవ్యాపకము, ఆత్మను వ్యాపించునదేదియు లేదు. ఆత్మానుభవ కాలమున, ఆత్మ తన అంతరమును ప్రకాశింపజేయుచున్నది. అనగా, దాని భావార్థము, అట్టి అనుభవము, సర్వవ్యాపకము, ఆద్యంత రహితము, సూక్ష్మాతి సూక్ష్మము, ప్రకాశము, సర్వప్రకాశము, శుద్ధమగు ఎఱుకయని భావము తెలియు చున్నది.

శ్లో॥ ఉపాధిస్థోఽపి తద్ధర్మైః అలిప్తోవ్యోమవన్మునిః ।
సర్వవిన్మూఢవత్తిష్ఠేత్ అసక్తో వాయువచ్చరేత్ ॥ 52 ॥

తా॥ ఉపాధులతో కూడి యుండినను ఆకాశమువలె, వాటి ధర్మములు తనకంటక, సర్వజ్ఞుడైనను, మూఢునివలె ప్రవర్తించుచు, ఆసక్తి లేకున్నను వాయువువలె ప్రారబ్ధానుసారము ముని చరించుచుండును.

జీవన్ముక్తుని స్థితి ఇచ్చట వర్ణింపబడుచున్నది. పూర్ణజ్ఞాని పరిమితిగల విషయముల యెడ అనురాగము వదలియున్నాడు. మనసునకు ఏదోయొక్క వస్తువును (ఏనుగు తొండమువలె) పట్టుకొని యుండుటే స్వభావము. కనుక విషయములను వదలిన అది దేనిని పట్టుకొనవలెను? తనయందలి ఆనందమునే అది పట్టుకొనవలెను. కాని ఒక్కొక్కప్పుడు, ముని ప్రపంచ విషయములతో మెలగవలసి యుండును, బాహ్యవిషయముల నతడు చూచి తెలిసికొనుచుండినను వాటివలన అతడు బద్ధుడగుట లేదు, ఇట్టి ఉపాధుల నుండి అతడు దూరగుడై యున్నాడు. అతడు జ్ఞానస్వరూపుడై చరించుచున్నాడు. అట్టి జ్ఞానప్రకాశమున పరిమితుల బంధములతని యెడ నిస్సారమగుచున్నవి. అతడు ఉన్మాదునివలె, బాలునివలె, త్రాగుబోతువలె నటించినను, ఈ గుణము లతనికి లేవు. అతడు ఆత్మానంద మధురసము గ్రోలుచు, ఆత్మ సాక్షాత్కారమత్తుడై యున్నాడు. అతడు సంఘసేవ చేయవచ్చును. అతడు ఎట్టి పరిస్థితియందు సంపర్కము పొందినను,

దానివలన ఎట్టి పర్యవసానము పొందక, నిర్లిప్తుడై దాని ఫలభోక్తగాక, తొలగిపో గలుగుచున్నాడు. అతడు గీతయందు విపులముగ వర్ణింపబడిన స్థితప్రజ్ఞు డనబడును.

ఆకాశము నీలముగ, ధూమ్రవర్ణముగ నున్నను ఆకాశమునకు వర్ణమంటుట లేదు. అదే విధముగ జీవన్ముక్తుడు ఉపాధులతో కూడి యున్నను, సామాన్య మానవునివలె చరించుచుండినను, ఎట్టి అనురాగము లేక వ్యవహరించును, ఎట్టి బంధములు లేక తొలగిపోవుచున్నాడు.

శ్లో॥ ఉపాధిలయా ద్విష్ణౌ నిర్విశేషం విశేన్మునిః ।
జలేజలం వియద్వ్యోమ్ని తేజస్తేజసి వా యథా ॥ 53 ॥

తా॥ ధ్యాననిష్ఠా గరిష్ఠుడైన మునియొక్క ఉపాధులు నష్టమవుటతో, అతడు విష్ణువు నందు సర్వవ్యాపక ఆత్మయందు, జలము జలమున, ఆకాశము ఆకాశమున, తేజస్సు తేజస్సున కలియునట్లు ఏకమైపోవును.

శరీరమనోబుద్ధులతో తాదాత్మ్యము కలిగించుకొనుటయే ఉపాధియగు చున్నది. ఈ మూడిటి ఉపాధులవలన అనేక ఇతర బంధము లేర్పడుచున్నవి. ఉపాధుల నాశనమొనరించ గోరు సాధకుడు ఉపాధిని తొలగించి, తన పూర్ణ స్వరూపము తెలిసికొనవలెను. ఇందు మనసునుండి వివశుడగుటయే మొదటి ఉపాధిని గెలుచుట యగును. నాకుగల వ్యక్తి భావము తొలగిన యెడల, ఆత్మ ప్రతిబింబమగు అహంకాము తొలగుచున్నది. పిమ్మట నీరులో నీరు కలసిపోవునట్లు ఆకాశము ఆకాశములో, తేజస్సు తేజస్సున కలిసిపోవునట్లు, ఆ జీవుడు సర్వవ్యాపక విష్ణువునందు లీనమగుచున్నాడు. నా పరిచ్ఛిన్న ఉనికి పరిపూర్ణము కాగా నేను ఆ సర్వవ్యాపకుడ నగుచున్నాను. అద్దముపైన మురికి తొలగిపోయిన, ప్రతిబింబము శుభ్రముగ ప్రకాశవంతముగ కనబడును.

ఉపాధులు తొలగుటవలన, మననశీలుడగు ముని, తన అంతరమున

నిర్మల, నిర్విశేష ఆనందము ననుభవించును. ఆత్మయొక్క సర్వవ్యాపకత్వము, తెలిసిన వెనుక, ఆ ఆత్మయే విష్ణువని తెలిసి, అతనితో ఐక్యభావము పొంది, వ్యక్తిభావము తొలగిపోవుచున్నది.

శ్లో॥ యల్లాభాన్నాపరో లాభో యత్సుఖాన్నాపరం సుఖమ్ ।
యజ్ఞానాన్నాపరం జ్ఞానం తద్బ్రహ్మేత్యవధారయేత్ ॥ 54 ॥

తా॥ దేనిని పొందిన, మరల పొందదగిన దేదియు యుండదో, ఏ లాభము పొందిన పొందదగు లాభము వేరుయుండదో, ఏది తెలిసిన, మరల వేరు తెలియదగిన దేదీ యుండదో అది బ్రహ్మమని తెలియవలెను.

54 నుండి 56 వరకు గల శ్లోకములలో, వేదాంత పరిభాషయందు, భేద సూచక అభేదమును తెలుపు తటస్థలక్షణ న్యాయసూత్రమున పరబ్రహ్మము తెలుపబడుచున్నది. కాకి కూర్చుని యుండు గృహము శ్రీ ప్రకాశ్‌గారిది. అనగా కాకి గృహమునకు అంగము కాదు. శాశ్వతముగ నుండు ఉపాంగము కాదు. కాకి కూర్చుని యుండినదనుటవలన, కాకి లేని ఇతర గృహములను నిషేధించుట యగుచున్నది. పిమ్మట కాకి లేకున్నను ఆ గృహమును గుర్తించనగుచున్నది. ఇది తటస్థలక్షణ మనబడును.

ఆత్మానుభవము ఉత్తమ లాభమనియు, ఉన్నత జ్ఞానమనియు ఇచ్చట తెలుపబడుచున్నది. అది పొందిన వెనుక లోపములు కనబడవు. వేరు లాభములు పొందు ఇచ్ఛయుండదు. ఆత్మానంద మనుభవించిన వెనుక, ఆనంద మొకటి కోరదగినది యుండదు. అది తెలిసిన వెనుక, తెలియదగిన విషయ మేమియు యుండదు. అట్టి పరిపూర్ణ లాభము, ఆనందము, జ్ఞానము, బ్రహ్మానుభవము బ్రహ్మమై యున్నది.

లోటుగలదను అసంతృప్తి వలన, క్రొత్త లాభములను నూతన ఆనందములను, అధిక జ్ఞానమును కోరబడును. అపరిపూర్ణత లోటులెల్ల, మన యందలి జీవుని సొత్తు. జీవుడు తాను ఆత్మయని కనుగొనిన వెనుక, తాను ప్రారబ్ధవశమున

పొందిన బంధములెల్ల, శరీరమనోబుద్ధుల ఉపాధి గుణములని తెలిసి, తన నిజ ఆత్మస్వరూప మనుభవించును. అతని భ్రమలెల్ల తొలగిపోవుచున్నవి.

అనంత పరిపూర్ణ జీవితానంద మనుభవించుటే పరమాత్మ పదవి.

శ్లో॥ యద్దృష్ట్వా నాపరం దృశ్యం యద్భూత్వా న పునర్భవః ।
యద్జ్ఞాత్వా నాపరం జ్ఞేయం తద్బ్రహ్మేత్యవధారయేత్ ॥ 55 ॥

తా॥ ఏది చూచిన మరి చూడదగినది వేరుండదో, ఏది పొందిన మరల ప్రపంచమున జననముండదో, ఏది తెలిసిన మరి తెలియదగినది ఉండదో అది బ్రహ్మమని తెలియవలెను.

అట్టి పరిపూర్ణ నిర్మల శాంతస్థితియందు, అంతకన్న గొప్పపదవి కావలెనను కోరిక పుట్టదు. మనలో ఏ కొద్ది కోరిక కనబడినను, పరిపూర్ణ పదవి పొందలేదని తెలియవలెను. ఆ పరమాత్మానందానుభవమే ఉత్తమ పదవి. అందు ఆలోచనలు కలుగజాలవు. మన అహంకార భావము మిగిలియుండును. అట్టి పరిపూర్ణా నందమున, మనో బుద్ధుల వ్యవహారములుడిగి పోవుచున్నవి. ఆత్మ దివ్య వైభవముతో ప్రకాశించును.

మిగతా చేయగల ప్రయత్నములెల్ల ఆత్మ ప్రతిబింబమును వెదకుటయగు చున్నది. ఆత్మవిద్యవల్ల ఆత్మజ్ఞానమును కలుగుచున్నది. ఇతర విషయముల తెలియు జ్ఞానమువలె శాశ్వత ఆత్మజ్ఞానము వలన తేజస్సును పొంది వెలుపల సాగుచున్నవి, శుద్ధమగు ఆత్మ ఎఱుక కలిగిన వెనుక ఎఱుగవలసినది మిగిలి యుండదు. కర్తయగు నిత్య బ్రహ్మముగ నుండి, వేరు వస్తువును ప్రకాశింపజేయ వలెనను ప్రయత్నముండదు. ఆత్మ ఎఱుకవలన సర్వ అవిద్య కార్యములు తొలగుచున్నవి. అవిద్య నాశనము వలన బంధబీజములు భస్మమగు చున్నవి.

శ్లో॥ తిర్యగూర్ధ్వ మధః పూర్ణం సచ్చిదానన్ద మద్వయమ్ ।
అనన్తం నిత్యమేకం యత్ తద్బ్రహ్మేత్యవధారయేత్ ॥ 56 ॥

తా॥ పరిపూర్ణ సత్తు, చిత్తు, ఆనందమేదియో ఏది అద్వితీయమో, ఆద్యంత రహితమో, శాశ్వతమో అన్ని దిక్కులను పైన క్రింద వీటిమధ్య ఏది వ్యాపించి ఉన్నదో అది బ్రహ్మమని తెలియుము.

తూర్పు, పడమర యను దిక్కులెల్ల, పైన క్రింద ప్రతిచోట ఆ నిత్యచైతన్యము వ్యాపించి యున్నది. నేను ఆ ఎఱుక యందుండి, అనుభవించుచుండిన యెడల ఈ బాహ్యప్రపంచము నాకు వేద్యమగుటలేదు. ఈ శరీర మనోబుద్ధులతో తెలియు ప్రపంచము మరుగుపడుచున్నది. ఉండునదెల్ల ఆ పరమాత్మ దానికి ముందు వెనుక, పైన క్రింద అనుభవ పరిష్కార మెక్కడిది? ఆ భావముల నేనెక్కడ చూడ గలను. దాని ముందుభాగమున చూడవలెననగా దేనికి ముందు? ఉండునదెల్ల నదియే ఒక పరిచ్ఛిన్న వస్తువునకే ముందువెనుక లుండును. కనుక అది అంతములేని అద్వితీయ పరిపూర్ణము ఆనంద మొకటియే యుండునది. వ్యక్తి యందుండు మనసు వలన బాహ్యదృష్టి కలిగి భ్రమలేర్పడి అసత్యభావములు కలుగుచున్నవి.

మనయందుండు సచ్చిదానంద పరమాత్మ యొకటియే యుండుట వలన, వేరు అనుభవమునకు ఆస్కారము లేదు. ఈ అనుభవము వర్ణింపనలవి కాదు, వాక్కు లోపించుచున్నది. అది వాక్కుతో పలుకుట వలన పరిచ్ఛిన్నము అగుచున్నది, ఆ తేజసు శాశ్వతముగ మనయందు మనము తిరుగుచోటులలోనెల్ల కలదు. ఆ తేజస్సులో ఐక్యమగుటయే ఆత్మానుభవస్థితి యగుచున్నది.

శ్లో॥ అత ద్వ్యావృత్తి రూపేణ వేదాంతై ర్లక్ష్యతేఽద్వయమ్ ।

అఖండానందమేకం యత్ తద్బ్రహ్మేతయవధారయేత్ ॥ 57 ॥

తా॥ ఏది అద్వితీయమో ఏది విభజింపసాధ్యము కాదో, ఏకమో ఆనంద స్వరూపమో వేదాంతమున ఏది కూటస్థ అధిష్ఠానమని తెలుపబడియున్నదో, అన్ని దృశ్యములను నిరసించుటవలన ఏది గోచరమగుచున్నదో అది బ్రహ్మమని తెలిసికొనుము.

ముందు తెలిపిన నిరసన పద్ధతిని ఇచ్చట మరల జ్ఞప్తి చేయుచున్నారు. సర్వవ్యాపక బ్రహ్మమును సూటిగ ఎవరును వెళ్ళి చేరలేరు. అతడు దృశ్యవస్తువు కాదు. అతడే నిత్యకర్త, అన్ని ఆలోచనల, కర్మల ప్రకాశింపజేయునది అతడే. అతడు అద్వితీయుడు. అతనికి సాటి వేరు లేదు. అతడు కానిది వేరులేదు. ఇట్లు నిరసింప సాధ్యము కాని ఆత్మ నిర్వీర్య శూన్యము కాదు. అనంత స్వరూపము, అనాత్మ వస్తువుల నిరసించుటవలన, అనన్య వస్తువును సమర్థించుట వలన ఆత్మ తెలియనగునని ఉపనిషత్తులు తెలుపుచున్నవి. అస్తిత్వములకెల్ల అతడే అధిష్ఠానము.

మన మనసు పరిచ్ఛిన్నము కాదా? మన ఆలోచనలు చంచలమను మైలతో అంటియున్నవి కావా? దృశ్య విషయరాశి యెల్ల నాశనమగునవి కావా? సదా పరివర్తనము పొందుచుండుట లేదా? ఈ పరివర్తనమను బురదగుంటలో శాశ్వతముగ నుండగలదేది యున్నది? ప్రకృతి ప్రకాశమున కంతయు జీవాధార మేమి? జడ ప్రకృతికి చైతన్యమొసగునదెవరు? ఈ వివిధరూప ప్రపంచమునకు అధిష్ఠానమెవరు? సర్వ విషయరాశియందు వ్యాపించి యుండు సర్వేశ్వరుడెవరు? ఒక పుష్పహారమున దారమువలె విషయరాశులనెల్ల ప్రేమబంధముతో రక్షించు నాథుడెవరు? ఏది దృశ్యముగాక, అనుభవవేద్యమై, మన ఉనికికి అధిష్ఠానమై యున్నదో అదియే శుద్ధమగు ఎఱుక ఆత్మ.

ముందు మూడు శ్లోకములలో, తటస్థ న్యాయరీతిగ, "ఏది అన్వయముగా, అనన్యముగ నున్నదో అది" అని వర్ణింపబడెను. ఇది మొదలు స్వరూప లక్షణమున న్యాయరీతిగ, మనయందలి జీవచైతన్యము వర్ణింపబడుచున్నది.

శ్లో॥ అఖండానంద రూపస్య తస్యాఽఽనన్ద లవాశ్రితాః ।
బ్రహ్మాద్యాస్తార తమ్యేన భవన్త్యానన్దినోఽఖిలాః ॥ 58 ॥

తా॥ బ్రహ్మ, ఇంద్రుడు మొదలగు దేవతలు, బ్రహ్మయందలి ఆనందలవమును మాత్రము, తదంశ బలముచేత అనుభవించుచున్నాడు.

బ్రహ్మయొక్క ఆనంత స్వభావము అపారము. ఆ ఆనందమును ఆయా వ్యక్తి, వారి వారి శక్తికొలది ఆస్వాదించగలడు. సామాన్యమావుడైనను, దానధర్మ పరుడైనను, దేవతయైనను, వారి యోగ్యతకొద్ది ఆ ఆనందమును సేవించగలరు. బ్రహ్మమునందు ఒక అణుప్రమాణముగ దేవేంద్రుడున్నాడు. సృష్టికర్తయగు బ్రహ్మ కూడ ఈ అపార ఆనందరాశిలో తృణమాత్రము అనుభవింపగలుగుచున్నాడు.

బ్రహ్మయందు ఒక్క భాగమున ఈ ఆనంద ప్రపంచమంతయు ఆధారపడి యున్నది. ఇక ఆనందస్వరూప బ్రహ్మము యొక్క పూర్ణస్వరూపమును ఈ మనసు ఎట్లు ఊహించగలదు. ఈ అపార ఆనందమును ఇచ్చట కొలుచుయత్నము లేదు. సృష్టికర్త అనుభవింపగల ఆనందము కూడ అందలి లవమాత్రమని హెచ్చరిక చేయబడుచున్నది. అనగా, ఆ పరిపూర్ణ ఆనందమే నీవు.

శ్లో॥ **తద్యుక్త మఖిలం వస్తు వ్యవహారస్తదన్వితః ।**
తస్మాత్సర్వగతం బ్రహ్మ క్షీరే సర్పిరివాఖిలే ॥ 59 ॥

తా॥ సర్వవిషయరాశి యంతయు ఆత్మచే వ్యాపింపబడి యున్నవి. బ్రహ్మబలము వలన సర్వకర్మలు నడచుచున్నవి. కనుక, పాలయందు వెన్నవలె బ్రహ్మము ప్రతి వస్తువునందును వ్యాపించి యున్నాడు.

ఈ దృశ్యప్రపంచమునందు అధిష్ఠానమగు బ్రహ్మయొక్కటియే సత్యము, అది సర్వవ్యాపక స్వభావము కలది. కనుక, దానిబారినుండి తప్పించుకొనగల వస్తువు ఒకటియు లేదు. అన్ని ఆలోచనలు, అన్ని కార్యములు అతనివలన, ప్రకాశించుచున్నవి. మన దేహములోనగాని, బైటగాని లేక ప్రపంచమున ఎచ్చట గాని, అతని స్పర్శలేని వస్తువు లేదు. అతని అనుగ్రహము లేని యెడల ఈ జ్ఞానేంద్రియములెల్ల ఒట్టి డొక్కలుగ బాహ్యమునగల విషయ ప్రపంచమంతయు చైతన్యహీనము, జడముగ నుండును. అతని చైతన్య ఉష్ణమువలన వీటియందు జీవకళ ప్రకాశించుచున్నది.

పాలయందు వెన్న కనబడకపోయినను, అది పాలనంతయు వ్యాపించి యున్నది, అదే విధంగా బ్రహ్మము విషయరాశిలోనెల్ల వ్యాపించి యున్నాడు. పాలను పేరబెట్టి చిలుకుటవలన వెన్న దొరుకును. అదే విధముగా, బ్రహ్మమును ప్రపంచ నామరూపములను నిరసించి, ధ్యానమథనము చేయుటవలన దొరుకుచున్నాడు. బ్రహ్మానుభవమున దృశ్యప్రపంచమంతయు కానరాదు. వెన్నను చూచునపుడు పాలు కనపడవు.

శ్లో॥ అనణ్వస్థూల మహ్రస్వం అదీర్ఘ మజమవ్యయమ్ ।
అరూపగుణ వర్ణాఖ్యం తద్బ్రహ్మేత్యవధారయేత్ ॥ 60 ॥

తా॥ బ్రహ్మము స్థూలము కాదు, సూక్ష్మము కాదు, పొట్టి కాదు, దీర్ఘము కాదు, జననము లేదు, వ్యయము లేదు, నామ, రూప, గుణ, వర్ణ రహితమని తెలియవలెను.

విషయరాశియందెల్ల బ్రహ్మము వ్యాపించి యున్నాడని ముందు శ్లోకమున తెలుపబడెను. ఆ విషయమిచ్చట వివరించబడుచున్నది. బ్రహ్మము స్థూలము కాదు, సూక్ష్మము కాదు, సర్వమును వ్యాపించి యున్నది. సర్వాధిష్ఠానము. ఒక అణువును చీల్చిన, పిండిచేసిన అచ్చట కూడ దాని యునికి కనబడుచున్నది.

పరిమితిగల వస్తుసముదాయము స్థూల, సూక్ష్మములగుటవలన, కాలదేశ పరిమాణము కలిగియున్నవి. అనంత బ్రహ్మము కాలాతీతము, దేశాతీతము, కాలదేశ, కారణముల కతడు బద్ధుడగుటలేదు. కనుక వ్యతిరేక గుణములతో అతనిని వర్ణింపనగును.

జన్మము పొందునది ఈ దేహము. మనసు, బుద్ధి బాహ్య ప్రపంచమంతయు విషయరాశి సృష్టికి కారణాంశమగు బ్రహ్మము జనించుట లేదు. అతడు స్వయంభూః. ఈ అనంత సత్యస్వరూపము క్షీణించదు. రూపము లేదు. గుణములు లేవు. జాతిలేదు, నామము లేదు. అది అనిర్వచనీయము, స్పర్శకు దొరకదు. అనుభవమునకు రాదు. ఆలోచనలకు లొంగదు. ఇది వ్యతిరేక గుణ నిర్ణయ పరిభాష.

భాషకు కూడా పరిమితులున్నవి. గుణములను, క్రియలను విశేషములను

సంబంధమును మాత్రము భాష వర్ణించగలదు. ఇవన్నియు బ్రహ్మమందు లేవు, అతడు నిత్యనిరంతరుడు. సర్వాధిష్ఠానము కనుక అనిర్వచనీయము. ఇట్టి వ్యతిరేక గుణవర్ణనలు మన శ్రుతులందు మాత్రము కనబడుచున్నవి. ఇవన్నియు బ్రహ్మమునకు లక్షణములు, దారిచూపు కొయ్యగూటములవంటివి ఇవి. బ్రహ్మరూపములు కావు. గుణములు కావు. బ్రహ్మమును తెలియగల లక్షణములు.

శ్లో॥ యద్భాసా భాస్యతేఽర్కాది భాస్యైర్యత్తు న భాస్యతే ।
యేన సర్వమిదం భాతి తద్బ్రహ్మేత్యవధారయేత్ ॥ 61 ॥

తా॥ దేని ప్రకాశమువలన సూర్యచంద్రాదులు ప్రకాశించుచున్నారో, సూర్య చంద్రాదులు తమ ప్రకాశమువలన దేనిని ప్రకాశింపజేయలేకున్నరో అది బ్రహ్మమని తెలిసికొనుము.

నా చుట్టుప్రక్కల నుండు విషయరాశి యొక్క పరిస్థితులను నా యెఱుక నాకు ప్రకాశింపజేయుచున్నది. ఈ వ్యక్తిగత అహంకారము చేత పరిచ్ఛిన్నము గాని నా యందు ఎఱుక ప్రకాశమే. బ్రహ్మాండమున విశ్వప్రకాశ ఎఱుకయై యున్నది, సూర్యుడు వివిధ ప్రపంచములు సృష్టిపొందుకొలది వాటిని ప్రకాశింప జేయుచుండినను, సర్వవ్యాపక, బ్రహ్మచైతన్యము నుండియే తన జీవాధారము పొందుచున్నాడు. కనుక, సూర్యుడు, చంద్రుడు ప్రకాశించుటకు మనయందుండు ఆత్మ ఎఱుకకు అన్యముగ చైతన్యము వేరొకటి యుండుట లేదు. దేని ప్రకాశము వలన సర్వము ప్రకాశించుచున్నదో ఏది తనకన్య వస్తువుచేత ప్రకాశింపదో, అది శాశ్వత ప్రకాశక శక్తి. కనుక ప్రకాశింపజేయుటకు అన్యవిషయము దానికి అందకపోయినపుడు, తన్ను తాను ప్రకాశింపజేసుకొనుచుండును. అట్టి బ్రహ్మము, చైతన్య ప్రకాశము, తన స్వభావ వైభవము వలన, ఇతరులనంటదు, అంటించు కొనదు. వీధియందలి దీపము యొక్క వ్యవహారము ముందే వర్ణింపబడినది. బ్రహ్మము ఇట్టి జ్యోతులకు జ్యోతి, శుద్ధమగు జ్ఞానపుంజము, ప్రకాశముల నెల్ల వెలిగించు మహా ప్రకాశము.

శ్లో॥ స్వయమంతర్బహిర్వ్యాప్య భాసయన్నఖిలం జగత్ ।
బ్రహ్మ ప్రకాశతే వహ్ని ప్రతప్తాయసపిండవత్ ॥ 62 ॥

తా॥ అగ్నిచే కాగిన ఇనుపగుండువలె పరబ్రహ్మము, బ్రహ్మాండమునంతయు బహిరంతరమున వ్యాపించి, తాను ప్రకాశించుచుండును.

పరబ్రహ్మము నిత్యసత్యము, స్వయం ప్రకాశము. సృష్టిపొందిన ప్రపంచ మంతయు వ్యాపించి యుండును. అది సృష్టిపొందిన ప్రపంచమునకు అన్యముగ లేదు. ఎందుకనగ, నిమిత్తకారణము, ఉపాదాన కారణము రెండు తానగుటవలన, సృష్టిపొందిన ప్రపంచమున బాహ్యాంతరమున వ్యాపించి యున్నది. అదియే నిర్మల ఎఱుక. కనుక ప్రపంచ వ్యవహారములలో నుండు రంగములు సత్య స్వరూపమునకు అన్యమై యున్నవి.

చైతన్యములేని ప్రకృతి మృతస్వరూపము, ప్రకృతి చైతన్యముతో కూడి జీవాత్మను ప్రకాశింపజేయుచున్నది. పాలనుండి వెన్నను ఏర్పరచినట్లు, హృదయ గుహయందు ధ్యానము చేయుటవలన, ప్రతి అణువునయుండు పరమాత్మ చైతన్య శక్తి ప్రత్యక్షమగును.

ఒక ఇనుపగుండు చాలాకాలము అగ్నియందుండుట వలన, అగ్నివలెనే ప్రకాశించును. అదేవిధముగ, జడము, చైతన్యరహితము, నిర్జీవము అగు ప్రపంచ ప్రకృతి విషయములు బ్రహ్మచైతన్యము సోకుటవలన, జీవకళను పొంది ప్రకాశించు చున్నవి. సృష్టిపొందిన విషయరాశికి, పరమాత్మ చైతన్యము సోకని యెడల, మన మనుభవించగల రంగములు ఏర్పడజాలవు. ఆత్మకు జన్మము లేదు. మరణము లేదు. సర్వశక్తిమంతము, సర్వవ్యాపకము, సృష్టిపొందిన విషయ రాశియంతయు జన్మము కలవి. మరణించునవి, పరిచ్ఛిన్నములు అందువలన ఆత్మ, అనాత్మవస్తువులు పరస్పర విరోధస్వభావము కలిగి యున్నవి. కనుక ఆత్మ గుణములగు జ్ఞానము, అస్తిత్వము, అనాత్మ వస్తువులందు ఉండజాలవు. ఇందుకు

కనుక, వ్యష్టియగు పరిచ్ఛిన్న శరీర, మనోబుద్ధులందుగాని బాహ్య ప్రపంచమగు సమష్టియందుగాని, అస్తిత్వము పొంది యుండునదెల్ల ఆ ఆత్మ ప్రకాశముగాని వేరుకాదు. సత్యమును చక్కగ ఎఱిగి అనుభవించగలిగినచో ఈ బ్రహ్మాండమంతయు ఒక్కపెద్ద క్రీడారంగముగను అందు పరమాత్మ తన సత్తు చిత్తు ఆనంద రూపమున పరిపూర్ణ స్థితియందు "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" అన్నియు ఒక్కడే అనేక రూపనామములతో క్రీడించుచున్నాడని తెలియగలదు.

శ్లో॥ సర్వగం సచ్చిదాత్మానం జ్ఞానచక్షుర్నిరీక్షతే ।
అజ్ఞాన చక్షుర్నేక్షేత భాస్వంతం భాను మంధవత్ ॥ 65 ॥

తా॥ ఆత్మ, పరిశుద్ధముగ ఎఱుక, నిత్యనిరంతర నివాసి, అయినను ఈ దృశ్యము జ్ఞానదృష్టి వలననే తెలియగలదు. అజ్ఞాన ఆవరణము కలవారికిది గోచరించదు. గ్రుడ్డివారికి సూర్యుడు కనబడదు.

ఒక గ్రుడ్డివాడు సూర్యుని గుర్తించలేడు. అదే విధముగ, సూక్ష్మముగ క్రమ శిక్షణ పరివర్తనము పొందని వ్యక్తి, సత్యమును తెలిసికొనలేడు. అతనియందు జ్ఞానచక్షువు అభివృద్ధి పొందియుండదు.

నిత్యము, అనిత్యము అనే వేరువేరుగ పరికించి తెలియలేనివాడు, అశుద్ధమనసు కలిగియున్నాడు. అతనియందు విషయరాశియొక్క నిజతత్త్వము కనగొను పవిత్ర జ్ఞానప్రకాశము లేదు. అతని మనసు ఏకాగ్రత పొందుటకు తగు తపస్సు చేసి యుండుటలేదు. అనంత పరమాత్మయందు అతడు బాహ్యావిషయ రాశియొక్క పరిచ్ఛిన్న గుణముల నారోపించుచున్నాడు. అట్టి అసంస్కారిత వ్యక్తి, శాశ్వత నిత్యపరమాత్మయే తన నిజస్వరూపమని తెలియజాలడు. ఆత్మ పరిపూర్ణుడు, అనుటయందు లోపము లేదు. సాధకుని యందుగల ప్రతిబంధకములు, పరమాత్మ యొక్క సత్యస్వరూపమును ఆవరించి విక్షేపము కలిగించుచున్నది. సూర్యుడు దేదీప్యమానముగ ప్రకాశించుచుండినను, వ్యక్తియందలి గ్రుడ్డితనము వలన సూర్యుడు అంధకారమని అతడు తలచుచున్నాడు.

శ్లో॥ శ్రవణాదిభి రుద్దీప్త జ్ఞానాగ్ని పరితాపితః ।
జీవస్సర్వమలాన్ముక్తః స్వర్ణవద్ద్యోతతే స్వయమ్ ॥ 66 ॥

తా॥ పుటము పెట్టుటవలన బంగారమునకు వన్నె కలిగినట్టు శ్రవణ, మనన, నిధిధ్యాసములనబడు జ్ఞానాగ్నిచే పుటము పెట్టబడిన జీవుడు సర్వ మల వర్జితుడై స్వయం ప్రకాశియగుచున్నాడు.

వేదాంత జ్ఞానార్జితమున మూడు క్రమపద్ధతులు నిర్ణయించబడి యున్నవి. 1. శ్రవణ– శ్రుతులందుగల సత్యవాక్యములను, గురుముఖమున బోధపొందుట 2. మననం– తాను విన్న సత్యవాక్యముల గూర్చి తర్కించుకొనుట, 3. నిధిధ్యాసనము– తాను శ్రవణము చేసి, తర్కించుకొనిన సత్యవాక్యములపై తీవ్రధ్యానము సలుపుట.

పారమార్థిక క్రమశిక్షణవలన, మనసునందుగల మలినము తొలగి మనసు శుద్ధమగుచున్నది. అందువలన, అవిద్య నివారణ పొంది, పరిపూర్ణ సత్యము బోధపడుచున్నది. ఇది వ్యక్తియందు స్వయముగ కలుగు అనుభవమై యున్నది. శ్రద్ధావంతుడగు సత్యాన్వేషక సాధకునియందుగల సంశయములు, భ్రమలు తొలగుటవలన, అతని నిర్మల హృదయమున ఆత్మజ్ఞానము కొఱకు ప్రజ్వలించు ఆతురతయను జ్వాలచే అతడు తనయందే ఆత్మను తెలియుచున్నాడు. కనుక జీవాత్మయనబడు అహంకారజనిత వ్యక్తి, తన నిజ నిత్య ఆత్మస్వరూపము తెలియుటచే, తనకుండిన బంధకములను స్వయముగ తొలగించుకొనుచున్నాడు.

గనులలో నుండు బంగారం, ముడిలోహరూపమున వచ్చునపుడు అనేక రకములగు మలినములతో కలసి వచ్చుచున్నది. ఆ మట్టితో మిశ్రమై యుండు లోహమును అనేక విధముల కడిగి, శుభ్రపరచిన వెనుక కాచి మూసయందు పోయునపుడు తన నిజప్రకాశము, వైభవము కాంతితో ప్రకాశించుచున్నది. అదే విధముగా, ధ్యానాగ్నియందు కాగిన, వ్యక్తిభావము సంస్కారము పొంది, బహిర్ముఖము పొందు నపుడు, మూసయందు కరిగించిపోసిన లోహమువలె, తన అమృత స్వరూప నిత్యవైభవముతో ప్రకాశించును.

శ్లో॥ హృదాకాశోదితో హ్యాత్మా బోధభానుస్తమోఽపహృత్ ।
సర్వవ్యాపీ సర్వధారీ భాతి భాసయతేఽఖిలమ్ ॥ 67 ॥

తా॥ జ్ఞానభానుడగు ఆత్మ, హృదయాకాశము నుండి ఉదయించునపుడు అజ్ఞానాంధకారమును ధ్వంసముజేసి, సర్వమును వ్యాపించుచు, సర్వమున కధిష్ఠానమగును. తాను ప్రకాశించును, సర్వమును ప్రకాశింపజేయును.

హృదయమనగా గుండెయని అర్థము చేయుదురు. ఇచ్చట శరీరము నందలి రక్తప్రవాహమునకు కేంద్రమగు గుండెను ప్రశంసించబడుటలేదు. హృదయమనగా, ఉన్నత కరుణారసమయమగు ఆలోచనలు, భావములు ఉప్పొంగుచుండు మానసిక రంగమని తెలియవలెను. ఒక వ్యక్తి మిక్కిలి ప్రేమ స్వరూపుడు, మంచిగుణములు కలవాడైన అతనిని సుహృదయుడు, మంచి హృదయము కలవాడు అందుము.

మంచినీతి, పవిత్ర నడవడి కూడియుండిన, హృదయమున పారమార్థిక జ్ఞానముదయించును. దివ్య అనుభవములు సంభవించును.

ఉషః కాలము సమీపించుటతో, అంధకారము ద్రొల్లుకొని వెళ్ళును. సూర్య కిరణములు పొందుటవలన ప్రపంచమునగల సర్వవిషయములు మనకు గోచరమగుచుండును. అదే విధముగా జ్ఞానోదయము వలన సర్వ అజ్ఞానము తొలగి, జ్ఞానపరంపరలు మన ఎఱుకయందు ప్రకాశించుచుండను.

శ్లో॥ దిగ్దేశకాలాద్యనపేక్ష్య సర్వగం
శీతాది హృన్నిత్యసుఖం నిరంజనమ్ ।
య స్స్వాత్మతీర్థం భజతే వినిష్క్రియః
స సర్వవిత్సర్వగతోఽమృతో భవేత్ ॥ 68 ॥

॥ ఇత్యాత్మబోధః సమాప్తః ॥

తా॥ సర్వవిధ కర్మలను వదలి, దేశ, కాల అవస్థల పరిమితుల తొలగించుకొని, సర్వ అవస్థలయందుగల, శీతోష్ణములను ద్వంద్వముల నాశనము జేయుచు, నిర్మల సచ్చిదానందము, తన ఆత్మయని ఎవడు భజించుచున్నాడో, అతడు సర్వజ్ఞుడు సర్వవ్యాపియై, అమృత పదవిని అనుభవించుచుండును.

సముద్రముప్పొంగినను, శాంతముగ నున్నను సూర్యుని కిరణములు దానిపై వ్యాపించుచున్నవి. అదే విధముగ, సత్యస్వరూపుడగు నిర్మల ఆత్మకు దేశ, కాల, వ్యవహారముల మైల సోకదు. ఆత్మ సర్వవ్యాపి, అతనియందు ద్వైతభావము లేదు. అదియే శుద్ధమగు ఎఱుక ఆత్మ. ఈ బహురూప దృశ్యప్రపంచము వ్యవహరించగల అధిష్ఠానమతడు, ఈ సృష్టి పొందియుండు బ్రహ్మాండమునంతయు ప్రకాశింపజేయు ఏకైక ఆత్మ ఎఱుక. అతడు లేక ఎచ్చటగాని, దేనికిగాని, ఉనికి లేదు. అదియే నీ ఆత్మయని ఎఱుగుము.

సర్వకోరికలు, సర్వకర్మలు, రాగద్వేషములు వదలుకొని, అనిత్య విషయ ప్రపంచమునగల సంబంధమును చాలించుకొని తన ఆత్మానందమును గ్రోలుటకై ఆత్మమందిరమున నివసించ తీవ్ర ఇచ్ఛగల మహాత్ముడు, సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, బ్రహ్మము తానగుచున్నాడు. అతడు అమృతపదవి పొందును. ఆత్మపదవి పొంది, అది అంత్యములేని అమృతపదవిని అనుభవించు అమృతుడగుచున్నాడు.

స్వప్నము ముగియుటచేత, స్వప్నించుచుండినవాడు, జాగ్రత పొందిన వాడగు చున్నాడు. పరిచ్ఛిన్న అహంకారము, మనోబుద్ధులను ఉపాధుల నతిక్రమించుటచేత, అమృత బ్రహ్మము తానగుచున్నది.

...ఓం తత్సత్...